సంగీత మేరు శిఖరాలు
రూ॥120/-
పేజీలు:138



నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(అబిడ్స్),హిమాయత్‌నగర్,
బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★


ఇపిఎఫ్ఒ పరిమితి పెంచేందుకు పుష్కరకాల జాప్యం



03


సంపుటి 09, సంచిక: 288 | శుక్రవారం | 18 -09-2026 | మహబూబ్‌నగర్ Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar పేజీలు: 12+8 | వెల రూ. 5.00


## పోరాట యోధులకు
# తెలంగాణ పుట్టినిల్లు



- అస్తిత్వం, ఆత్మగౌరవం, హక్కుల కోసం ఎప్పటికప్పుడు ప్రజాచైతన్యాన్ని రగిలించిన నేల
- సమ్మక్క-సారలమ్మ పోరాటం నుంచి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం, ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం దాకా అన్యాయాన్ని ఎదిరించిన గడ్డ
- చరిత్రను మరువం – అక్కడే ఆగిపోం
- పోరాట స్ఫూర్తితో ఆధునిక తెలంగాణను నిర్మించుకుందాం

**ప్రజాపాలన దినోత్సవంలో సిఎం రేవంత్‌రెడ్డి ఉద్ఘాటన**

ప్రజాపక్షం/హైదరాబాద్



తరతరాల అణచివేత, దోపిడీ, భూస్వామ్య, పెత్తందారీ విధానాలపై ధిక్కార స్వరం వినిపించిన నేల తెలంగాణ అని, నిరంకుశ పాలకులకు వ్యతిరేకంగా ప్రాణాలకు తెగించి పోరాడిన యోధులకు పుట్టినిల్లు తెలంగాణ అని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అన్నారు. అస్తిత్వం, ఆత్మగౌరవం, హక్కుల కోసం ఈ నేల ఎప్పటికప్పుడు ప్రజా చైతన్యాన్ని రగిలించిందని, సమ్మక్క సారలమ్మల పోరాటం నుంచి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమం వరకు అన్యాయాన్ని ఎదిరించడం తెలంగాణ గడ్డ స్వభావమన్నారు. చరిత్రను మరిచిపోబోమని, ఆ చరిత్ర వద్దనే ఆగిపోకుండా ఆ పోరాట స్ఫూర్తితో ఆధునిక తెలంగాణను నిర్మించుకుందామని, నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల భాగస్వామ్యంతో తెలంగాణను ప్రపంచం గర్వించే రాష్ట్రంగా తీర్చిదిద్దుకుందామని సిఎం పిలుపునిచ్చారు. 'సెప్టెంబర్ 17''ను పురస్కరించుకుని తరువాయి 8లో





**అధికారికంగా విలీన దినోత్సవం జరిపేందుకు**

# పాలకులకు భయమెందుకు?

- రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించిన సిపిఐ నేతలు
- తెలంగాణ రైతాంగ సాయుధపోరాట అమరుల త్యాగఫలితమే హైదరాబాద్ సంస్థానం విలీనమని ఉద్ఘాటన
- వీరోచిత సాయుధ పోరాట చరిత్రను గుర్తించాల్సిందేనని డిమాండ్
- హైదరాబాద్‌లోని ఎగ్జిబిషన్ మైదానంలో తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తి సభ

ప్రజాపక్షం/హైదరాబాద్

ప్రపంచ చరిత్రలోనే 4500 మంది అమరవీరుల రక్తతర్పణంతో లిఖించబడిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను గుర్తించేందుకు, విలీన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించ డానికి పాలకులకు భయమెందుకని సిపిఐ నాయకులు ప్రశ్నించారు. తెలంగాణ విలీన దినోత్సవ వేడుకలను అధికారికంగా నిర్వహిస్తే కొంత మంది బాధపడతారని గత ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు చెప్పిన విషయాలనే నేటి ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి కూడా చెబుతున్నారని విమర్శించారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట అమరుల త్యాగాల ఫలితమే నాటి హైదరాబాద్ సంస్థానం విలీనం, నేటి ప్రత్యేక తెలంగాణ రాష్ట్రమని వారు స్పష్టం తరువాయి 12లో

## రేవంత్‌రెడ్డి వచ్చిన తర్వాతే కాంగ్రెస్‌ది ప్రజాపాలనా? : పల్లా



తెలంగాణ స్వాతంత్ర దినోత్సవమైన సెప్టెంబర్ 17ను కాంగ్రెస్ ప్రభుత్వం 'ప్రజా పాలన దినోత్సవం'గా బిఆర్ఎస్ 'సమైక్యత దినోత్సవం', బిజెపి 'విమోచనం దినోత్సవం' పేరుతో బహిరంగ సభలను నిర్వహించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని పల్లా వెంకట రెడ్డి అన్నారు. తెలంగాణ విలీన దినోత్సవం అధికారికంగా నిర్వహించడం వల్ల కొంత మంది బాధపడుతారని గతంలో నాటి ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు నిసిగ్గుగా చెప్పిన విషయాలనే తరువాయి 12లో

## బిజెపి నాయకులు చరిత్ర విచ్ఛిన్నకారులు : కూనంనేని



తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం వారుసులుగా సెప్టెంబర్ 17ను 'తెలంగాణ స్వాతంత్ర దినోత్సవం' పేరుతో ఉత్సవాలు జరుకుంటుంటే కాంగ్రెస్ 'ప్రజాపాలన' బిఆర్ఎస్ 'సమైక్యత దినోత్సవం', బిజెపి 'విమోచన దినోత్సవం' పేరుతో సభలు జరుపుకోవడం సిగ్గుచేటని కూనంనేని సాంబశివరావు విమర్శించారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం చరిత్రను చరిత్రగా గుర్తించలేని కాంగ్రెస్, బిజెపి నాయకులు చరిత్ర నిర్మాణకారులు కాదని, తరువాయి 12లో

ఆర్‌టిసి ఎన్నికల జాప్యంపై

## 22న మహాధర్నా

**అక్టోబర్ మొదటి వారంలోగా ఎన్నికలు నిర్వహించాలి: ఎంప్లాయీస్ యూనియన్**

ప్రజాపక్షం/హైదరాబాద్

ఆర్‌టిసిలో గుర్తింపు సంఘ ఎన్నికల షెడ్యూల్‌ను వెంటనే ప్రకటించి, అక్టోబర్ మొదటి వారంలోగా ఎన్నికలు నిర్వహించాలని తెలంగాణ ఆర్‌టిసి ఎంప్లాయీస్ యూనియన్ డిమాండ్ చేసింది. ఎన్నికల ప్రక్రియ ప్రారంభమై ఐదు నెలలు గడిచినా షెడ్యూల్ ప్రకటించడంలో జాప్యం జరుగుతోందని యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్. బాబు, ప్రధాన కార్యదర్శి ఈదురు వెంకన్న ఆరోపించారు. ఎన్నికల తర్వాతే ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేస్తామని ప్రభుత్వం చెబుతున్న నేపథ్యంలో, ఎన్నికల ప్రక్రియను ఆలస్యం చేయడం వల్ల విలీన ప్రక్రియ కూడా వాయిదా పడుతోందని వారు పేర్కొన్నారు. ప్రతి నెల వందలాది మంది ఉద్యోగులు పదవీ విరమణ చేస్తున్నారని, వారికి విలీనం ద్వారా లభించే ప్రయోజనాలు అందకుండా పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలలో జాప్యాన్ని నిరసిస్తూ సెప్టెంబర్ 22న తరువాయి 8లో

పోలీసు ఉద్యోగాల పరీక్షలకు

## తేదీలు ఖరారు

నవంబర్ 29న ఎస్ఐ ప్రిలిమినరీ రాత పరీక్ష

డిసెంబర్ 20న కానిస్టేబుల్ పరీక్ష

03

మహనీయుల త్యాగాలతోనే..

## భారత్‌లో హైదరాబాద్ విలీనం

- 'తెలంగాణ విమోచన దినోత్సవ'ంలో ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్

ప్రజాపక్షం/హైదరాబాద్





హైదరాబాద్ సంస్థానం భారత్‌లో అంతర్భాగం కావడానికి ఎంతో మంది మహనీయులు ప్రాణ త్యాగాలు చేశారని భారత ఉపరాష్ట్రపతి సిపి రాధాకృష్ణన్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన 'తెలంగాణ విమోచన దినోత్సవ' వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పరేడ్ గ్రౌండ్స్‌లోని పోలీస్ అమరవీరుల స్మృతి స్థూపం వద్ద నివాళులర్పించిన ఆయన, అనంతరం జాతీయ జెండాను ఎగురవేసి సాయుధ బలగాల గౌరవ వందనం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లా, కేంద్ర మంత్రులు జి.కిషన్ రెడ్డి, గజేంద్ర సింగ్ షెకావత్, బండి సంజయ్, ఎంపి ఈటల రాజేందర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపరాష్ట్రపతి మాట్లాడుతూ 1948లో చేపట్టిన ఆపరేషన్ పోలో ద్వారానే హైదరాబాద్ స్వాతంత్ర్యం సాధ్యమైందని, సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ దార్శనికత బలమైన భారత్ నిర్మాణానికి తోడ్పడిందని కొనియాడారు. కుమురం భీం, రాంజీ గోండు, తుర్రేబాజ్ ఖాన్ వంటి యోధుల త్యాగాలు భావితరాలకు స్ఫూర్తిదాయకమన్నారు. దేశ ప్రజలందరికీ సమాన హక్కులు, సమాన అవకాశాలు కల్పించినప్పుడే తరువాయి 8లో



సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో

## విచారణకు సిద్ధమా?

**కెసిఆర్, రేవంత్‌రెడ్డి కుటుంబాలకు చెందిన ఆస్తులపై బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ సవాల్**

- కెసిఆర్ పుట్టిందే వందల ఎకరాల ఆస్తులున్న కుటుంబంలో అని వెల్లడి
- కొండల్‌రావు ఆస్తులను కెసిఆర్ ఖాతాలో వేస్తూ అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని మండిపాటు

ప్రజాపక్షం/హైదరాబాద్

మాజీ సిఎం కెసిఆర్ ప్రస్తుత సిఎం రేవంత్ రెడ్డి ఇద్దరి కుటుంబాలకు చెందిన ఆస్తులపైన హైకోర్టు లేదా సుప్రీం కోర్టు సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణకు సిద్ధమా? అని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు సవాల్ తరువాయి 8లో

సున్నా ఎకరాల నుంచి

## రూ.వేల కోట్లకు ఎలా ఎదిగారు?



**కెసిఆర్ 2004 అఫిడవిట్‌పై మంత్రి పొంగులేటి సంచలన వ్యాఖ్యలు**

పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో నిజమైన తెలంగాణ ఉద్యమకారులకు అప్పులే మిగిలాయని విమర్శ కెసిఆర్ కుటుంబానికి లక్షల కోట్ల ఆస్తులు వచ్చాయని ఆవేదన

ప్రజాపక్షం/హైదరాబాద్

బిఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు (కెసిఆర్) ఎన్నికల అఫిడవిట్‌లలో ప్రకటించిన ఆస్తుల వివరాలపై మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. కెసిఆర్ స్వయంగా తరువాయి 8లో

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల

## ఓటర్ల జాబితా షెడ్యూల్ విడుదల





ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణలోని రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గాల స్థానాలకు ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన ప్రాథమిక కసరత్తు ప్రారంభమైంది. మహబూబ్ నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ స్థానంతో పాటు వరంగల్, ఖమ్మం, నల్లగొండ గ్రాడ్యుయేట్ నియోజకవర్గ స్థానాలు 2027 మార్చి నాటికి ఖాళీ కానున్న నేపథ్యంలో నూతన ఓటర్ల జాబితా ప్రక్రియ ప్రారంభించేందుకు నోటిఫికేషన్ షెడ్యూల్‌ను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సిఈఓ) సి. సుదర్శన్ రెడ్డి గురువారం విడుదల చేశారు. ఈ నూతన షెడ్యూల్ ప్రకారం, 2026 నవంబర్ 1 నాటికి తరువాయి 8లో



## స్వీడన్ ఎన్నికల్లో వామపక్షాల గెలుపు

**ప్రధానమంత్రి క్రిస్టెర్‌సన్ రాజీనామా**

కొత్త ప్రధానిగా ఆండర్‌సన్‌కే అవకాశం

స్టాక్‌హోమ్ : స్వీడన్ ఎన్నికల్లో ముందుగా ఊహించిన విధంగానే వామపక్ష కూటమి స్వల్ప ఆధిక్యంతో పార్లమెంటు అధికారాన్ని కైవసం చేసుకుంది. పోల్ సర్వేలు ముందుగానే ఈ విషయాన్ని స్పష్టం చేశాయి. అధికార, ప్రతిపక్ష తరువాయి 8లో

# 100% భారత్, చైనాలపై ట్రంప్ సుంకాలు

- రష్యాపై ఆర్థిక ఒత్తిడి పెంచేందుకు ఆంక్షల బిల్లు ఆమోదం
- బిల్లుకు 57 మంది డెమోక్రాట్ల మద్దతు



**వాషింగ్టన్ :** రష్యాపై తీవ్రమైన ఆర్థిక ఒత్తిడి తీసుకువచ్చేందుకు ట్రంప్ ఆలోచనల మేరకు ఆంక్షలబిల్లును అమెరికా కాంగ్రెస్ గురువారం ఆమోదించింది. దీంతో రష్యా నుండి చమురు, సహజవాయువులను దిగుమతి చేసుకునే భారత్–చైనా సహా ఐదు అగ్రదేశాలపై నూటికి నూరుశాతం సుంకాలు విధించేందుకు డోనాల్డ్ ట్రంప్‌కు అపారమైన అధికారాలు లభించాయి. ఈ బిల్లుకు అనుకూలంగా 262 మంది,వ్యతిరేకంగా 159 మంది ఓటు వేశారు. బిల్లు ఇక చట్ట రూపం దాల్చడానికి అధ్యక్షుడి సంతకానికి వెళుతుంది.అనుకూలంగా ఓటు వేసినవారిలో అధికార రిపబ్లికన్‌పార్టీకి చెందిన 202 మంది ప్రతినిధులుండగా, ప్రతిపక్షం నుండి 57 మంది డెమోక్రటిక్ సభ్యులు ఉన్నారు. పార్టీ ఆదేశాన్ని ఉల్లంఘించి వారంతా అనుకూల ఓటు వేశారు. ఒక ఇండిపెండెంట్ కూడా అనుకూలంగా ఓటు వేశారు.రిపబ్లికన్‌పార్టీ నుండి తొమ్మిదిమంది నెగెటివ్ ఓటు వేశారు. డెమోక్రాట్స్‌లో ఏడుగురు నెగెటివ్ ఓటు తరువాయి 8లో



యూట్యూబర్ వైష్ణవి భర్త

## దారుణహత్య

**పదునైన ఆయుధంతో హరిబాబుపై దుండగుల దాడి**

ప్రజాపక్షం/నిజామాబాద్ అర్బన్

యూట్యూబర్ వైష్ణవి హత్యకేసులో నిందితుడు, ఆమె భర్త చిత్తరి హరిబాబు(26) నిజామాబాద్ నగరంలో దారుణ హత్యకు గురయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గత కొన్ని రోజులుగా హరిబాబు తన తల్లితో కలిసి తరువాయి 8లో

ఐరోపాలో యుద్ధం, పశ్చిమాసియాలో ఉద్రిక్తత, పైపైకి పోతున్న అంతర్జాతీయ ముడిచమురు ధరలు, వర్షాభావ పరిస్థితులు, ఆగని రూపాయి మారక విలువ పతనం వంటి పలు అంశాలు ఆర్థిక శాస్త్రవేత్తల చర్చల్లో వినిపించే పదాలుగా కనిపించవచ్చు. కానీ సామాన్యుడి జీవితంలో వీటి అర్థం చాలా సూటిగా ఉంటుంది. జీవితాన్ని ప్రభావితం చేస్తుంది. మార్కెట్‌కు వెళ్లినప్పుడు అదే సరుకుకు ఎక్కువ డబ్బు చెల్లించాలి. వంటింటి ఖర్చు పెరుగుతుంది. ప్రయాణ ఖర్చు పెరుగుతుంది. చిన్న వ్యాపారి ఖర్చు పెరుగుతుంది. చివరికి కుటుంబ బడ్జెట్‌లో మిగిలే మొత్తం తగ్గుతుంది. ప్రభుత్వం సోమవారం విడుదల చేసిన ఆగస్టు మాసానికి చెందిన ద్రవ్యోల్బణ గణాంకాలు ఈ ప్రమాదాన్ని మరోసారి గుర్తు చేస్తున్నాయి. టోకు ధరల ఆధారిత ద్రవ్యోల్బణం జులైలో 9.78 శాతం ఉండగా, ఆగస్టులో 9.92 శాతానికి పెరిగింది. ప్రజల జీవన ప్రమాణాన్ని దారుణంగా తగ్గించింది. ఆహార పదార్థాలు, ఇంధనం, తయారీ వస్తువుల ధరలు ఈ పెరుగుదలకు ప్రధాన కారణాలు. ముఖ్యంగా ఇంధనం, విద్యుత్ విభాగాలలో ద్రవ్యోల్బణం 20.05 శాతం నుంచి 22.93 శాతానికి ఎగబాకడం ఆందోళన కలిగించే అంశం. అదే సమయంలో వినియోగదారుల ధరల సూచీ ఆధారిత రిటైల్ ద్రవ్యోల్బణ సూచీ (సిపిఐ) జులైలో 4.45 శాతం నుంచి ఆగస్టులో 4.82 శాతానికి పెరిగింది. ఆహార ద్రవ్యోల్బణం 5.52 శాతం నుంచి 5.95 శాతానికి చేరింది. ఉల్లిపాయ ధరల పెరుగుదల ఏకంగా 48.27 శాతానికి చేరింది. వెల్లుల్లి 43.6 శాతం, అల్లం 73.82 శాతం ద్రవ్యోల్బణాన్ని నమోదు చేశాయి. టమాటా, బంగాళాదుంప వంటి కొన్ని కూరగాయల ధరలు తగ్గినా, వంటింటి మొత్తం ఖర్చుపై ఒత్తిడి తగ్గలేదని అది సరిపోలేదు. ఈ గణాంకాల్లో అత్యంత ముఖ్యమైన విషయం రిటైల్ ద్రవ్యోల్బణం ఎంత ఉందన్నదని అనేది కంటే, హోల్‌సేల్ ధరల ఒత్తిడి రేపటి రిటైల్ ధరలకు ఏ సంకేతం ఇస్తున్నదన్నది ప్రధానం. తయారీ వస్తువుల హోల్‌సేల్ ద్రవ్యోల్బణం కొత్త సిరీస్‌లో అత్యధికంగా 8.37 శాతానికి చేరింది. పశ్చిమాసియాలో కొనసాగుతున్న సంక్షోభం ఈ పరిస్థితిని మరింత క్లిష్టం చేసింది. అంతర్జాతీయ ఇంధన ధరలు పెరిగితే భారతదేశం వంటి భారీ దిగుమతి ఆధారిత ఆర్థిక వ్యవస్థపై దాని ప్రభావం తప్పదు. ముడిచమురు ధర పెరిగితే పెట్రోల్, డీజిల్ ధరలకే పరిమితం కాదు. రవాణా, వ్యవసాయం, విద్యుత్, పరిశ్రమ, విమానయానం, ప్లాస్టిక్, రసాయనాల దాకా ప్రతి రంగం మీద, చివరికి సామాన్యుడి భుజాలపై పడుతుండటం బహిరంగ రహస్యం. ధరలు పెరుగుతున్నంత వేగంగా ఆదాయాలు పెరగవు. జీతాలు పెరగవు. కుటుంబ అవసరాలు

# పెరిగిన ద్రవ్యోల్బణం తగ్గిన జీవన ప్రమాణం

తగ్గవు. ఫలితంగా జీవన ప్రమాణాలు దారుణంగా పతనమవుతాయి. తక్కువ ఆదాయ కుటుంబాలు తమ ఆదాయంలో అధిక భాగాన్ని ఆహారం, ఇంధనం, రవాణాపైనే ఖర్చు చేస్తాయి. ధరలు పెరుగుదల వారిని పొదుపుల నుండి దూరం చేస్తుంది. అప్పులపై ఆధారపడే పరిస్థితిని పెంచుతుంది. ఈ పరిస్థితిని చక్కదిద్దడమే ఇప్పుడు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) ముందున్న ప్రధాన సవాలు. రిటైల్ ద్రవ్యోల్బణాన్ని ప్రధానంగా పరిగణించే ఆర్‌బిఐ ద్రవ్య విధాన కమిటీ అక్టోబర్ 5 నుంచి 7 వరకు సమావేశం కానున్న నేపథ్యంలో, ద్రవ్యోల్బణాన్ని అదుపులో ఉంచేందుకు వడ్డీ రేట్లు పెంచే అవకాశాలపై దృష్టి సారించవచ్చు. దీనివల్ల సామాన్యుడికి వచ్చే సత్వర ఊరట అంటూ ఏదీ ఉండదు. కాబట్టి, ఈ దశలో కేవలం వడ్డీ రేటును పెంచడం సరిపోదు. ఆర్‌బిఐ ద్రవ్య విధానం, కేంద్ర ప్రభుత్వ ఆర్థిక విధానం, రాష్ట్రాల మార్కెట్ జోక్యం పరస్పరం సమన్వయంతో పనిచేయాలి. ద్రవ్యోల్బణం సరఫరా వైపు నుంచి వస్తున్నప్పుడు దానికి మొత్తం సమాధానాన్ని వడ్డీ రేటులో వెతకడం సరైన విధానం కాదు.

ఆహార సరఫరా గొలుసుపై ప్రభుత్వం ముందుగా దృష్టి పెట్టాలి. నిత్యావసరాల ధరల్లో భారీ హెచ్చుతగ్గులు రైతుకూ, వినియోగదారుడికీ నష్టం చేస్తాయి. రైతు పంటకు మంచి ధర రాకపోవచ్చు. వినియోగదారుడు కొన్ని నెలల తర్వాత అదే పంటకు అధిక ధర చెల్లించాల్సి రావచ్చు. మధ్యవర్తులు లేదా దళారీలు, నిల్వ సామర్థ్యం, కోల్డ్ స్టోరేజీ, రవాణా, మార్కెట్ సమాచారం వంటి సమస్యలను పరిష్కరించకుండా ధరల స్థిరత్వం సాధ్యం కాదు. ప్రభుత్వం అవసరమైన సమయంలో బఫర్ స్టాకులను ఉపయోగించాలి. మార్కెట్లో కొరత ఏర్పడినప్పుడు నిల్వలను విడుదల చేయడం, అధిక ధరల సమయంలో దిగుమతులను తాత్కాలికంగా సులభతరం చేయడం, ఎగుమతి విధానంలో ఆకస్మిక మార్పులను తగ్గించడం వంటి చర్యలు తీసుకోవాలి. అయితే ఇలాంటి జోక్యాలు రైతు ప్రయోజనాలను దెబ్బతీయకుండా జాగ్రత్తగా రూపొందించాలి. వినియోగదారుడికి తక్కువ ధర కల్పించాలనే ఉద్దేశంతో రైతు ఆదాయాన్ని దెబ్బతీస్తే దీర్ఘకాలంలో ఉత్పత్తి తగ్గి సమస్య మరింత తీవ్రమవుతుంది. ఇంధన రంగంలో ప్రభుత్వం మరింత ముందు చూపుతో వ్యవహరించాలి. అంతర్జాతీయ ముడిచమురు ధరలు పెరిగిన ప్రతిసారీ దేశీయ ధరలు పెరిగే పరిస్థితి ఆర్థిక వ్యవస్థకు ప్రమాదకరం. వ్యూహాత్మక పెట్రోలియం నిల్వలను సమర్థంగా ఉపయోగించడం, దిగుమతి వనరులను విస్తరించడం, దేశీయ శుద్ధి సామర్థ్యాన్ని పెంచడం, పునరుత్పాదక ఇంధనాన్ని వేగంగా విస్తరించడం వంటి చర్యలకు ఇప్పుడు మరింత ప్రాధాన్యం ఇవ్వాలి. ఇవి ఒక్క నెలలో ధరలను తగ్గించకపోయినా, భవిష్యత్తులో అంతర్జాతీయంగా ఏర్పడే తీవ్రమైన ఆర్థిక ప్రకంపనలు, ఒడిదుడుకుల ప్రభావాన్ని తగ్గిస్తాయి. ధరల సమాచారాన్ని ప్రజలకు మరింత పారదర్శకంగా అందించడం కూడా అత్యవసరం. ఏ వస్తువు ధర ఎందుకు పెరిగింది? ఉత్పత్తిదారుడికి ధర ఎంత పెరిగింది? రవాణా ఖర్చు ఎంత పెరిగింది? మధ్యవర్తుల వాటా ఎంత మారింది? దిగుమతి ధర ప్రభావం ఎంత? ఇలాంటి సమాచారాన్ని క్రమం తప్పకుండా ప్రజల ముందుంచాలి. ద్రవ్యోల్బణం గురించి గణాంకాలను విడుదల చేయడంతో ప్రభుత్వ బాధ్యత తీరిపోదు. ఆ గణాంకాల వెనుక ఉన్న కారణాలను ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలి. టోకు ధరల పెరుగుదల, ద్రవ్యోల్బణ సమస్య ప్రస్తుత సామాన్యుడి జీవితాన్ని అస్తవ్యస్తం చేస్తున్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో, ఇప్పటికిప్పుడు ద్రవ్యోల్బణాన్ని పూర్తిగా అదుపులోకి తీసుకురావడం సులభం కాకపోవచ్చు. కానీ, సరైన నిర్ణయాలు తీసుకొని, వాటిని సమర్థంగా అమలుచేస్తే, పరిస్థితి కొంతవరకైనా మెరుగుపడవచ్చు. భారత ఆర్థిక వ్యవస్థకు విస్తారమైన మార్కెట్, విస్తృత ఉత్పత్తి సామర్థ్యం, బలమైన వ్యవసాయ ఆధారం ఉన్నాయి. ప్రభుత్వం ఇప్పుడు చేయాల్సింది సంక్షోభం వచ్చిన తర్వాత స్పందించడం కాకుండా ముందుగానే సరఫరా వ్యవస్థను సిద్ధం చేయడం. ఆహార నిల్వలు, ఇంధన భద్రత, వ్యవసాయ మార్కెట్లు, రవాణా మౌలిక సదుపాయాలు, దిగుమతి విధానం, చిన్న వ్యాపారాలకు ఆర్థిక సహాయం వంటివి ఒకే ద్రవ్యోల్బణ వ్యూహంలో భాగం కావాలి. ధరలు పెరిగిన తర్వాత ఉపశమన చర్యలు ప్రకటించడం కంటే, ధరలు పెరగకుండా సరఫరా వ్యవస్థను బలోపేతం చేయడం అవసరం. ప్రజల ఆదాయాన్ని పెంచే విధానాలు, ఆహార భద్రతను కాపాడే చర్యలు, ఇంధన దిగుమతి ప్రమాదాన్ని తగ్గించే దీర్ఘకాల వ్యూహం, పారదర్శక మార్కెట్ పర్యవేక్షణలే ద్రవ్యోల్బణ నియంత్రణకు సరైన సమాధానాలు. ●



## ప్రపంచానికి శుభ సంకేతం

ప్రపంచ అగ్రదేశాలు చైనా–అమెరికా మధ్య పరస్పర సమానత్వం ఉండాలి. సమాన గౌరవం ఉండాలి. పరస్పర ప్రయోజన స్ఫూర్తి కొనసాగాలి. సహకారాన్ని ముందుకు తీసుకెళ్ళాలి. అన్నిటికంటే ముఖ్యంగా విభేదాలు పరిష్కరించుకోవాలి. ఒకరి కీలక ప్రయోజనాలను మరొకరు గౌరవించుకోవాలి. నిర్మాణాత్మక, వ్యూహాత్మక సంబంధాలను పెంపొందించాలి. ప్రపంచశాంతిని, అభివృద్ధిని ఉమ్మడిగా ప్రోత్సహించడం అగ్రదేశాల కీలక బాధ్యత. ఇరుదేశాలు ప్రపంచ శాంతికి దోహదపడదాయన్న సానుకూల సందేశం ముందుగా ప్రపంచానికి పంపించాలి.

– చైనా విదేశాంగమంత్రి వాంగ్ యీ




## మానవాళికి నీరే జీవనాధారం

జీవులకు ప్రాణాధారం నీరు మాత్రమే. నీరు ఒక సార్వత్రిక ద్రావణి. జలం లేకుండా జీవనం సాగదు. ప్రకృతి ప్రసాదించిన సహజ అమూల్య వనరులుగా నీటి నిల్వలు కలిపిస్తాయి. నదులు, సరస్సులు, చెరువులు, వాగులు, సముద్రాలు, భూగర్భజలాలు లాంటి పలు నీటి వనరులు సకల ప్రాణికోటికి అందుబాటులో ఉన్నాయి. రసాయనశాస్త్రపరంగా నీటిని త్రిపరమాణుక విజాతీయ అణువుగా నామకరణం చేశారు. రెండు హైడ్రోజన్ పరమాణువులు, ఒక ఆక్సిజన్ పరమాణువు కలిసి $H_2O$ అను రసాయన ఫార్ములాతో సూచించడం జరుగుతోంది. కలుషిత నీరు తాగితే కలరా, డయేరియా, టైఫాయిడ్, డిసెంట్రీ, హెపటైటిస్, మలేరియాసిస్ లాంటి తీవ్రమైన వ్యాధులు సోకుతాయి. మానవాళి ఎదుర్కొంటున్న 80 శాతం రోగాలకు కలుషిత తాగు నీరే కారణమని తెలుస్తున్నది. ప్రపంచ మరణాల్లో 5 శాతం వరకు కలుషిత నీటివల్ల కలుగుతున్నట్లు నిర్ధారించారు. భారత్‌లో 70 మిలియన్ల మరణాలు డయేరియా కారణంగా నమోదు అవుతున్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనాల ప్రకారం, విశ్వవ్యాప్తంగా ప్రతి ముగ్గురు జనాభాలో ఒక్కరు సురక్షిత నీటికి దూరంగా ఉన్నట్లు తెలుస్తున్నది.

**సురక్షిత తాగు, సాగు నీటి కోసం యుద్ధాలు వద్దు:**

నీటి వనరులను పరిశుభ్రంగా ఉంచుకోవడం, తరుచుగా నీటి నాణ్యతను పరీక్షించుకోవడం, సురక్షిత తాగు నీటి అవసరాలను అవగాహన పరచడం, సభలు/ సమావేశాలు నిర్వహించి నీటి పర్యవేక్షణ ప్రాధాన్యాన్ని వివరించడం లాంటి కార్యక్రమాలను చేపట్టాలి. నీటి రవాణాలో లీకేజీలను అడ్డుకోవడం, నల్లా నీరు వృధా కాకుండా చూసుకోవడం, సూక్ష్మ సేద్యం చేయడం, స్ప్రింక్లర్లను వాడడం, నీటి పొదుపు పట్ల విద్యార్థులకు అవగాహన కలిపించడం లాంటివి వివరించాలి. గ్రామీణ భారతంలో 83 శాతం, పట్టణ జనాభాలో 91 శాతం జనాభాకు సురక్షిత నీరు లభిస్తున్నట్లు ప్రభుత్వ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. పేదరికం, అధిక జనాభా, నిరక్షరాస్యత వంటి కారణాలు కూడా సురక్షిత నీటి లభ్యతకు ప్రతిబంధకాలుగా పనిచేస్తున్నాయి. విద్య, వైద్యం, సురక్షిత తాగు నీరు లభించడం ఒక ప్రాథమిక హక్కు అని తెలుసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాల మీద అధికంగా ఉన్నది. నీటిని పొదుపుగా వాడుకుంటూ, కలుషితం కాకుండా చూసుకుంటూ, ఆయురారోగ్యాలతో మనుగడ సాగిద్దాం, నీటి ఆధార అనారోగ్యాలకు అడ్డుకట్ట వేద్దాం.

*(18 సెప్టెంబర్ ప్రపంచ నీటి పర్యవేక్షణ దినం సందర్భంగా)*

# జెఎన్‌యులో శరవేగంగా కాషాయీకరణ

**సవేరా**

భారతదేశంలోని అత్యుత్తమ ప్రభుత్వ విశ్వవిద్యాలయాలలో ఒకటిగా, ముఖ్యంగా పోస్ట్ గ్రాడ్యుయేట్ అధ్యయనాలు, పరిశోధనలకు జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం (జెఎన్‌యు) ప్రసిద్ధి. ఆ యూనివర్సిటీ అధ్యాపకుల నియామకాలలో జరుగుతున్న అవకతవకలపై రిపోర్టర్స్ కలెక్టివ్ (ఆర్‌సి) ఇటీవల వెలువరించిన ఒక నివేదిక ప్రజల దృష్టిని విస్తృతంగా ఆకర్షించింది. నియామక ప్రక్రియలో నిబంధనలను దారుణంగా, ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘించిన ఏడు ఉదంతాలను ఆర్‌సి బహిర్గతం చేసింది. అయితే, అసలు కథ ఈ ఏడు కేసులకు మాత్రమే పరిమితం కాదు, లేదా ప్రత్యేకంగా వాటికే సంబంధించినది కూడా కాదు. ఇది కేవలం నిబంధనల ఉల్లంఘన గురించి మాత్రమే కాదు, ఒక ప్రభుత్వ విశ్వవిద్యాలయంలో అధ్యాపకుల నియామకాలను నియంత్రించే నిబంధనల వెనుక ఉన్న ప్రధాన లక్ష్యాలను పద్ధతి ప్రకారం దెబ్బతీయడం గురించినది. ఈ ఏడు ఉదంతాలు జెఎన్‌యులోని అధ్యాపకుల నియామక ప్రక్రియలో పాతుకుపోయిన ఒక లోతైన రుగ్మతకు కేవలం లక్షణాలు మాత్రమే. ఇది ఒక ప్రముఖ విశ్వవిద్యాలయం నాశనమయ్యే ప్రక్రియలో ఒక ముఖ్యమైన అంశాన్ని సూచిస్తుంది.

నివేదించిన ప్రతి కేసులోనూ నియమితులైన వారు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యుజిసి) నిబంధనలలో నిర్దేశిత కనీస అర్హత షరతులను నెరవేర్చలేదనేది ఆరోపణ. ఇది కేవలం పొరపాటు కాదు. అభ్యర్థులు దరఖాస్తులు సమర్పించినప్పటి నుంచి ఎంపిక కమిటీ వారిని ఇంటర్వ్యూ చేసే వరకు జరిగిన ప్రక్రియలలో, ఈ అభ్యర్థుల అర్హతకు సంబంధించిన సమస్యలు గుర్తించబడినవి. అయినప్పటికీ, వాటిని పక్కనపెట్టి, ఇతర దరఖాస్తుదారులను వారి అర్హత కారణాలతో ఇంటర్వ్యూలకు హాజరు కాకుండా నిరోధించినప్పటికీ, ఈ అభ్యర్థులను వివరించలేని విధంగా ఇంటర్వ్యూలకు హాజరయ్యేందుకు అనుమతించారు. ప్రశ్న ఏమిటంటే, ఒక విశ్వవిద్యాలయ పరిపాలన కొందరు నిర్దిష్ట అభ్యర్థులకు 'సర్దుబాటు' చేయటానికి ఎందుకంతగా ప్రయత్నిస్తుంది? దీనికి ఉన్న ఏకైక హేతుబద్ధమైన వివరణ ఏమిటంటే, విశ్వవిద్యాలయ బాధ్యులు ఈ అభ్యర్థుల పట్ల తమ ప్రాధాన్యతను ముందుగానే నిర్ణయించుకుని, వారిని ఎంపిక చేయడానికి నియామక ప్రక్రియను తమకు అనుగుణంగా మార్చుకోవడానికి సిద్ధంగా ఉన్నారు. ఈ మార్పు ఆ తర్వాత జరిగిన ప్రక్రియకు కూడా విస్తరించింది. అనర్హులైన ఈ అభ్యర్థులు ఇతర అర్హులైన అభ్యర్థులను 'దాటుకొని', వారి వారి ఎంపిక కమిటీలకు మొదటి 'ఎంపిక'గా నిలిచేలా చేసింది. ఈ పక్షపాతం కొందరికి అనుకూలంగా, మరికొందరికి వ్యతిరేకంగా రెండు వైపులా పనిచేస్తోందని సూచిస్తుంది. జెఎన్‌యు టీచర్స్ అసోసియేషన్ ప్రకారం, 150 సందర్భాలలో ఇంటర్వ్యూలు నిర్వహించి, అర్హులైన అభ్యర్థులు అందుబాటులో ఉన్నప్పటికీ, ఎంపిక కమిటీలు ఎవరినీ 'నియామకానికి తగినవారుగా' ఎందుకు గుర్తించలేకపోయాయి. ప్రత్యేకించి అనేక రిజర్వ్‌డ్ పోస్టుల విషయం లో ఇది జరిగిందనే ఆరోపణలు వస్తున్నాయి.

నిజానికి, స్పష్టంగా ఉన్న నియమాలను దాటవేయడం కంటే, అభ్యర్థులను ఇంటర్వ్యూ చేసి, వారిలో ఎవరిని ఎంపిక చేయాలో తుది నిర్ణయం తీసుకునే ఎంపిక కమిటీని వైస్ ఛాన్సలర్ స్వయంగా ఎంపిక చేసుకోవడం సులభం. అదనంగా ప్రతి ఎంపిక కమిటీకి వైస్ ఛాన్సలర్ అధ్యక్షుడిగా ఉంటారనేది వాస్తవం. కమిటీలోని ముగ్గురు విషయ నిపుణులైన సభ్యులను ఎంపిక చేసే అధికారాన్ని కూడా ఈ 'నియమాలు' వైస్ ఛాన్సలర్‌కు కట్టబెడతాయి. వారిని విశ్వవిద్యాలయం శాసనబద్ధ సంస్థలచే ముందుగా ఆమోదించబడిన ఒక ప్యానెల్ నుండి ఎన్నుకోవాలి. ఈ సంస్థలకు కూడా వైస్ ఛాన్సలర్ అధ్యక్షత వహిస్తారు. ప్రస్తుతం జెఎన్‌యులో, విసి ఇప్పటికే తీసుకున్న అన్ని నిర్ణయాలను 'ఆమోదించడానికి' ఈ సమావేశాలన్నీ ఆన్‌లైన్‌లో జరిగి, త్వరితగతిన ముగుస్తాయి.

జెఎన్‌యు వైస్ ఛాన్సలర్‌గా ఎం.జగదీశ్ కుమార్ ఉన్నప్పటి నుండే, నియామకాలు జరగాల్సిన సంబంధిత కేంద్రాలు లేదా విభాగాల అధ్యాపకులు సిఫార్సు చేసిన పేర్లతో మాత్రమే నిపుణుల 'ఆమోదిత' జాబితాను రూపొందించే పద్ధతి ఆగిపోయింది. తద్వారా ఆ సమతుల్యతను కాపాడే విధానం తొలగించి, వైస్ ఛాన్సలర్లు (విసిలు) తమకు నచ్చిన పేర్లను ప్యానెళ్లలో చేర్చడం ప్రారంభించారు. విశ్వవిద్యాలయానికి వెలుపలి నుంచి ఉండాల్సిన విషయ నిపుణులతో పాటు, సంబంధిత కేంద్రం/విభాగం చైర్‌పర్సన్, సంబంధిత డీన్ ఆఫ్ స్కూల్స్ ఈ కమిటీలో సభ్యులుగా ఉంటారు. అయితే, గత విసి కాలం నుంచే ఈ పదవుల్లో ఉండేవారిని విసి స్వయంగా ఎంపిక చేయడం, వారి పదవీకాలం పూర్తిగా విసి దయాదాక్షిణ్యాలపై ఆధారపడి ఉండటం మొదలైంది. అంతకుముందు దశాబ్దాల పాటు, అర్హులైన అధ్యాపకుల సీనియారిటీ ఆధారంగా ఈ పదవులు రొటేషన్ పద్ధతిలో (వారీగా) కేటాయించబడేవి.




నిపుణుల ప్యానెళ్లను ఆమోదించే, ఎంపిక కమిటీల సిఫార్సులను స్వీకరించే చట్టబద్ధమైన సంస్థలలో కూడా ఈ విభాగ అధిపతులు, డీన్‌లే అత్యధిక సంఖ్యలో సభ్యులుగా ఉంటారు. అధ్యాపకుల నియామక ప్రక్రియలో భాగమైన 'ఇంటర్నల్ క్వాలిటీ అస్యూరెన్స్ సెల్' (ఐక్యూఎసి) డైరెక్టర్ వంటి ఇతర పదవులకు కూడా విసియే నియామకాలు చేపడతారు. అధ్యాపకుల నియామక ప్రక్రియలో వచ్చిన ఈ మార్పులన్నీ ఎంపిక ప్రక్రియపై నియంత్రణను పూర్తిగా విసి చేతుల్లోకి కేంద్రీకరించాయి. నియామకాలపై విసి తన ఇష్టాయిష్టాలను రుద్దడానికి వీలు కల్పించాయి.

నియామకాలకు సంబంధించిన ప్రస్తుత యుజిసి నిబంధనలు 2018లో జారీ చేయబడ్డాయని, ఎం. జగదీశ్ కుమార్ విసిగా ఉన్న సమయంలోనే జెఎన్‌యు వాటిని అమలులోకి తెచ్చిందని కూడా గమనించాలి. ప్రస్తుత విసి శాంతిశ్రీ ధూళిపూడి పండిట్ లాగే, ఆయనను కూడా మోదీ ప్రభుత్వం నియమించింది. ఆ తర్వాత ఆయన యుజిసి చైర్మన్ పదవికి పదోన్నతి పొందారు. ప్రతి ఎంపిక కమిటీలోని చివరి సభ్యుడైన 'విజిటర్ నామినీ'ని కూడా ప్రభుత్వమే నియమిస్తుంది. అయినప్పటికీ, అధ్యాపకుల నియామక ప్రక్రియపై జెఎన్‌యు విసికి ఉన్న సంపూర్ణ నియంత్రణను అదుపు చేయడానికి ప్రభుత్వం ఎప్పుడూ చర్యలు తీసుకోలేదు. పైగా నిబంధనల ఉల్లంఘనలు స్పష్టంగా కనిపిస్తున్నప్పుడు కూడా మౌనం వహించింది.

కొన్ని నెలల క్రితం ఒక పాడ్‌కాస్ట్‌లో చేసిన వ్యాఖ్యల కారణంగా జెఎన్‌యు విసిని తొలగించాలన్న డిమాండ్లను కూడా మోదీ ప్రభుత్వం తోసిపుచ్చింది. ఆ పాడ్‌క్యాస్ట్‌లో ఆమె యుజిసి నిబంధనలను బహిరంగంగా ప్రశ్నించడమే కాకుండా, అత్యంత కులతత్వపూరితమైన వ్యాఖ్యలు కూడా చేశారు. జెఎన్‌యు మాజీ, ప్రస్తుత వైస్‌ఛాన్సలర్ల వ్యవహార శైలికి లభించిన ఈ మౌన ఆమోదానికి ఒకే ఒక కారణం ఉండవచ్చు. అధ్యాపకుల నియామక ప్రక్రియలో ప్రభుత్వం కోరుకున్న విధంగానే వారు వ్యవహరించడం. విద్యాపరమైన అర్హతలు లేదా సామర్థ్యానికి బదులుగా, అభ్యర్థుల రాజకీయ సైద్ధాంతిక ధోరణి లేదా ప్రభుత్వం, జెఎన్‌యు యంత్రాంగంలోని శక్తివంతమైన వ్యక్తులతో వారికి ఉన్న వ్యక్తిగత సంబంధాలే నియామకానికి ప్రాతిపదికగా మారాయి. జెఎన్‌యులో, బోధనేతర ఉద్యోగాలు అమ్ముడుపోవడం, అవి జెఎన్‌యు యంత్రాంగంలోని వ్యక్తులకు ఆర్థిక లాభం చేకూర్చే వనరులుగా మారడం అనే అవకాశాన్ని కూడా కొట్టిపారేయలేము.

గత పదేళ్లలో జెఎన్‌యులో జరిగిన పరిణామాల ప్రాముఖ్యతను ఈ క్రింది అంశాల ద్వారా అంచనా వేయవచ్చు. జెఎన్‌యు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్న వివరాల ప్రకారం (2026 ఆగస్టు 8 నాటికి), జెఎన్‌యులోని మొత్తం 705 మంది రెగ్యులర్ అధ్యాపకులలో 322 మంది (దాదాపు 46 శాతం) ప్రస్తుత, మాజీ వైస్‌ఛాన్సలర్ల హయాంలోనే నియమితులయ్యారు. వీరిలో 189 మంది శాంతిశ్రీ పండిట్ పదవీకాలంలో (ఇది ఇంకా కొనసాగుతోంది) నియమితులైనవారే. ఈ కొత్త నియామకాలలో 246 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లలో 146 మంది, 182 మంది అసోసియేట్ ప్రొఫెసర్లలో 111 మంది ఉన్నారు. ప్రొఫెసర్ల విభాగంలో వీరి సంఖ్య సాపేక్షంగా తక్కువగా ఉంది. మొత్తం 277మందిలో కేవలం 65 మంది మాత్రమే ఉన్నారు. ఇందులో తక్కువ స్థాయి పోస్టుల్లో మొదట నియమితులై, ఆ తర్వాత పదోన్నతి ద్వారా ప్రొఫెసర్లుగా మారిన వారు కూడా ఉన్నారు. మరో మాటలో చెప్పాలంటే, నేరుగా ప్రొఫెసర్లుగా నియమితులైన వారి కంటే, ఈ కొత్తగా నియమితులైన వారిలో ఎక్కువమందికి విశ్వవిద్యాలయంలో సుదీర్ఘ పదవీకాలం లభిస్తుంది. 2016కు ముందు నియమితులైన వారు ఇప్పటికీ మొత్తం ప్రొఫెసర్ల సంఖ్యలో నాలుగింట మూడు వంతుల వాటాను కలిగి ఉన్నప్పటికీ, పదవీ విరమణలు, కొత్త నియామకాల కారణంగా ఆ నిష్పత్తి క్రమంగా తగ్గుతూ వస్తోంది. ఫ్యాకల్టీ నియామకాలే కాకుండా, పదోన్నతుల ప్రక్రియ, ఈ కాలంలో నియమితులైన వారి ప్రొబేషన్ తర్వాత నియామకాలను ధృవీకరించడం వంటివి కూడా వివక్షాపూరిత సాధనాలుగా మార్చబడ్డాయి. 2016కు ముందు నియమితులైన వారిలో 100 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు, 71 మంది అసోసియేట్ ప్రొఫెసర్లలో చాలామంది ఇప్పటికీ అదే పదవుల్లో కొనసాగుతున్నారు. ఎందుకంటే, వారు కూడా విసి, ఆమె అధిపతుల నియంత్రణకు లొంగేంత వరకు వారి పదోన్నతులను నిలిపివేశారు.

జెఎన్‌యు ఫ్యాకల్టీ నియామకాలలో జరుగుతున్న దానిని, గతంలో వామపక్షాలు చేశాయని ఆరోపించబడిన దానిని సరిదిద్దడం లేదా తిప్పికొట్టడమేనని బిజెపి – ఆర్‌ఎస్‌ఎస్ కూటమి సమర్థిస్తోంది. జెఎన్‌యుకు సొంత ప్రవేశ పరీక్షలు ఉండటం, వాటిలో ప్రశ్నపత్రాల రూపకల్పన, మూల్యాంకనం ఫ్యాకల్టీ చేతుల్లోనే ఉండటం వల్ల, విద్యార్థుల కూర్పును, భావజాలాన్ని కూడా ఫ్యాకల్టీయే నియంత్రిస్తోందని వారు వాదించారు. ఈ వాదనలలోని అసంబద్ధత ఇప్పుడు ప్రభుత్వ చర్యల ద్వారానే రుజువైంది. ఫ్యాకల్టీ కూర్పును మార్చడమే కాకుండా, విశ్వవిద్యాలయం సొంత ప్రవేశ పరీక్షల స్థానంలో సియుఇటి, నెట్‌లను ప్రవేశపెట్టారు.

జెఎన్‌యుఎస్‌యు ఎన్నికలలో ఇప్పటికీ వామపక్షం ఆధిపత్యమే ఉంది. అంతేకాకుండా, జెఎన్‌యుకు చెందిన గత వైస్‌ఛాన్సలర్‌లలో ఎవరినీ ఏమాత్రం వామపక్షవాదిగా పరిగణించలేనప్పటికీ, గత ఇద్దరు విసిలు ఆర్‌ఎస్‌ఎస్, దాని సిద్ధాంతం పట్ల తమ విధేయతను, అనుబంధాన్ని ఎన్నడూ రహస్యంగా ఉంచలేదు. వారి ఆదేశాల మేరకే అధ్యాపకుల నియామకాలు పూర్తిగా విసి నియంత్రణలోకి వచ్చాయి. స్వతంత్ర ఆలోచనను, అధ్యయనాన్ని ప్రోత్సహించే ఒక విద్యాసంస్థగా విశ్వవిద్యాలయాన్ని నాశనం చేయడానికి, దాని అధ్యాపకులను పైనుంచి వచ్చే ఆదేశాలకు విధేయులుగా మార్చడానికి మోదీ ప్రభుత్వ హయాంలో జెఎన్‌యు అధ్యాపకుల నియామకాలు ప్రధానంగా ఒక ప్రక్రియలో భాగమనే నిజాన్ని, దాని బూటకపు సమర్థన ఏదీ తొలగించలేదు.

**(ఐపిఎ సర్వీస్)**

# యుపిఐపై కొత్త రుసుము ప్రయోజనం

**ఒక అభిప్రాయం**

భారతదేశంలో డిజిటల్ చెల్లింపుల విప్లవానికి యుపిఐ ఒక ప్రధాన కారణం. చిన్న టీ దుకాణం నుంచి పెద్ద షాపింగ్ మాల్ వరకు, కూరగాయల బండి నుంచి ఆన్‌లైన్ వ్యాపారం వరకు ప్రతి చోటా క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి క్షణాల్లో డబ్బు చెల్లించడం ఇప్పుడు సాధారణమైపోయింది. ముఖ్యంగా వినియోగదారుడి నుంచి అదనపు రుసుము వసూలు చేయకపోవడం యుపిఐ విజయానికి ప్రధాన కారణాల్లో ఒకటి. కానీ సెప్టెంబర్ 2026లో కేంద్ర ప్రభుత్వం, నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కొత్త విధానాన్ని ప్రకటించడంతో యుపిఐ భవిష్యత్తుపై చర్చ మొదలైంది. అసలు మారింది ఏమిటి? ఎవరు డబ్బు చెల్లించాలి? వినియోగదారుడిపై భారం పడుతుందా? అమెరికా ఒత్తిడికి దీనికి సంబంధం ఉందా?

మొదట ఒక విషయం స్పష్టంగా తెలుసుకోవాలి. యుపిఐ పూర్తిగా చార్జ్‌డ్ వ్యవస్థగా మారలేదు. ఒక వ్యక్తి మరో వ్యక్తికి ఎంత మొత్తం పంపినా ఇప్పటికీ ఎలాంటి రుసుము ఉండదు. అలాగే వ్యాపారికి రూ.2,000 వరకు చేసే యుపిఐ చెల్లింపులు కూడా ఉచితమే. చిన్న వ్యాపారుల కోసం ప్రత్యేక రక్షణ ఉంది. క్యూఆర్ కోడ్ ద్వారా నెలకు రూ.1లక్ష వరకు స్వీకరించే చిన్న వ్యాపారులకు కూడా శూన్య రుసుము కొనసాగుతుంది. కేంద్రం ప్రకారం మొత్తం వ్యాపారిచెల్లింపులలో దాదాపు 96 శాతం ఈ కొత్త రుసుము పరిధిలోకి రావు.

అయితే రూ.2,000 దాటిన కొన్ని వ్యాపార లావాదేవీలకు కొత్తగా 0.4 శాతం 'మర్చంట్ డిస్కౌంట్ రేట్' లేదా ఎం.డి.ఆర్. విధించనున్నారు. ఇది వినియోగదారుడిపై వేసే పన్ను కాదు. వ్యాపారి డిజిటల్ చెల్లింపును స్వీకరించడానికి చెల్లించే వ్యవస్థాపక రుసుము. ఉదాహరణకు ఒక వ్యాపారికి రూ.10,000 యుపిఐ ద్వారా చెల్లిస్తే 0.4 శాతం అంటే రూ.40. అయితే రూ.75,000 లేదా అంతకంటే ఎక్కువ లావాదేవీకి ఈ రుసుము గరిష్ఠంగా రూ.300కే పరిమితం చేశారు. రైల్వేలు, టెలికాం, బీమా, ఇంధనం, వ్యవసాయ ఇన్‌పుట్లు వంటి తక్కువ లాభాలతో నడిచే ముఖ్య రంగాలకు రూ.2,000 దాటిన లావాదేవీలపై రూ.5స్థిర రుసుము మాత్రమే ఉంటుంది. మూలధన మార్కెట్‌కు సంబంధించిన కొన్ని చెల్లింపులకు 0.02 శాతం రేటు, ఒక్కో లావాదేవీకి గరిష్ఠంగా రూ.300 పరిమితి పెట్టారు. ఇక్కడ అసలు ప్రశ్న— ఈ రుసుమును ఎవరు భరిస్తారు? ప్రభుత్వ ప్రకారం వినియోగదారుడు నేరుగా చెల్లించాల్సిన అవసరం లేదు. బ్యాంకులు, చెల్లింపు సేవల సంస్థలు, యుపిఐ యాప్‌లకు సంబంధించిన వ్యవస్థలోనే ఈ రుసుము పంచబడుతుంది. బ్యాంకులు వ్యాపారులు ఈ ఖర్చును వినియోగదారులపై నేరుగా మోపకుండా చూడాలని కూడా ప్రభుత్వం స్పష్టం చేసింది. అంటే యుపిఐ చెల్లించేటప్పుడు మన ఫోన్‌లో అదనంగా రూ.10, రూ.20 వసూలు చేయడం ఈ విధానంలో అనుమతించబడదు.

అయితే పరోక్ష ప్రభావం ఉండదని మాత్రం ఖచ్చితంగా చెప్పలేం. ఒక వ్యాపారికి చెల్లింపులపై కొత్త ఖర్చు వస్తే అతను దాన్ని తన లాభంలో నుంచి భరించవచ్చు. లేక వ్యాపార నిర్వహణ ఖర్చులో భాగంగా తీసుకోవచ్చు. కొన్ని సందర్భాల్లో వస్తువులు, సేవల ధరలను పెంచే అవకాశం కూడా ఉంటుంది. అది జరిగితే ప్రత్యక్షంగా యుపిఐ రుసుము చెల్లించకపోయినా, వినియోగదారుడిపై పరోక్ష భారం పడవచ్చు. అయితే ఇది తప్పనిసరిగా జరుగుతుందని చెప్పడానికి ఇప్పుడే ఆధారం లేదు. మరి రూ.2,000నే ఎందుకు ప్రాతిపదికగా తీసుకున్నారు? దీనికి ప్రధాన కారణం చిన్న మొత్తాల చెల్లింపులను రక్షించడమే. ఒక చిన్న దుకాణంలో రూ.200 లేదా రూ.500 కొనుగోలుపై రుసుము విధిస్తే డిజిటల్ చెల్లింపుల ప్రయోజనం తగ్గిపోవచ్చు. అందుకే రోజువారీ చిన్న చెల్లింపులను ఉచితంగా కొనసాగిస్తూ, పెద్ద వ్యాపారి లావాదేవీల నుంచి యూపీఐ వ్యవస్థ నిర్వహణకు కొంత ఆదాయం సమకూర్చాలన్నది కొత్త విధానం వెనుక ఉన్న ఆలోచన. ఇది ఎందుకు అవసరమైంది? యుపిఐ వినియోగం విపరీతంగా పెరిగింది. 2026 జూలైలోనే యుపిఐ ద్వారా 2,366 కోట్ల లావాదేవీలు జరిగాయి; వాటి మొత్తం విలువ రూ.29.9 లక్షల కోట్లకు చేరింది. ఆగస్టులో లావాదేవీల సంఖ్య సుమారు 2,400 కోట్లకు, విలువ దాదాపు రూ.27.7 లక్షల కోట్లకు చేరినట్లు తాజా నివేదికలు పేర్కొన్నాయి. ఇంత భారీ వ్యవస్థను నిర్వహించడానికి సర్వర్లు, బ్యాంకింగ్ మౌలిక సదుపాయాలు, సైబర్ భద్రత, మోసాల నివారణ, సాంకేతిక నిర్వహణ, వినియోగదారుల సేవలకి నిరంతరం ఖర్చు అవుతుంది.

ఇప్పటివరకు యుపిఐలో 'శూన్య ఎం.డి.ఆర్.' విధానాన్ని ప్రభుత్వం ప్రోత్సాహకాల ద్వారా కొనసాగించింది. ఉదాహరణకు 2024–25 ఆర్థిక సంవత్సరానికి చిన్న వ్యాపారుల తక్కువ విలువైన యుపిఐ చెల్లింపులను ప్రోత్సహించేందుకు రూ.1,500 కోట్ల ప్రోత్సాహక పథకాన్ని కేంద్రం ప్రకటించింది. అంటే వినియోగదారుడికి, చిన్న వ్యాపారికి రుసుము లేకుండా ఉంచడం వెనుక ప్రభుత్వ ఆర్థిక సహాయం కూడా ఉంది.అందువల్ల ఇప్పుడు వచ్చిన మార్పును కేవలం 'యూపీఐపై పన్ను'గా చూడటం సరైనది కాదు. ఇది యూపీఐ వ్యవస్థ నిర్వహణ ఖర్చును ఎవరు భరించాలనే దానిపై తీసుకున్న విధాన నిర్ణయం. ప్రభుత్వం మొత్తం ఖర్చును భరించాలా? బ్యాంకులు భరించాలా? లేక పెద్ద వ్యాపారి లావాదేవీల నుంచి కొంత ఖర్చు తిరిగి పొందాలా? అన్న ప్రశ్నకు ప్రభుత్వం మూడో మార్గాన్ని ఎంచుకుంది.

అయితే ఈ నిర్ణయంపై రాజకీయ వివాదం కూడా మొదలైంది. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ, రూ.2,000కు పైబడిన వ్యాపారి లావాదేవీలకు ఎం.డీ.ఆర్. విధించే మార్గం తెరవడం అమెరికా ఒత్తిడికి సంబంధించినదని ఆరోపించారు. రూ.2,000కు పైబడిన లావాదేవీలు మొత్తం లావాదేవీల సంఖ్యలో సుమారు 5శాతం మాత్రమే అయినప్పటికీ, మొత్తం విలువలో దాదాపు 65 శాతం ఉంటాయని ఆయన వాదించారు.

అమెరికా కోణం ఇక్కడ ఎందుకు వచ్చింది? వీసా, మాస్టర్‌కార్డ్ వంటి అంతర్జాతీయ చెల్లింపు సంస్థలు సాధారణంగా వ్యాపారుల నుంచి రుసుములు పొందే విధానంలో పనిచేస్తాయి. భారతదేశం మాత్రం యుపిఐని శూన్య ఎం.డి.ఆర్. విధానంతో వేగంగా విస్తరించింది. అందువల్ల భారత యుపిఐ నమూనా అంతర్జాతీయ చెల్లింపు వ్యవస్థలకు భిన్నమైనది. ఈ నేపథ్యంలో అమెరికా, అంతర్జాతీయ చెల్లింపు సంస్థల ప్రయోజనాలను ప్రస్తావిస్తూ రాజకీయ విమర్శలు రావడం సహజమే. కానీ అమెరికా ఒత్తిడి వల్లే ప్రభుత్వం ప్రస్తుత నిర్ణయం తీసుకుందని నిరూపించే బహిరంగ ఆధారం ఇప్పటివరకు లేదు. కాబట్టి దాన్ని నిర్ధారిత వాస్తవంగా కాకుండా రాజకీయ ఆరోపణగా మాత్రమే చూడాలి.

మరోవైపు ప్రభుత్వ వాదన కూడా స్పష్టంగానే ఉంది. యుపిఐను మరింత సురక్షితంగా, వేగంగా, విస్తృతంగా నిర్వహించాలంటే దీర్ఘకాలిక ఆదాయ వ్యవస్థ అవసరం. కొత్త విధానం ద్వారా సాధారణ ప్రజల చెల్లింపులను ఉచితంగా ఉంచి, పెద్ద వ్యాపారి లావాదేవీల నుంచి పరిమిత మొత్తాన్ని వ్యవస్థలోని భాగస్వాములకు అందించాలని ప్రభుత్వం చెబుతోంది. ఎం.డీ.ఆర్. ప్రభుత్వం వసూలు చేసే పన్ను కాదు; యూపీఐ వ్యవస్థలో పాల్గొనే బ్యాంకులు, చెల్లింపు సంస్థల మధ్య పంచబడే రుసుము అని కూడా ప్రభుత్వం స్పష్టం చేసింది.అందువల్ల యూపీఐపై జరుగుతున్న చర్చను 'ఇకపై యుపిఐ వాడితే డబ్బు కట్టాలి' అనే భయంగా చూడటం తప్పు. అదే సమయంలో 'ఏ మార్పూ జరగలేదు' అనడం కూడా సరైనది కాదు. శూన్య ఎం.డి.ఆర్. యుగంలో ఒక ముఖ్యమైన మార్పు వచ్చింది. అక్టోబర్ 15 నుంచి నిర్దిష్ట పెద్ద వ్యాపారి లావాదేవీలపై రుసుము ఉంటుంది. కానీ వ్యక్తి నుంచి వ్యక్తికి జరిగే చెల్లింపులు, రూ.2,000 వరకు వ్యాపారి చెల్లింపులు, నిర్దిష్ట చిన్న వ్యాపారుల లావాదేవీలు ఉచితంగానే ఉంటాయి. చివరికి యుపిఐ భవిష్యత్తును నిర్ణయించేది రుసుము ఉందా లేదా అన్నది మాత్రమే కాదు. యుపిఐ సరళతను, ప్రజల నమ్మకాన్ని, చిన్న వ్యాపారుల ప్రయోజనాలను కాపాడుతూ దాన్ని ఆర్థికంగా నిలకడగా ఎలా నిర్వహిస్తారన్నదే అసలు ప్రశ్న. యుపిఐ భారతదేశం సృష్టించిన అత్యంత ప్రభావవంతమైన డిజిటల్ మౌలిక సదుపాయాల్లో ఒకటి. దాని నిర్వహణ ఖర్చును సమర్థంగా పంచుకోవడం అవసరమే. కానీ ఆ ఖర్చు చివరికి ఎవరి మీద పడుతుంది, చిన్న వ్యాపారాలపై ఎంత ప్రభావం చూపుతుంది, ధరలు పెరుగుతాయా, ప్రభుత్వం ప్రకటించిన రక్షణలు ఎంత సమర్థంగా అమలవుతాయి అన్నదే ఈ కొత్త విధానానికి అసలు పరీక్ష.

డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్,
9849328496

## ఐజలో విశ్వకర్మ జయంతి వేడుకలు



ప్రజాపక్షం/అయిజ: ఐజ పట్టణంలోని పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో గురువారం విశ్వకర్మ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నమస్కరించారు. అనంతరం విశ్వకర్మ జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో విశ్వకర్మ సంఘం మండల అధ్యక్షుడు కాళిదాసు ఆచారి, ఆలయ అధ్యక్షులు రవి ప్రకాష్ ఆచారి, ఆలయ పూజారి కిషోరాచారి, సంఘం నాయకులు వీరేష్ ఆచారి, లక్ష్మయ్య చారి, కృష్ణయ్య ఆచారి, తిరుమలేష్ ఆచారి, రాజు ఆచారి, తదితరులు పాల్గొన్నారు.

## మక్తల్‌లో ప్రజాపాలనా దినోత్సవం



ప్రజాపక్షం/మక్తల్: ప్రజాపాలనా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు, రాష్ట్ర మంత్రి డా.వాకిటి శ్రీహరి ఆదేశానుసారం మక్తల్ మార్కెట్ కార్యాలయంలో గురువారం ప్రజాపాలనా దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ రాధా లక్ష్మారెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా మక్తల్ పట్టణ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ రాధా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ప్రజలకు అనేక సంక్షేమ కార్యక్రమాలు సౌకర్యాలు అందుబాటులోకి తీసుకొని వస్తున్నా రాష్ట్ర ప్రభుత్వానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రాష్ట్ర మంత్రి డా.శ్రీహరికి ధన్యవాదాలు తెలిపారు. ప్రజలకు మరింత మెరుగైన పాలన అందించేందుకు ప్రభుత్వం భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలను చేపట్టాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బి.గణేశ్ కుమార్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు ఎం.శ్రీనివాసులు, టి.నాగరాజు, మొహ్మద్ ఫయాజ్, నాగప్ప, ట్రేడర్లు కృష్ణారెడ్డి, సూర్యనారాయణ, హమాలీ సంఘం నాయకులు, హమాలీలు, మార్కెట్ కార్యాలయ సిబ్బంది, సూపర్‌వైజర్ లింగప్ప, మధు, భాస్కర్, మైను, నిజాం, అంజమ్మ, పార్వతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## కురుమిద్దలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు



ప్రజాపక్షం/కల్వకుర్తి: కురుమిద్ద గ్రామంలో పూరి గుడిసెల్లో నివసిస్తున్న రెండు కుటుంబాలకు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయి. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు గురువారం ఇళ్ల నిర్మాణానికి ముగ్గు పోశారు. మంజూరైన ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని సంబంధిత కుటుంబాలను కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు దామోదర్ గౌడ్, శేఖర్, గ్రామ కార్యదర్శి ఎల్లమ్మ, ఉపసర్పంచ్ నాగరాజు, వార్డు సభ్యులు శివ, వెంకటస్వామి, సూరయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకుడు జంగయ్య గౌడ్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## ప్రభాకర్ రెడ్డిని పరామర్శించిన ఎమ్మెల్యే



ప్రజాపక్షం/వంగూర్: మండల పరిధిలోని ఉల్పర గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు ప్రభాకర్ రెడ్డి అనారోగ్యంతో గత ఐదు రోజుల నుండి హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే డా.వంశీకృష్ణ బుధవారం ఆసుపత్రికి చేరుకొని ప్రభాకర్ రెడ్డిని పరామర్శించి ఆయన ఆరోగ్యంపై డాక్టర్లతో మాట్లాడి మెరుగైన చికిత్స అందించాలని డాక్టర్లకు సూచించారు.

## కెసిఆర్ చిత్రపటానికి పాలాభిషేకం



ప్రజాపక్షం/వెల్దండ: తెలంగాణ రాష్ట్రంలో ఎస్‌టిలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పించి గిరిజన తండాలను ప్రత్యేక గ్రామ పంచాయతీలుగా తీర్చిదిద్దిన ఘనత ఒక్క కెసిఆర్‌కే దక్కుందని రాష్ట్ర ఫుడ్‌కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని శ్రీశైలం–హైదరాబాద్ జాతీయ రహదారిపై అంబేద్కర్ విగ్రహం ముందు స్థానిక బిఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు పుట్ట రాంరెడ్డి అధ్వర్యంలో కెసిఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో వెనుకబడిన గిరిజనుల కోసం 10 శాతం రిజర్వేషన్లు కల్పించి గిరిజన తండాలను ప్రత్యేక గ్రామపంచాయతీలుగా మార్చి పరిపాలన చేసే దిశగా కెసిఆర్ ప్రభుత్వం చేశారని గుర్తు చేశారు. దీంతో గిరిజన తండాలను గ్రామపంచాయతీలుగా చేయడంతో గిరిజన తండాలు అభివృద్ధిచెందాయన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌గౌడ్, మాజీ వైస్ ఎంపిపి హైజాక్, సింగిల్ విండో డైరెక్టర్ నాగులునాయక్,జంగిలి నిరంజన్, భీమయ్య గౌడ్,పోలే అశోక్, లింగం ముదిరాజు, ప్రభాకర్,పురుగుల నర్సింహ్మ ముదిరాజు, కొమ్ము నాగయ్య, హన్మంత్‌నాయక్, రాజునాయక్,అంజినాయక్,గండికోట రాజు, అంజిమాస్టర్, అలీలోద్దీన్, అచ్చిరాంనాయక్, జంగిలి ప్రవీణ్, నర్సింహ్మ పాల్గొన్నారు.

## గద్వాల ఆర్‌ఒబి నిర్మాణంలో గందరగోళం

ప్రజాపక్షం/జోగులాంబ గద్వాల్: గద్వాల పట్టణంలోని రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం పై ప్రజల్లో తీవ్ర సందేహాలు, ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. పాత అలైన్‌మెంట్ ప్రకారమే ఆర్‌ఒబి నిర్మాణం చేపడుతున్నామని, దీని కోసం ప్రభుత్వం రూ.66 కోట్ల నిధులు మంజూరు చేసిందని బిజెపి నాయకులు వెల్లడించారు. ఈ ప్రణాళిక బసవన్న చౌక్ నుంచి మసీదు మీదుగా పాత హౌసింగ్ బోర్డు మార్గం గుండా ఆర్‌ఒబి నిర్మించాల్సి ఉంది. అయితే, అధికారులు మాత్రం దానికి పూర్తి భిన్నంగా సెకండ్ రైల్వే గేటు సమీపంలో కొత్తగా మార్కింగ్ వేయడం ఇప్పుడు పట్టణంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఒకవైపు నాయకులు ప్రకటించిన మార్గం వేరు, అధికారులు క్షేత్రస్థాయిలో వేస్తున్న మార్కింగ్ వేరు కావడంతో పట్టణ ప్రజలు దిగ్భ్రాంతి చెందుతుందన్నారు. ఇది ప్రజా సౌకర్యం కోసం చేపడుతున్న నిర్మాణమా? లేక కొందరు నాయకుల స్వలాభం, రియల్ ఎస్టేట్ ప్రయోజనాల కోసం అలైన్‌మెంట్ మారుస్తున్నారా? అని స్థానికులు బహిరంగంగానే ప్రశ్నిస్తున్నారు. అలైన్‌మెంట్ మార్పుల వెనుక మర్మమేంటి? రూ.66 కోట్ల భారీ నిధులతో మంజూరైన ప్రాజెక్టును మొదట ప్రకటించిన రూట్‌లోనే ఎందుకు నిర్మించడం లేదు? ఎవరి స్వలాభం కోసం? సెకండ్ రైల్వే గేటు వద్ద మార్కింగ్ వేయడం వెనుక బడా నాయకుల వ్యాపార ప్రయోజనాలు ఉన్నాయా? ప్రజా ప్రయోజనాలు తాకట్టు? ప్రజా అవసరాలను పక్కన బెట్టి, కొందరి ఒత్తిళ్లకు తలొగ్గి అలైన్‌మెంట్ మారుస్తుంటే అధికారులు ఎందుకు మౌనంగా ఉన్నారు?

# ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

**రైతులు, మహిళలు, పేదల సంక్షేమానికి పెద్దపీట**
**మంత్రి వాకిటి శ్రీహరి**




ప్రజాపక్షం/నారాయణపేట: తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా రాచరిక వ్యవస్థ నుంచి ప్రజాస్వామ్య వ్యవస్థ ఆవిర్భావానికి నాంది పలికిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధులు, స్వాతంత్ర్య సమరయోధులకు రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పారిశ్రామికభివృద్ధి, మత్స్య, క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ఘన నివాళులు అర్పించారు. నారాయణపేట కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించిన ప్రజాపాలన దినోత్సవ కార్యక్రమానికి మంత్రి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కలెక్టర్ ప్రియాంక, ఎస్‌పి డా.వినీత్ పూలమొక్క అందించి మంత్రికి స్వాగతం పలికారు. అనంతరం మంత్రి పోలీసు గౌరవ వందనం స్వీకరించి, కలెక్టర్, ఎస్‌పితో కలిసి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సెప్టెంబర్ 17 తెలంగాణ చరిత్రలో కీలకమైన రోజని పేర్కొన్నారు. హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనమై 78 సంవత్సరాలు పూర్తి చేసుకుని 79వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనానికి దారితీసిన చారిత్రక పరిణామాల్లో పోరాటయోధులు, అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు. నారాయణపేట జిల్లాలో వానాకాలం 2026–27 ఎకరాకు రూ.12 వేల చొప్పున 1,82,031 మంది రైతుల ఖాతాల్లో రూ.259 కోట్లు జమ చేసినట్లు తెలిపారు. రైతు బీమా పథకం కింద 202526 లో మరణించిన 618 మంది రైతుల నామినీ ఖాతాల్లో ఒక్కొక్కరికి రూ.5 లక్షల చొప్పున రూ.30.90 కోట్లు జమ చేసినట్లు పేర్కొన్నారు. వానాకాలం 2026కు సంబంధించి జిల్లాలో 18,251.94 మెట్రిక్ టన్నుల ఎరువులను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. రబీ 2025–26 సీజన్‌లో జిల్లాలో 163 కొనుగోలు కేంద్రాల ద్వారా 27,120 మంది రైతుల నుంచి 1,53,080 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రూ.366 కోట్ల విలువతో కొనుగోలు చేసినట్లు మంత్రి వెల్లడించారు. కనీస మద్దతు ధర ప్రకారం రైతులకు చెల్లింపులు చేసినట్లు తెలిపారు. జిల్లాకు 1,71,037 స్మార్ట్ రేషన్ కార్డులు అందగా, వాటిని పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు.

### భూములు కోల్పోయిన రైతులకు పరిహారం

ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు భూములు కోల్పోయిన రైతులకు పరిహారం అందిస్తున్నట్లు మంత్రి తెలిపారు. జిల్లాలో 3,565 మంది రైతులకు సంబంధించిన 2,356.02 ఎకరాలకు గాను 3,112 మంది రైతులకు రూ.366.95 కోట్ల పరిహారం పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీను, డిఆర్‌ఒ రాజేశ్వరి, ట్రైనీ కలెక్టర్లు శ్రీరామ్ ప్రణీత్, ఫణికుమార్, ఆర్‌డిఒ రమేష్, అదనపు ఎస్‌పి రియాజ్ హుల్ హక్, డిఎస్‌పిలు నల్లపు లింగయ్య, మహేష్, మున్సిపల్ చైర్ పర్సన్ కొండా శ్వేతా సత్యయాదవ్, వైస్ చైర్ పర్సన్, మంజుల, మార్కెట్ కమిటీ చైర్మన్ సదాశివరెడ్డి, కలెక్టరేట్ ఎఒ అనిల్‌కుమార్, జిల్లా అధికారులు, మున్సిపల్ కౌన్సిలర్లు, ఉద్యమకారులు, పుర ప్రముఖులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎస్‌సి, ఎస్‌టిల సమస్యలు జిల్లాస్థాయిలోనే పరిష్కరించాలి

**విధిగా సివిల్ రైట్స్ డే నిర్వహించాలి**
**రిజర్వేషన్లు, రోస్టర్ విధానం పక్కాగా అమలు చేయాలి**
**రాష్ట్ర ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య**



ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్: ఎస్‌సి, ఎస్‌టిల సామాజిక, న్యాయపరమైన సమస్యలను జిల్లా స్థాయిలోనే పరిష్కరించేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య సూచించారు. గురువారం నాగర్‌కర్నూల్ కలెక్టరేట్‌లో కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, ఎస్‌పి డా.సంగ్రామ్ సింగ్ జి, పాటిల్ తో కలిసి ఎస్‌సి, ఎస్‌టిల సమస్యలు, భూ సర్వీస్ , ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసులపై సమీక్ష నిర్వహించారు. ప్రతి నెల చివరి వారంలో సివిల్ రైట్స్ డే తప్పనిసరిగా నిర్వహించి, సంబంధిత పోలీస్, రెవెన్యూ అధికారులు స్వయంగా హాజరై సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ప్రభుత్వ శాఖల్లో ఎస్‌సి, ఎస్‌టి రిజర్వేషన్లు రోస్టర్ విధానం, రిజర్వేషన్ రిజిస్టర్లను నిబంధనల ప్రకారం నిర్వహించాలని సూచించారు. ఎస్‌సి, ఎస్‌టి ఉప ప్రణాళిక నిధులను ఆయా వర్గాల సంక్షేమం, అభివృద్ధికే వినియోగించాలని తెలిపారు. ఎస్‌సి, ఎస్‌టిలపై నమోదైన కేసుల్లో బాధితులకు న్యాయం జరిగేలా దర్యాప్తును వేగవంతం చేయాలని పోలీసు అధికారులను కోరారు. ప్రజల దరఖాస్తులను గౌరవంగా స్వీకరించి, సమస్యలను సాధ్యమైనంత వరకు జిల్లా స్థాయిలోనే పరిష్కరించాలని సూచించారు. ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థులకు అందుబాటులో ఉన్న విద్యా, ఉపాధి అవకాశాలపై గ్రామస్థాయిలో అవగాహన కల్పించాలని అన్నారు. పారిశుద్ధ్య, కార్మికులకు ప్రతి నెల 1వ తేదీన వేతనాలు చెల్లించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో కమిషన్ సభ్యులు కె.లక్ష్మీ నారాయణ, నేనావత్ రాంబాబు నాయక్, అచ్చంపేట సబ్ కలెక్టర్, సలోని చాబ్రా, అదనపు కలెక్టర్లు బి.చెన్నయ్య, దేవ సహాయం, అధికారులు, పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గుడిసెలు లేని పట్టణంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

**మున్సిపల్ చైర్‌పర్సన్ బృంగి రత్నమాల**



ప్రజాపక్షం/కల్వకుర్తి: గుడిసెలు లేని ప్రాంతంగా కల్వకుర్తి పట్టణాన్ని తీర్చిదిద్దడమే లక్ష్యమని, అర్హులైన పేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ఇళ్లు అందేలా కృషి చేస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ బృంగి రత్నమాల అన్నారు. గురువారం కల్వకుర్తి మున్సిపాలిటీ పరిధిలోని 20వ వార్డులో రియానాకు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో మంజూరైన ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి మున్సిపల్ చైర్ పర్సన్ బృంగి రత్నమాల శంకుస్థాపన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్యే సహకారంతో కల్వకుర్తి పట్టణాన్ని గుడిసెలు లేని ప్రాంతంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని అన్నారు. అర్హులైన పేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ఇళ్లు అందేలా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి చీమ్ముల శ్రీకాంత్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు పుస్తకాల రాహుల్, కౌన్సిలర్ షేక్ ఏజాస్, ఎల్లమ్మ, శ్రీనివాసులు, హుమ్లీ, హన్మ నాయక్, మాజీ కౌన్సిలర్ చిన్న, నాయకులు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## సాయుధ పోరాటంలో కమ్యూనిస్టుల పాత్ర కీలకం



ప్రజాపక్షం/అమరచింత: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో కమ్యూనిస్టులు ఎనలేని త్యాగం చేశారని చరిత్రను వక్రీకరిస్తే సహించేది లేదని సిపిఐ మండల సహాయ కార్యదర్శి భాస్కర్ హెచ్చరించారు. గురువారం అమరచింత మండల కేంద్రంలోని సిపిఐ జెండా కట్ట దగ్గర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాలు ముగింపు కార్యక్రమాన్ని సిపిఐ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటాన్ని బిజెపి దాని అనుబంధ సంస్థలు వక్రీకరించి మాట్లాడుతున్నాయని ఆరోపించారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సాగిన పోరాటంలో కమ్యూనిస్టులు ఎంతోమంది తమ ప్రాణాలను త్యాగం చేసి నిజామ్‌ను తరిమికొట్టిన దాంట్లో ప్రముఖ పాత్ర వహించారని అన్నారు. బిజెపి లాంటి మతోన్మాద శక్తులకు ఈ పోరాటంలో ఎలాంటి భాగస్వామ్యం లేదని ఈ పోరాటంలో ఆ పార్టీ పాల్గొన్నట్లు చరిత్రలో లేదన్నారు. వెట్టిచాకిరి విముక్తి కోసం కమ్యూనిస్టులు చేసిన పోరాటంలో తెలంగాణ ప్రజలకు విముక్తి లభించిందన్నారు. సాయుధ పోరాటంలో అమరులైన వారికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి ఏ.రవీందర్, లక్ష్మీ నారాయణ, మశెప్ప, నిస్సార్, సాలు, వినోద్ పాల్గొన్నారు.

## 'సర్' నోటీసులు జారీ చేసిన వ్యక్తులను హియరింగ్



ప్రజాపక్షం/వీపనగండ్ల: మండల కేంద్రంలో సర్ కార్యక్రమంలో భాగంగా నోటీసులు జారీ చేసిన వ్యక్తులకు గురువారం తాసిల్దార్ ఖాజా మైనుద్దీన్ హియరింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సంబంధిత వ్యక్తుల నుంచి వివరాలు, వివరణలను స్వీకరించారు. సర్ ప్రక్రియలో భాగంగా వివిధ అంశాలకు సంబంధించి నోటీసులు అందుకున్న వ్యక్తులు హియరింగ్ కు హాజరయ్యారు. అధికారులు ఆయా వ్యక్తుల నుంచి సంబంధిత వివరాలను అడిగి తెలుసుకోవడంతో పాటు, వారి వివరణలను నమోదు చేసుకున్నారు. సర్ కు సంబంధించిన అంశాలపై వ్యక్తులు తమ అభిప్రాయాలు, ఆధారాలను అధికారుల దృష్టికి తీసుకువచ్చినట్లు తెలిపారు. హియరింగ్ కార్యక్రమంలో భాగంగా సంబంధిత రికార్డులు, వివరాలను పరిశీలిస్తూ నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు చేపట్టేందుకు అధికారులు వివరాలను సేకరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మీసాల పార్వతమ్మ, ఉప సర్పంచ్ బాలపీర్, గిర్దావర్ రాములు, జిపిఒ గోపాల్, రికార్డ్ అసిస్టెంట్ నరసింహ, బిఎల్‌ఒలు, కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాల ఆకస్మిక తనిఖీ



ప్రజాపక్షం/కృష్ణ: ముదుమాలమండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను మండల విద్యాశాఖ అధికారి నిజాముద్దీన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాల రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించారు. తదనంతరం 5వ తరగతి గదిని సందర్శించి గణిత బోధన చేస్తున్న ఉపాధ్యాయుడు రవికుమార్ పాఠాన్ని వీక్షించారు. అనంతరం కోణాల గుర్తింపునకు సంబంధించిన అభ్యసన పత్రాలు పరిశీలించారు. అదే విధంగా తె లుగు, ఆంగ్లం, పరిసరాల విజ్ఞానంలో విద్యార్థుల ప్రతిభను పరిశీలించారు. విద్యార్థులు ఇంటి దగ్గర చదివే అలవాటు ఏర్పరచుకోవాలని సూ చించారు.

## ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రజాపాలన

**రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య**



ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్: అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పారదర్శకమైన, సంక్షేమంతో కూడిన ప్రజాపాలన అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలంగాణ రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య అన్నారు. ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయ సముదాయంలో నిర్వహించిన జిల్లా స్థాయి వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం తెలంగాణ తల్లి, మహాత్మాగాంధీ, డా.బిఆర్.అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి, తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద పుష్పాంజలి ఘటించారు. తెలంగాణ రాష్ట్ర సాధన వెనుక ప్రజల సుదీర్ఘ పోరాటం, ఉద్యమకారుల త్యాగాలు ఉన్నాయని గుర్తు చేసిన ఆయన, అమరవీరుల త్యాగాలను ఎప్పటికీ మరువకూడదని ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన తెలంగాణ సంసృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తీగల సునేంద్ర, అదనపు కలెక్టర్లు బి.చెన్నయ్య, దేవ సహాయం, డీఆర్వో పాండు, కలెక్టరేట్ ఎఒ చంద్రశేఖర్, అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## ఆసుపత్రి అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

**నిరుపయోగంగా ఉన్న భవనాలను వినియోగంలోకి తేవాలి**
**కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**



ప్రజాపక్షం/గద్వాల్ రూరల్: జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో నిరుపయోగంగా ఉన్న భవనాలను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలని ఆసుపత్రి అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు. గురువారం గద్వాల జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి వివిధ విభాగాలు, వైద్య పరికరాలు, సిటీ స్కాన్, ల్యాబోరేటరీ, తదితర పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సిటీ స్కాన్ సేవలను సమర్థవంతంగా వినియోగించాలని, ఇన్‌పేషెంట్లకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. రోగుల రద్దీని నియంత్రించేందుకు టోకెన్ విధానాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు. రోగులు ఒకేసారి గుమికూడకుండా టోకెన్ నెంబర్ ప్రకారం సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని, అవసరమైన చోట అదనపు కుర్చీలు, బెంచీలు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఆసుపత్రి ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచడంతో పాటు, అవసరమైన చోట పెయింటింగ్, వైట్ వాషింగ్, శానిటేషన్, ఇతర సుందరీకరణ పనులు చేపట్టాలని తెలిపారు. ఆసుపత్రి అభివృద్ధి పనులకు రూ.50 లక్షల నిధులు మంజూరు చేసినప్పటికి పనులు పూర్తి చేయడంలో అలసత్వం వహించడం సరికాదన్నారు. కాంట్రాక్టర్ పనులు చేపట్టకపోతే కారణాలను పరిశీలించి, నిబంధనల ప్రకారం అవసరమైన చర్యలు తీసుకుని పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలని తెలిపారు. ఈ పర్యటనలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు మనోజ్ కుమార్ రెడ్డి, రాజ్‌కుమార్, పంచాయితీరాజ్ ఈఈ ప్రభాకర్, ఆసుపత్రి పర్యవేక్షకులు ఝాన్సీ లక్ష్మి, ఆర్‌ఎంవో వెంకటదాస్, ఇతర అధికారులు, సంబంధిత సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పేదలపై అదనపు ఆర్థిక భారం మోపడం తగదు

**పివైఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.రామకృష్ణ**



ప్రజాపక్షం/నారాయణపేట: రూ.2,000 పై బడిన నిర్దిష్ట యుపిఐ వ్యక్తి నుంచి వ్యాపారికి (పి2ఎం) జరిగే లావాదేవీలపై 0.4 శాతం ఎండిఆర్ విధించే కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని ప్రగతిశీల యువజన సంఘం (పివైఎల్) తెలంగాణ రాష్ట్ర కమిటీ తీవ్రంగా వ్యతిరేకిస్తోందని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.రామకృష్ణ తెలిపారు. డిజిటల్ చెల్లింపులను దేశవ్యాప్తంగా విస్తృతంగా ప్రోత్సహిస్తూ యుపిఐని ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చిన నేపథ్యంలో ప్రస్తుతం పెద్ద విలువ కలిగిన కొన్ని వ్యాపార లావాదేవీలపై ఎండిఆర్ విధించడం వల్ల వ్యాపార రంగంలో అదనపు చెల్లింపు వ్యయాలు ఏర్పడే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన విధానం ప్రకారం వ్యక్తి నుంచి వ్యక్తి (పి2పి) జరిగే యుపిఐ లావాదేవీలకు ఛార్జీ ఉండదు. అయితే రూ.2,000 పై బడిన నిర్దిష్ట వ్యక్తి నుంచి వ్యాపారికి జరిగే లావాదేవీలపై 0.4 శాతం ఎండిఆర్ వర్తిస్తుందని తెలిపారు. రూ.75వేలు లేదా అంతకంటే ఎక్కువ లావాదేవీలకు ఒక్కో లావాదేవీపై గరిష్టంగా రూ.300 పరిమితి ఉంటుందని పేర్కొన్నారు. రూ.2వేలు పై బడిన నిర్దిష్ట యుపిఐ వ్యాపారి లావాదేవీలపై విధించిన యండిఆర్ విధానాన్ని పునఃపరిశీలించి, ప్రజలు, చిన్న వ్యాపారులపై ఆర్థిక భారం పడకుండా చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన కోరారు. ఈ డిమాండ్ పై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రగతిశీల యువజన సంఘం పివైఎల్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలు, పట్టణాలు, మండల కేంద్రాల్లో వినూత్న నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చిందని తెలిపారు.

## సర్పంచ్‌ల చెక్ పవర్ పునరుద్ధరించాలి

**పంచాయితీరాజ్ ఛాంబర్ రాష్ట్ర నాయకుడు పురుషోత్తం రెడ్డి**

ప్రజాపక్షం/కల్వకుర్తి: మాజీ సర్పంచ్‌ల 2023–24 పెండింగ్ బిల్లుల చెల్లింపులో జాప్యం కారణంగా తాత్కాలికంగా నిలిపివేసిన మొలచింతపల్లి సర్పంచ్ వరలక్ష్మి, పెంట్లవెల్లి సర్పంచ్ చిట్టెమ్మ, కారుకొండ సర్పంచు ఉమారాణిల చెక్ పవర్ ను పునరుద్ధరించాలని పంచాయితీరాజ్ ఛాంబర్ రాష్ట్ర నాయకుడు పురుషోత్తం రెడ్డి, సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు వార్ల వెంకటయ్య కోరారు. ఈ మేరకు గురువారం బాధిత సర్పంచ్‌లతో కలిసి జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్‌కు వినతిపత్రం అందజేశారు. 2023–24 లో పనిచేసిన మాజీ సర్పంచ్‌ల పెండింగ్ బిల్లులను ఎంబి రికార్డుల ఆధారంగా పరిశీలించి చెల్లించాలని కలెక్టర్ సూచించారు. అలాగే సర్పంచ్‌లపై విచారణ నిర్వహించి అధికార దుర్వినియోగం జరగలేదని తేలితే చెక్ పవర్ ను పునరుద్ధరిస్తామని తెలిపారు. గ్రామాల అభివృద్ధికి సర్పంచ్‌లు చొరవ చూపాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘం ప్రధాన కార్యదర్శి రామ్ భీష్మ, సర్పంచులు శ్రీనివాసులు, సరిత, నాగిరెడ్డి, శ్యామ్, రమేష్, ప్రశాంత్‌రెడ్డి, కోటీశ్వర్, గాలిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## జల్లాపురం సర్కార్ బడి బాగోగులు ఎవరివి?

**4 ఏళ్లుగా అసంపూర్తి భవనం**
**చిన్నారుల భద్రతపై ఆందోళన**



ప్రజాపక్షం/అలంపూర్: జోగులాంబ గద్వాల్ జిల్లా యంత్రాంగం పనితీరుకు అలంపూర్ నియోజకవర్గం మానవపాడు మండలం జల్లాపురం గ్రామంలోని ఎంపిపిఎస్ ప్రభుత్వ పాఠశాల పరిస్థితి అద్దం పడుతోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత నాలుగు ఏళ్లుగా పాఠశాల భవనం పై అంతస్తు నిర్మాణం అసంపూర్తిగా ఉండటంతో విద్యార్థుల భద్రతపై తల్లి దండ్రులు ఆందోళన చెందుతున్నారు. జల్లాపురం ప్రభుత్వ పాఠశాలలో పాత భవనంపై మరో అంతస్తు నిర్మాణం చేపట్టి మధ్యలోనే పనులు నిలిచిపోయాయని గ్రామస్తులు చెబుతున్నారు. భవనంలో ఇనుప రాడ్లు బయటకు కనిపించడం, శ్లాబ్ నిర్మాణం పూర్తి కాకపోవడం వంటి పరిస్థితులు ఉన్నాయని తెలిపారు. అసంపూర్తి నిర్మాణం ఎప్పుడు ప్రమాదానికి దారితీస్తుందోనని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నాలుగు ఏళ్లుగా ఇదే పరిస్థితి కొనసాగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. జల్లాపురం యంఆర్‌పిఎస్ పాఠశాల అసంపూర్తి భవనం సమస్యపై జిల్లా కలెక్టర్, డిఈఓ, ఎంఇఒలు స్పందించి తక్షణ చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు, గ్రామస్తులు కోరుతున్నారు.

## మైనర్ బాలికపై అత్యాచారం.. నిందితుడికి యావజ్జీవ శిక్ష

గతంలో ఇదే బాలికపై అత్యాచారం కేసులో 51 ఏళ్ల జైలు శిక్ష

బెయిల్‌పై బయటకు వచ్చి మళ్లీ బాలికను అపహరించి అత్యాచారం : జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్

**ప్రజాపక్షం/నల్లగొండ :** మైనర్ బాలికపై పలుమార్లు అత్యాచారానికి పాల్పడిన నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్షతో పాటు 23 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ ఫాస్ట్ ట్రాక్ కోర్టు తీర్పు వెలువరించిందని జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ తెలిపారు.తిప్పర్తి మండలానికి చెందిన షేక్ అలియాస్ మహమ్మద్ ఖయ్యూంకు పోక్సో ఫాస్ట్ ట్రాక్ కోర్టు న్యాయమూర్తి గురువారం ఈ తీర్పు ఇచ్చారని ఎస్‌పి తెలిపారు.కేసు వివరాల ప్రకారం నిందితుడు గతంలో అదే బాలికపై అత్యాచారానికి పాల్పడగా తిప్పర్తి పోలీస్ స్టేషన్‌లో 2021లో,2022గా కేసు నమోదైంది.ఈ కేసులో కోర్టు 51 ఏళ్ల శిక్ష విధించింది.బెయిల్‌పై బయటకు వచ్చిన తర్వాత కూడా అదే బాలికను అపహరించి పలుమార్లు అత్యాచారానికి పాల్పడడంతో నల్లగొండ టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో మళ్లీ 2023లో మరో కేసు నమోదైంది.ఈ కేసులో విచారణ జరిపిన కోర్టు పోక్సో యాక్ట్ సెక్షన్ 5/6 కింద యావజ్జీవ కారాగార శిక్షతో పాటు 23 ఏళ్ల జైలు శిక్ష విధించింది.కేసు దర్యాప్తులో కీలక పాత్ర పోషించిన అప్పటి టూ టౌన్ ఎస్ఐ ఎస్.సంపత్,ఎస్‌డిపిఓ వి.నర్సింహారెడ్డి,ప్రస్తుత డిఎస్‌పి శివరాంరెడ్డి, సీఐ ఆదిరెడ్డి, హెచ్‌ఎస్‌వో డి.సైదాబాబు,డీసీఆర్‌బి సీఐ శ్రీను నాయక్,కోర్టు డ్యూటీ ఆఫీసర్ సుమన్, లైజన్ అధికారులు నరేందర్,మల్లికార్జున్,స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వేముల రంజిత్ కుమార్ లను ఎస్‌పి అభినందించారు.

## పోక్సో కేసు -నిందితుడికి 20 ఏళ్ల జైలుశిక్ష



**ప్రజాపక్షం/తుర్కపల్లి :** మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడిన పోక్సో కేసులో నిందితుడికి భువనగిరి ప్రత్యేక ఫాస్ట్రాక్ పోక్సో కోర్టు 20 ఏళ్ల జైలు శిక్షతో పాటు, రూ.10 వేలు జరిమానా విధించింది. తుర్కపల్లి ఎస్సై తెలి పిన వివరాల ప్రకారం, తుర్కపల్లి పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఎఫ్ ఐఆర్ నెం.138/2021 ప్రకారం, 2021 నవంబర్ 1న బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యా దు మేరకు పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దర్యాప్తు పూర్తి చేసి సంబంధిత ఆధారాలు సేకరించిన అనంతరం తుర్కపల్లి మండ లంలో ఓ గిరిజన తండా నిందితుడిపై కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ఈ కేసును ఎస్సీ నం.138/2022గా ప్రత్యేక ఫాస్ట్రాక్ పోక్సో కోర్టు విచారిం చింది. కేసు లోని సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయస్థానం నిందితుడు ధీరావత్ నవీన్ ను దోషిగా నిర్ధారించి 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించిందని ఎస్ఐ శివకృష్ణ తెలిపారు.

## ఎంజియు పిజి పరీక్ష ఫలితాలు విడుదల



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం పరిధిలో పీజీ నాలుగో సెమిస్టర్ రెగ్యులర్,1,2,3 బ్యాక్ లాగ్ పరీక్ష ఫలితాలను గురువారం రిజిస్ట్రార్ ఆచార్య కొప్పుల అంజిరెడ్డి విడుదల చేశారు.పీజీ నాలుగో సెమిస్టర్ లో మొత్తం 1265 మంది విద్యార్థులకు గాను 967 మంది 76.44 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు సీఓఈ డాక్టర్ జి.ఉపేందర్ రెడ్డి తెలిపారు. బ్యాక్ లాగ్ ఫలితాల్లో మొదటి సెమిస్టర్ లో 427 మందికి గాను 158 మంది 37 శాతం , రెండో సెమిస్టర్ లో 382 మందికి 65 మంది 17.02 శాతం, మూడో సెమిస్టర్‌లో 344 మందికి గాను 168 మంది 48.84శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. పూర్తి వివరాలను ఎంజీయూ వెబ్ సైట్ లో పొందుపరిచినట్లు చెప్పారు.కార్యక్రమంలో పరీక్షల విభాగం అధికారులు డాక్టర్ డి. సంధ్యారాణి, డాక్టర్ కళ్యాణి, డాక్టర్ ప్రవళిక పాల్గొన్నారు.

## గుప్తనిధుల కలకలం



**ప్రజాపక్షం/పెన్‌పహాడ్ :** మండల పరిధిలో గుప్తనిధుల తొవ్వకాల వ్యవహారం కలకలం రేపింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని అనాజీపురం రెవెన్యూ గ్రామం రాజ్‌పేట శివారులో ఉన్న నిజాం కాలం నాటి పురాతన మసీదు పరిసర ప్రాంతంలో రహస్యంగా తొవ్వకాలు జరుపుతున్నారనే అనుమానాలపై సుమారు 15 మందిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. బుధవారం అర్ధరాత్రి సమయంలో పురాతన కట్టడం పరిసర ప్రాంతంలో కొంతమంది వ్యక్తుల కదలికలు అనుమానాస్పదంగా కనిపించాయి. దీనిని గమనించిన స్థానిక రైతులు వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని తొవ్వకాలకు ప్రయత్నిస్తున్నట్లు అనుమానిస్తున్న సుమారు 15 మందిని అదుపులోకి తీసుకున్నారు. వీరిలో ఇదే మండలానికి చెందిన దోసపహాడ్, అనాజీపురం గ్రామాలకు చెందిన వ్యక్తులు ఉన్నట్లు సమాచారం. ఈ వ్యవహారానికి అంతర్రాష్ట్ర లింకులు ఉన్నాయా అనే కోణంలోనూ పోలీసులు విచారణ చేపట్టినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం అనుమానితులను పోలీసులు ముమ్మరంగా విచారిస్తున్నారు. పూర్తి వివరాలను ఇంకా పోలీసులు వెల్లడించాల్సి ఉంది.

## తెలంగాణ సాయుధ పోరాటంలో అణువంత పాత్రలేని బిజెపి

**ప్రజాపక్షం/చింతలపాలెం :** మండల కేంద్రంలో తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. గురువారం చింతలపాలెం మండల కేంద్రంలో భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఆధ్వర్యంలో రైతాంగ సాయుధ పోరాటంలో అమరులైన వారికి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కామ్రేడ్ గన్నా చంద్రశేఖర్ హాజరై అమరవీరుల స్థూపం వద్ద ఏర్పాటు చేసిన పతాకాన్ని ఎగురవేసి అమరవీరుల స్థూపానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో మల్లారెడ్డిగూడెం చరిత్ర మరువలేనిదన్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో అణువంత పాత్రలేని బిజెపి నేడు సాయుధ పోరాటంపై మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు ఉస్తెల సృజన, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎల్లావుల రాములు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఉస్తెల నారాయణ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు గుండు వెంకటేశ్వర్లు, మల్లీశ్వరి, మండల కార్యదర్శి చింతిరాల రవి, గ్రామ శాఖ కార్యదర్శి గంధం మంగయ్య, నాయకులు చిత్తలూరు వీరబాబు, ఉపతల కోటమ్మ, పాపిరెడ్డి, వీరంరెడ్డి వీరారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, గోనె అంకయ్య పాల్గొన్నారు.



## రాచరిక వ్యవస్థ నుండి ప్రజాపాలన వ్యవస్థ ఆవిర్భావానికి నాంది

ప్రజా పాలన దినోత్సవ వేడుకలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి



**ప్రజాపక్షం/యాదాద్రి :** కలెక్టరేట్ ఆవరణలో తెలంగాణ ప్రజా పాలన రాష్ట్ర దినోత్సవ వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ రాష్ట్ర శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం మహనీయుల చిత్రపటాలకు, తెలంగాణ తల్లి చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళాలు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని జరుపుకుంటున్న ఈ శుభసందర్భంగా, రాచరిక వ్యవస్థ నుండి ప్రజా పాలన వ్యవస్థ ఆవిర్భావానికి నాంది పలికిన అమరులైన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధులకు, స్వాతంత్ర్య సమరయోధులందరికీ నా జోహార్లు అన్నారు. సెప్టెంబర్ 17 తెలంగాణ చరిత్రలో ఒక కీలకమైన రోజు అని, హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనమై 78 సంవత్సరాలు పూర్తిచేసుకుని 79వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా ఈ ప్రజాపాలన దినోత్సవాన్ని జరుపుకుంటున్నాని తెలిపారు. ఈ కార్యక్రమానికి హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు, అనధికారులు, పాత్రికేయులు, ఉద్యమకారులు, కార్మికులు, కర్షకులు, విద్యార్థినీ విద్యార్థులు, మేధావులు మరియు యాదాద్రి భువనగిరి జిల్లా ప్రజలందరికీ నా హృదయపూర్వక శుభాకాంక్షలు. జిల్లా వివిధ రంగాల్లో ఉత్తమ సేవలు అందించిన 8 మందిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, ఇంచార్జీ కలెక్టర్ భాస్కర్ రావు, ఎస్పీ అక్షాంష్ యాదవ్,అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి,మున్సిపల్ చైర్మన్ శ్రీవాణి,గ్రంథాలయ చైర్మన్ అవేజ్ చిస్తీ, అడిషనల్ ఎస్పీ లక్ష్మీ నారాయణ, డి.ఆర్.ఓ జయమ్మ,జెడ్పీ సీఈఓ శోభారాణి, ఆర్డీఓ కృష్ణా రెడ్డి, జె. ఏ.సి చైర్మన్ మందడి ఉపేందర్ రెడ్డి పాల్గొన్నారు.

## అమరవీరుల త్యాగాల స్ఫూర్తితో ప్రజా సంక్షేమమే లక్ష్యం

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

గుండ్రాంపల్లి త్యాగాల గడ్డకు ప్రత్యేక స్థానం

జిల్లా సర్వతోముఖాభివృద్ధికి కృషి



**ప్రజాపక్షం/నల్లగొండ:** నిజాం నిరంకుశ పాలనకు,రజాకార్ల అరాచకాలకు,భూస్వామ్య దోపిడీకి వ్యతిరేకంగా తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో ప్రాణత్యాగం చేసిన అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ వారి ఆశయాలకు అనుగుణంగా ప్రజా సంక్షేమం,అభివృద్ధి, సామాజిక న్యాయం కోసం కృషి చేస్తున్నామని రాష్ట్ర రోడ్లు,భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.అనంతరం పోలీసు గౌరవ వందనాన్ని స్వీకరించి జిల్లా ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. తెలంగాణ చరిత్రలో సెప్టెంబర్ 17 అత్యంత కీలకమైన రోజని మంత్రి పేర్కొన్నారు.తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రలో నల్లగొండ జిల్లాకు ప్రత్యేక స్థానం ఉందని,ఈ ప్రాంతంలోని అనేక గ్రామాలు నిజాం పాలన,రజాకార్ల దౌర్జన్యాలు,భూస్వామ్య దోపిడీకి వ్యతిరేకంగా సాగిన ఉద్యమంలో కీలక పాత్ర పోషించాయని పేర్కొన్నారు.ముఖ్యంగా గుండ్రాంపల్లి త్యాగాల గడ్డగా చరిత్రలో నిలిచిందని,అక్కడి అమరవీరుల స్మారక స్తూపం, నెత్తుటి బావి ప్రజల పోరాట స్ఫూర్తికి,త్యాగాలకు నిలువెత్తు సాక్ష్యాలని అన్నారు. గుండ్రాంపల్లిలో 26 మంది పోరాటవీరులు దారుణంగా హతమార్చబడి బావిలో పాతిపెట్టబడిన విషాద సంఘటన చరిత్రలో చెరగని ముద్ర వేసిందని తెలిపారు. అదే విధంగా జిల్లాలో నీటిపారుదల ప్రాజెక్టుల భూసేకరణ కోసం 2,062 ఎకరాల భూమిని సేకరించి రూ.442 కోట్లు చెల్లించామని మంత్రి తెలిపారు. నాగార్జునసాగర్ ఎడమ కాలువ లైనింగ్ పనులకు రూ.54 కోట్లు, ఏఎంఆర్పీ, ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టుల హై లెవల్ కెనాల్ లైనింగ్ పనులకు రూ.442 కోట్లు, లో లెవల్ కెనాల్ లైనింగ్ పనులకు రూ.44.22 కోట్లు మంజూరు చేసి పనులు ప్రారంభించామని అన్నారు.బ్రాహ్మణవెల్లెంల లిఫ్ట్ ఇరిగేషన్ భూసేకరణ పనులు 90 శాతం పూర్తయ్యాయని,హెచ్ఎల్‌సీ, ఎల్ఎల్‌సీ ద్వారా యాసంగి పంటకు 2.61 లక్షల ఎకరాలకు సాగునీరు అందించామని తెలిపారు. డిండి హెడ్‌రిచ్‌లో రూ.1,800 కోట్లు మంజూరై పనులు పురోగతిలో ఉన్నాయని, జిల్లాలోని తొమ్మిది లిఫ్ట్ ఇరిగేషన్ పనులు కొనసాగుతున్నాయని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ శంకర్ నాయక్,నల్లగొండ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి, డిప్యూటీ మేయర్ ఆమీర్ అలీ, జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు హాఫీజ్ ఖాన్,జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్,జిల్లా ఎస్‌పి శరత్‌చంద్ర పవార్, అదనపు కలెక్టర్లు జే. శ్రీనివాస్, ప్రేమ్ కరణ్ రెడ్డి, శిక్షణ సహాయ కలెక్టర్ ఎన్. శ్రీకాంత్ రెడ్డి,అడిషనల్ ఎస్‌పి రమేష్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## అమరుల త్యాగాల ఫలితమే స్వరాష్ట్ర ఆకాంక్ష

మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి




**ప్రజాపక్షం/సూర్యాపేట :** అమరుల త్యాగాల ఫలితమే స్వరాష్ట్ర ఆకాంక్ష నెరవేరిందని రాష్ట్ర పౌరసరఫరాలు, నీటిపారుదల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ వేడుకలలో మంత్రి జాతీయ పతాకావిష్కరణ గావించి, పోలీసులచే గౌరవ వందనం స్వీకరించి జాతీయ గీతాలాపన, రాష్ట్రీయ గీతాలాపన చేశారు. అనంతరం ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తూ తెలంగాణ ప్రాంతం భారత్ యూనియన్‌లో విలీనమై నేటికి 78 సంవత్సరాలు పూర్తి చేసుకొని 79వ సంవత్సరంలోకి అడుగిడుతున్న శుభసందర్భంగా హాజరైన ప్రజాప్రతినిధులు, జిల్లా న్యాయమూర్తులు, అధికారులు, అనధికారులు, పాత్రికేయులు, ఉద్యమకారులకు, కళాకారులకు, కార్మిక, కర్షక, విద్యార్థిని, విద్యార్థులకు, జిల్లా ప్రజలందరికి శుభాకాంక్షలు తెలిపారు. రూ.500కే వంట గ్యాస్ సిలిండర్ పథకం ద్వారా 4లక్షల 5వేల మంది వినియోగదారులకు 6లక్షల 43వేల సిలిండర్లపై రూ. 19కోట్ల సబ్సిడి అందించినట్లు వివరించారు. పేద కుటుంబాలకు నెలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకం కింద జిల్లాలోని 1,91,803 లబ్ధిదారులకు రూ.164కోట్ల 77లక్షల విద్యుత్ రాయితిని కల్పించినట్లు తెలిపారు. వానాకాలం 2026 సీజన్‌కు సంబంధించి ఎకరానికి రూ.6వేల చొప్పున జిల్లాలోని 2లక్షల 90వేల మంది రైతుల ఖాతాల్లో రూ.364కోట్ల 8లక్షలు జమ చేసినట్లు చెప్పారు. రైతుభీమా, సన్న వరిపై బోనస్, సన్నబియ్యం పంపిణీ, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, చేయూత, మహిళా సాధికారత కింద వడ్డీలేని రుణాలు అందించామన్నారు. విద్యా, వైద్య, సామాజిక సంక్షేమ రంగాలకు పెద్దపీట వేసిసినట్లు చెప్పారు. సామాజిక సంక్షేమం, వసతి గృహాల అభివృద్ధికి నిరంతరం సహకారం అందిస్తున్నట్లు తెలిపారు. ఆరోగ్యశ్రీ ద్వారా ఈ ఒక్క సంవత్సరంలోనే 23,310 మందికి రూ.69.40 కోట్ల ఉచిత చికిత్సలు అందించామన్నారు. జిల్లాలో బాలికలకు హెచ్‌పివి వ్యాక్సినేషన్‌లో 76శాతం సాధించి రాష్ట్రంలో 7వ స్థానంలో నిలిచామన్నారు. సాగునీటి రంగం, పరిశ్రమలకు ప్రణాళికబద్ధంగా నిధులు కేటాయించినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, జిల్లా ఎస్‌పి కె. నరసింహ, అదనపు కలెక్టర్ బి. హరిసింగ్, డిఆర్ఓ ప్రేమ్‌రాజ్, ఆర్‌డిఓ వేణుమాధవ్, మార్కెట్ కమిటి చైర్మన్ వేణారెడ్డి, జిల్లా అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



## వేగవంతంగా డబ్లింగ్ పనులు

సికింద్రాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్ డాక్టర్ ఆర్. గోపాలకృష్ణన్

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** అమృత్ భారత్ నిధులతో చేపట్టిన మిర్యాలగూడ రైల్వే స్టేషన్ ఆధునికీకరణ, రైల్వే డబ్లింగ్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సికింద్రాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్ డాక్టర్ ఆర్. గోపాలకృష్ణన్ ఆదేశించారు. గురువారం మిర్యాలగూడ రైల్వే స్టేషన్, గూడ్స్ యార్డు రీ మోడలింగ్ పనులను ఆయన సుమారు 4 గంటల పాటు ఆకస్మికంగా పరిశీలించారు.నిర్మాణంలో ఉన్న పలు పనుల పురోగతిని పరిశీలించిన డీఆర్ఎం గోపాలకృష్ణన్, పనులను నిర్ణీత సమయంలో పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. రెండో నంబర్ ప్లాట్‌ఫామ్‌పై సిగ్నల్స్ ఫోట్లు పనిచేయకపోవడాన్ని గుర్తించి వాటిని తక్షణమే మరమ్మతు చేయించాలని ఆదేశించారు. ప్రయాణికుల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సాంకేతిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు.గూడ్స్ షెడ్‌లో ప్రస్తుతం ఉన్న సౌకర్యాలను మరింత మెరుగుపరచాలని, అవసరాన్ని బట్టి అదనపు నిర్మాణాలు చేపట్టే అంశాన్ని పరిశీలించాలని అధికారులకు సూచించారు. సరుకు రవాణాకు సంబంధించిన మౌలిక వసతులు మెరుగుపడేలా పనులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని చెప్పారు.నడికుడిబీబీనగర్ రెండు లైన్ల నిర్మాణ పనులను కూడా సకాలంలో పూర్తి చేయాలని గుత్తేదారులను ఆదేశించారు. అభివృద్ధి పనుల్లో జాప్యం లేకుండా ఆయా విభాగాల అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. ఈ పరిశీలనలో రైల్వే వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## విద్యార్థినిపై దాడి చేసిన టీచర్‌ను సస్పెండ్ చేయాలి

గురుకుల పాఠశాల ఎదుట విద్యార్థి సంఘాల ధర్నా




**ప్రజాపక్షం/మునుగోడు:** మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిరావు పూలే బాలికల గురుకుల పాఠశాలలో 9వ తరగతి విద్యార్థినిపై ఉపాధ్యాయురాలు దాడి చేసిన ఘటన తీవ్ర కలకలం రేపింది.రెండు రోజుల క్రితం జరిగిన ఈ ఘటనలో విద్యార్థిని తీవ్రంగా గాయపడింది. విషయం తెలుసుకున్న ఏఐఎస్ఎఫ్,ఏఐవైఎఫ్,డీవైఎఫ్ఐ,విద్యార్థి సంఘాల నాయకులు గురువారం పాఠశాల ఎదుట ధర్నా చేపట్టి నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కోశాధికారి గోపగోని ఉదయ్ మాట్లాడుతూ దాడికి పాల్పడిన ఉపాధ్యాయురాలిని,నిర్లక్ష్యంగా వ్యవహరించిన ప్రిన్సిపాల్ ను తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.విద్యాబుద్ధులు చెప్పాల్సిన ఉపాధ్యాయులే విద్యార్థులపై విచక్షణారహితంగా దాడి చేయడం దారుణమని మండిపడ్డారు. విద్యార్థుల రక్షణ విషయంలో ప్రభుత్వం,అధికారులు నిర్లక్ష్యం వహిస్తే విద్యార్థి,యువజన సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. బాధిత విద్యార్థినికి న్యాయం చేయాలని, గురుకులాల్లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి కట్ట దశరథ, ఏఐఎస్ఎఫ్ నాయకులు శివార్ల నాగరాజు, పగిళ్ల యాదయ్య,డివైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి కట్ట లింగస్వామి,వరికుప్పల ముత్యాలు,బోయపల్లి సాయి,కట్ట ఆంజనేయులు,కుక్కల మహేష్,గాదెపాక రాకేష్,పగిళ్ల సాయితేజ పాల్గొన్నారు.

## నాణ్యమైన విద్యతోపాటు మౌలిక వసతులు

సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



**ప్రజాపక్షం/చివ్వెంల :** ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతోపాటు మౌలిక వసతులు పక్కాగా అందాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. గురువారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. తరగతి గదుల్లోకి ఆయన నేరుగా వెళ్లి విద్యార్థులతో సంభాషించారు. పాఠ్యాంశాలపై వారిని పలు ప్రశ్నలు అడిగి వారి సందేహాలను నివృత్తి చేశారు. బాగా చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు రిజిస్టర్లను, రికార్డులను కలెక్టర్ తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పాఠశాలలో ఏమైనా మౌలిక సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వై. రమేష్, విద్యాశ్రీ పాల్గొన్నారు.

## కమ్యూనిస్టుల పోరాటాలతోనే తెలంగాణకు స్వాతంత్ర్యం

తెలంగాణ విలీనమే విమోచనం కాదు...పల్లా దేవేందర్‌రెడ్డి

**ప్రజాపక్షం/దేవరకొండ:** తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట 78వ వారోత్సవాల సందర్భంగా దేవరకొండ పల్లా పర్వత్‌రెడ్డి భవన్ సిపిఐ కార్యాలయంలో జాతీయ జెండాను సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి కామ్రేడ్ పల్లా దేవేందర్‌రెడ్డి ఆవిష్కరించడం జరిగింది. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని మరియు అమరలు జీవిత చరిత్రలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పాఠ్యాంశాలలో చేర్చాలని, హైదరాబాద్‌లో స్మృతి వనం ఏర్పాటు చేయడంతో పాటు పోరాట యోధుల విగ్రహాలు ట్యాంక్‌బండ్‌పై ప్రతిష్టించాలని అన్నారు. తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను వక్రీకరిస్తున్న బిజెపి మతోన్మాద శక్తులను తిప్పికొడదాం, ప్రభుత్వం కపట నాటకం ఆడుతున్నదని విమర్శించారు. సెప్టెంబర్ 17ను తెలంగాణ విలీన దినోత్సవంగా అధికారికంగా నిర్వహించాలని కోరారు. ఈకార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు తూం బుచ్చిరెడ్డి, మండల కార్యదర్శ దేప సుదర్శన్‌రెడ్డి, సహాయ కార్యదర్శి నూనె రామస్వామి, పట్టణ కార్యదర్శి ఆంజనేయులు, మండల కార్యవర్గ సభ్యులు రంగారెడ్డి, వెంకట్రాములు, యాదయ్య, వెంకటయ్య, మైనోద్దీన్, మండల కౌన్సిల్ సభ్యులు, పట్టణ శాఖ కార్యదర్శులు జ్యోతిబస్, వెంకటయ్య, గోవర్ధన్, మల్లయ్య, శ్రీను, ఆనంద్‌చారి, యాదయ్య, రాజమల్లయ్య, బక్కయ్య, వెంకటయ్య, రమేష్, శ్రీను, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.



## 19న కోదాడలో 'మెగా జాబ్ మేళా'

జిల్లాలోని నిరుద్యోగ యువతకు చక్కటి అవకాశం

300 కంపెనీల ద్వారా 3500 మంది యువతకు ఉద్యోగ అవకాశాలు : మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి




**ప్రజాపక్షం/యాదాద్రి :** జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలను కల్పించేందుకు ఈనెల 19న కోదాడలో మెగా జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రభుత్వ విప్ ఆలేరు శాసన సభ్యులు బీర్ల ఐలయ్య, భువనగిరి శాసన సభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి, ఇంచార్జి జిల్లా కలెక్టర్ భాస్కర్ రావు, రెవిన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి, మున్సిపల్ చైర్మన్ శ్రీవాణి, గ్రంధాలయ చైర్మన్ అవేజ్ చిస్తీ, జిల్లాలోని పరిశ్రమల శాఖ అధికారులు, వివిధ పరిశ్రమల ప్రతినిధులు, కళాశాల కరస్పాండెంట్స్, జిల్లా విద్యా శాఖ అధికారులతో కలిసి మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ దేశంలో నిరుద్యోగ సమస్య సమాజాన్ని ఎక్కువగా పీడించే సమస్యగా ఉందని, దీన్ని దృష్టిలో ఉంచుకొని జిల్లాలోని నిరుద్యోగ యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు అందరి సహకారంతో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇంజినీరింగ్, ఫార్మసీ, పాలిటెక్నిక్, ఐటీఐ, డిగ్రీతోపాటు వివిధ వృత్తి విద్యాకోర్సులు ఉద్యోగ ఖాళీల వివరాలు తెలుసుకోవడం, పేరొందిన సంస్థలను సంప్రదించడం, పదేపదే హైదరాబాద్కు ప్రయాణించడం, ఇంటర్వ్యూలకు హాజరుకావడం గ్రామీణ యువతకు ఆర్థికంగా, సామాజికంగా పెద్ద సవాల్‌గా మారుతోందన్నారు. జాబ్మేళాకు సుమారు 300 కంపెనీలను ఆహ్వానించినట్లు మంత్రి వెల్లడించారు. జాబ్మేళా ద్వారా 3,500 మందికి పైగా యువతకు ఉద్యోగాలు లభించే అవకాశం ఉందని మంత్రి చెప్పారు. అభ్యర్థులు క్యూఆర్ కోడ్ ద్వారా ఆన్లైన్లో నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రజాప్రతినిదులు, అధికారులు తమ ప్రాంతాల్లోని నిరుద్యోగ యువతను గుర్తించి జాబ్మేళా సమాచారం అందించాలని మంత్రి పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు శాసన సభ్యులు బీర్ల ఐలయ్య మాట్లడుతూ జాబ్ మేళా కు మా జిల్లా నుండి కూడా నిరుద్యోగ యువతి, యువకులను పంపడం జరుగుతుందని అన్నారు. భువనగిరి శాసన సభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి మాట్లడుతూ జాబ్ మేళా ద్వారా యువతకు ఉద్యోగ అవకాశాలు లభించే అవకాశాలు ఉన్నాయన్నారు. ఇంచార్జి జిల్లా కలెక్టర్ భాస్కర్ రావు మాట్లడుతూ మా జిల్లా నుండి అందరి సహకారంతో జాబ్ మేళాకు యువతను పంపడం జరుగుతుందని అన్నారు. గ్రామీణ ప్రాంతంలోని నిరుద్యోగులను గుర్తించి అందరి సహాయంతో జాబ్ మేళాకు పంపడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## రైతాంగ సాయుధ పోరాట ఘనత కమ్యూనిస్టులదే : జంగయ్య



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం నడిపి గ్రామాలకు విముక్తి కల్పించిన ఘనత కమ్యూనిస్టులదేనని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు బుద్దుల జంగయ్య అన్నారు. గురువారం షాద్‌నగర్‌లో చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో జరిగే బహిరంగ సహకు భారీగా సిపిఐ నేతలు తరలివెళ్ళారు. కార్యక్రమంలో సిపిఐ కొందుర్గు మండల కార్యదర్శి భాగాల్ల నరసింహా, జిల్లేడు చౌదరిగూడ మండల సహాయ కార్యదర్శి ఎండి షబ్బీర్, నాయకులు ఈదమ్మ, జంగయ్య, యాదయ్య, శ్రీను, సురేష్, యాదయ్య, పామిడి జగ్గయ్య తదితరులు పాల్గొన్నారు.

## మధుయాష్కీగౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపిన కాలనీ వాసులు



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్:** ఎన్నో ఏళ్లుగా రిజిస్ట్రేషన్ సమస్యతో సతమతం అవుతున్న బిఎన్ రెడ్డి నగర్ డివిజన్ కాలనీలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో ప్రకటించడంతో ఈ సమస్యకు కృషి చేసిన మాజీ ఎంపి, ఆల్ ఇండియా ప్రొఫెషనల్స్ చైర్‌పర్సన్ మధుయాష్కీ గౌడ్‌ను గురువారం వారి నివాసంలో బి.ఎన్.రెడ్డి నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గణేష్‌రెడ్డితో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాలనీ వాసులు దామోదర్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, ప్రదీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మహిళా సాధికారతే లక్ష్యం

### మహబూబ్‌నగర్ ఎంపి డికె అరుణ



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** మహిళా సాధికారతే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం పని చేస్తుందని మహబూబ్‌నగర్ పార్లమెంట్ సభ్యురాలు డికె అరుణ అన్నారు. గురువారం పట్టణంలోని మినీస్టేడియంలో మహిళా శిశు సంక్షేమ శాఖ, రంగారెడ్డి జిల్లా సంక్షేమ అధికారి శాంతిశ్రీ ఆధ్వర్యంలో అలింకో సహకారంతో సామాజిక అధికారిత శిబిరం కార్యక్రమాన్ని నిర్వహించారు. దివ్యాంగులకు ఏడిఐపి పథకం కింద సహాయ పరికరాలు, ఉప పరికరాలను ఉచితంగా పంపిణీ చేశారు. పోషణ్ అభియాన్ పోస్టర్లను ఎంపి అరుణ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఫరూఖ్‌నగర్ తహసీల్దార్ నాగయ్య, బిజెపి నేతలు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి, అందె బాబయ్య, వంశీ, లక్ష్మీ కాంత్‌రెడ్డి, మురళీ, మోహన్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎల్‌బి.నగర్ కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షులకు నియామకపత్రాల అందజేత



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** ఎల్‌బి నగర్ నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షులకు నియామక పత్రాలను డిసిసి అధ్యక్షుడు చల్లా నరసింహారెడ్డి, ఆల్ ఇండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ (ఎఐపిసి) చైర్ పర్సన్, మాజీ ఎంపి మధుయాష్కీగౌడ్‌తో కలిసి హయత్‌నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో గురువారం అందజేశారు. హయత్ నగర్ డివిజన్ అధ్యక్షుడిగా చెన్నగోని రవీందర్‌గౌడ్, హైకోర్టు కాలనీ డివిజన్ అధ్యక్షుడిగా బాబా యాదవ్, సాహెబ్ నగర్ డివిజన్ అధ్యక్షుడిగా కేతావత్ రమేష్ నాయక్, బి.ఎన్.రెడ్డి నగర్ డివిజన్ అధ్యక్షుడిగా పర్వతి గణేష్‌రెడ్డి, వనస్థలిపురం డివిజన్ అధ్యక్షుడిగా కొల్లూరి శ్రీనాథ్, చింతలకుంట డివిజన్ అధ్యక్షురాలుగా కంచర్ల కవిత, బైరమాల్‌గూడ డివిజన్ అధ్యక్షుడిగా గొపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, హస్తినాపురం డివిజన్ అధ్యక్షురాలుగా జె. సంగీత శశిధర్‌రెడ్డి, చంపాపేట డివిజన్ అధ్యక్షుడిగా నోముల రవీందర్ గౌడ్, లింగోజిగూడ డివిజన్ అధ్యక్షుడిగా కందికంటి శ్రీధర్‌గౌడ్, కర్మన్‌ఘాట్ డివిజన్ అధ్యక్షుడిగా రమాకాంత్ గుప్తా, గడ్డి అన్నారం డివిజన్ అధ్యక్షుడిగా ఎం.సునీల్‌బాబు, కొత్తపేట డివిజన్ అధ్యక్షురాలుగా రజినిరావు, జిఎస్ఐ డివిజన్ అధ్యక్షుడిగా కృపాకర్ రెడ్డి, చైతన్యపురి డివిజన్ అధ్యక్షుడిగా గంధం రవి కేశవలకు నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా చల్లా నరసింహారెడ్డి, మధుయాష్కీగౌడ్ మాట్లాడుతూ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం చేయడంలో డివిజన్ అధ్యక్షుల పాత్ర కీలకంగా ఉండాలన్నారు. క్షేత్రస్థాయి నుంచి పార్టీని పటిష్టం చేసి, ప్రజా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను విస్తృతంగా ప్రచారం చేయాలని కోరారు.

## శాంతియుతంగా గణేష్ నిమజ్జనం

### ఫ్యూచర్ సిటీ డిసిపి యోగేష్ గౌతమ్ సూచన



**ప్రజాపక్షం/షాబాద్:** శాంతియుతంగా గణేష్ నిమజ్జనం జరుపుకోవాలని ఫ్యూచర్ సిటీ డిసిపి యోగేష్ గౌతమ్ అన్నారు. గురువారం షాబాద్ మండల కేంద్రంలోని వినాయక మండపాలను చేవేళ్ల ఎసిపి కిషన్, షాబాద్ ఎస్‌హెచ్ఒ లక్ష్మీ రెడ్డిలతో కలిసి పరిశీలించారు. అనంతరం వినాయకునికి ప్రత్యేక పూజలు చేశారు. షాబాద్‌కు దగ్గరలో ఉన్న పైల్‌వాన్ పెద్ద చెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో గుర్తు తెలియని వ్యక్తులు కనిపిస్తే వెంటనే షాబాద్ పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ చెన్నారెడ్డి పాల్గొన్నారు.







# అమరుల త్యాగఫలితమే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం

### మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

**ప్రజాపక్షం/రంగారెడ్డి :** ఎందరో అమరవీరుల త్యాగఫలితమే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం అని రాష్ట్ర ఐటి, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాలు, జిల్లా ఇంచార్జీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. రంగారెడ్డి జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం కొంగరకలాన్‌లో గురువారం తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. వేడుకలకు ముఖ్య అతిథిగా జిల్లా ఇంచార్జీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అంతకు ముందు పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించిన మంత్రి అమరవీరుల స్తూపం, తెలంగాణ తల్లి విగ్రహానికి నివాళులర్పించారు. పుర ప్రముఖులను, అధికార అనధికారులను కలిసి ప్రజాపాలన దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా ప్రగతిని, సెప్టెంబర్ 17 ప్రాముఖ్యతను వివరిస్తూ ప్రజలనుద్దేశించి మాట్లాడారు. అనంతరం తెలంగాణ ఉద్యమంలో అశువులు బాసిన జిల్లాకు చెందిన సిరిపురం యాదగిరి, శేఖర్‌రెడ్డి, కాకి కుమార్, దినేష్ చంద్ర కుటుంబసభ్యులను మంత్రి, ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్ సత్కరించారు. వేడుకల్లో టియుఎఫ్ ఐడిసి చైర్మన్ చల్లా నరసింహారెడ్డి, ఎమ్మెల్యేలు మల్‌రెడ్డి రంగారెడ్డి, వీర్లపల్లి శంకర్, కలెక్టర్ సి.నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్లు డాక్టర్ కిరణ్మయి కొప్పిశెట్టి, కె.చంద్రారెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి శారద దేవి, జిల్లా అటవీశాఖ అధికారి శివ ఆశిష్‌సింగ్, శంషాబాద్ డిసిపి బి.రాజేశ్, కలెక్టరేట్ ఎఒ సునీల్, ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## మనిషి జీవనానికి విద్య, నైపుణ్యం ఎంతో అవసరం

### అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** మనిషి జీవనానికి విద్యతో పాటు నైపుణ్యం కూడా ఎంతో అవసరమని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి కొప్పిశెట్టి అన్నారు. గురువారం రంగారెడ్డి జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో బిసి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా బిసి సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కేషు రామ్ ఆధ్వర్యంలో విరాట్ విశ్వకర్మ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అదనపు మాట్లాడుతూ పిల్లలను పాఠశాలలకు పంపించి విద్యాబుద్ధులు నేర్పించడంతో పాటు నైపుణ్యాలను కూడా నేర్పించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర బిసి ఫ్రంట్ చైర్మన్ జి.మల్లేష్ యాదవ్, రంగారెడ్డి జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు వెంకటాచారి, టిపిసిసి కార్యదర్శి శివకుమార్, సంఘం నాయకులు కొత్తకురుమ మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.



## ప్రజల సంక్షేమం, భద్రతే ప్రధాన లక్ష్యం





### సైబరాబాద్ పోలీస్ కమిషనర్ రమేష్

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** ప్రజల సంక్షేమం, భద్రత, అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని సమన్వయంతో పనిచేయడమే లక్ష్యమని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం.రమేష్ అన్నారు. ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా పోలీస్ అధికారులు, సిబ్బందికి ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సిపి ఎం.రమేష్ మాట్లాడుతూ ప్రజల సమస్యలను సానుకూల దృక్పథంతో పరిష్కరించేందుకు అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండాలని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ నియంత్రణతో పాటు మహిళలు, బాలికలు, వృద్ధులు, వలస కార్మికుల భద్రతకు పోలీస్ శాఖ అత్యంత ప్రాధాన్యం ఇస్తుందన్నారు. ప్రజలకు మెరుగైన భద్రత కల్పించేందుకు పోలీస్ శాఖ నిరంతరం అంకితభావంతో పనిచేస్తోందన్నారు. ప్రజలు సైతం చట్టాలను గౌరవిస్తూ పోలీసులకు సహకరించాలని సిపి కోరారు. కార్యక్రమంలో అడ్మిన్ డిసిపి అన్నపూర్ణ, ఎస్‌బి డిసిపి వై.వి.ఎస్. సుధీంద్ర,హెడ్‌క్వార్టర్స్ డిసిపి సంజీవ్, అడిషనల్ డిసిపి షమీర్‌తో పాటు పలువురు పోలీస్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

### ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్‌లో

ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ ప్రధాన కార్యాలయంలో తెలంగాణ ప్రజా పాలన దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కమిషనరేట్ ప్రధాన కార్యాలయంలో ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ డాక్టర్ తరుణ్ జోషి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఫ్యూచర్ సిటీ జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ జి.చందనా దీప్తి, మహేశ్వరం జోన్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ కె.నారాయణ రెడ్డితో పాటు కమిషనరేట్‌కు చెందిన ఇతర సీనియర్ పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ తరుణ్‌జోషి మాట్లాడుతూ ప్రజలకు సమర్థవంతమైన, బాధ్యతాయుతమైన సేవలందించడమే తమ లక్ష్యమన్నారు.

## ప్రజాస్వామ్య విలువలు రక్షించడమే నిజమైన నివాళి



### షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** ప్రజాస్వామ్య విలువలను రక్షించడమే తెలంగాణ వీరులకు నిజమైన నివాళి అని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. గురువారం తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా మున్సిపల్, క్యాంపు కార్యాలయం వద్ద జాతీయ జెండాను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఎగురవేశారు. ఎంపిడిఒ, తహసీల్దార్, ఆర్‌డిఓ కార్యాలయాల వద్ద ఎగురవేసి జాతీయ జెండా కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద నాగయ్య, ఆర్‌డిఓ వద్ద సరిత, డిప్యూటీ డిఎంహెచ్ కార్యాలయం వద్ద డాక్టర్ విజయ లక్ష్మీ లు జాతీయ జెండాలను ఎగురవేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బసవేశ్వర్, వైస్ చైర్మన్ అందె మోహన్, ఎంపిడిఒ శ్రీకాంత్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, మాజీ జడ్పిటిసి వెంకట్‌రాంరెడ్డి, కాంగ్రెస్ నేతలు చెంది తిరుపతిరెడ్డి, విశ్వం, రఘునాయక్, చెన్నయ్య, బాల్‌రాజ్ గౌడ్, దంగు శ్రీనివాస్ యాదవ్, విజయ్‌కుమార్‌రెడ్డి, మహ్మద్ ఇబ్రహీం, లింగారెడ్డిగూడ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

**కొత్తూరు:** తెలంగాణ వియోచన దినోత్సవం సందర్భంగా కొత్తూరు మండల కేంద్రంలోని తహసీల్దార్, ఎంపిడిఒ, పోలీస్ స్టేషన్, మున్సిపల్ కార్యాలయాల వద్ద అధికారులు జాతీయ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బాతుక లావణ్య దేవేందర్ యాదవ్, ఎమ్మె సత్తయ్య, విజయపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**కొందుర్గు:** తెలంగాణ విమోజన దినోత్సవాన్ని పురస్కరించుకొని కొందుర్గు మండల కేంద్రంలోని ఎంపిడిఒ, తహసీల్దార్, పోలీస్ స్టేషన్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద అధికారులు జాతీయ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పురుషోత్తంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**కేశంపేట:** తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని ఎంపిడిఒ, తహసీల్దార్, పోలీస్ స్టేషన్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద జాతీయ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి తాండ్ర విశాల శ్రావణ్ రెడ్డి, క్షుడు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## భక్తుల భద్రత, పరిశుభ్రతకు ప్రాధాన్యం

### మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి.వినయ్‌కృష్ణారెడ్డి



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో, సురక్షితంగా, సజావుగా, పరిశుభ్రమైన వాతావరణంలో నిర్వహించేందుకు మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్(ఎంఎంసి)ఆధ్వర్యంలో చేపడుతున్న ఏర్పాట్లను ఎంఎంసి కమిషనర్ టి.వినయ్ కృష్ణారెడ్డి, సంబంధిత జోనల్ కమిషనర్ సంయుక్తంగా సరూర్‌నగర్ సర్కిల్ పరిధిలో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ (శానిటేషన్), డిప్యూటీ కమిషనర్, టౌన్ ప్లానింగ్,అర్బన్ బయోడైవర్సిటీ(యుబిడి), రామ్‌కీ తదితర విభాగాల అధికారులతో కలిసి నిమజ్జన ప్రాంతాల్లో చేపట్టిన ఏర్పాట్లను సమీక్షించారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లను ముందస్తుగానే పూర్తి చేసి, నిమజ్జన ప్రక్రియ పూర్తయ్యే వరకు నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. నిమజ్జన ప్రాంతాల్లో విగ్రహాలను సురక్షితంగా తరలించి నిమజ్జనం చేసేందుకు క్రేన్లు, క్రేన్ ఆపరేషన్లను పకడ్బందీగా నిర్వహించేలా చర్యలు చేపట్టాలని కమిషనర్ సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో తక్షణ స్పందనకు శిక్షణ పొందిన ఈతగాళ్లను అందుబాటులో ఉంచడంతో పాటు, అవసరమైన వైద్య సదుపాయాలు, సహాయక బృందాలు, అత్యవసర పరికరాలను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. నిమజ్జన సమయంలో భక్తుల రాకపోకలు సజావుగా కొనసాగేలా ట్రాఫిక్ నిర్వహణ, సైన్‌బోర్డులు, ట్రాఫిక్ సూచికలు తగిన ప్రదేశాల్లో ఏర్పాటు చేయాలని, రద్దీని దృష్టిలో ఉంచుకుని అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. నిమజ్జన ప్రాంతాల్లో పేరుకుపోయిన మట్టి, పూడిక తదితరాలను తొలగించి అవసరమైన చోట్ల డీసిల్టింగ్, శానిటేషన్ పనులను చేపట్టాలని కమిషనర్ ఆదేశించారు. గణేష్ నిమజ్జనం సందర్భంగా సేకరించే పూలు మరియు ఇతర సేంద్రియ పదార్థాలను ప్రత్యేకంగా వేరు చేసి, వాటిని సమర్థవంతంగా వినియోగించే చర్యలు చేపట్టాలని సూచించారు. పారిశుధ్యం, ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్,యుబిడి,రామ్‌కీ తదితర విభాగాలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని కమిషనర్ సూచించారు. భక్తుల భద్రత, సౌకర్యం, పరిశుభ్రతకు ఎలాంటి రాజీ లేకుండా ఏర్పాట్లను కొనసాగించాలని ఆదేశించారు.

## ఘనంగా ప్రజా పాలన దినోత్సవం





**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో తెలంగాణ ప్రజా పాలన దినోత్సవ వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ప్రజాకేంద్రక పాలన, సామాజిక న్యాయం, సమ్మేళిత వృద్ధి, సుస్థిరాభివృద్ధి మార్గంలో తెలంగాణ రాష్ట్రం నిరంతరం పురోగమిస్తూ, ప్రజలందరికీ మెరుగైన అవకాశాలు, ఉజ్వల భవిష్యత్తును అందించాలని ఈ సందర్భంగా ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఎన్.రవి కిరణ్, చీఫ్ సిటీ ప్లానర్ బి. భావాని రాణి, చీఫ్ ఇంజనీర్ జ్యోతిర్మాయి, యుబిడి డైరక్టర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

**ఎంఎంసిలో...** తార్నాకలోని ఎంఎంసి ప్రధాన కార్యాలయంలో ప్రజా పాలన దినోత్సవాన్ని ఉత్సాహపూరిత వాతావరణంలో నిర్వహించారు. కార్పొరేషన్ కమిషనర్ టి. వినయ్ కృష్ణారెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజల సంక్షేమం, సమానత్వం, సామాజిక న్యాయం వంటి విలువల ఆధారంగా పారదర్శకమైన, బాధ్యతాయుతమైన పాలన అందించడం ప్రభుత్వ యంత్రాంగం ప్రధాన బాధ్యత అని ఉద్ఘాటించారు. క్షేత్రస్థాయి సమస్యలను వేగంగా పరిష్కరిస్తూ పారిశుధ్యం, రహదారులు, ప్రజారోగ్యం వంటి పౌర సేవలను మరింత సమర్థవంతంగా అందించాలని అధికారులకు సూచించారు. ఈ వేడుకల్లో అదనపు కమిషనర్లు సి.ఎన్. రఘు ప్రసాద్, కె. వేణుగోపాల్, చీఫ్ సిటీప్లానర్ బి. ప్రదీప్ కుమార్, అదనపు చీఫ్ సిటీప్లానర్ రజిత్ కుమార్, చీఫ్ ఇంజనీర్ బి.ఎల్. శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.

**సిఎంసిలో...** సిఎంసి ప్రధాన కార్యాలయంలో ప్రజా పాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సిఎంసి కమిషనర్ డాక్టర్ జి.సృజన జాతీయ జెండాను ఆవిష్కరించారు. తెలంగాణ చారిత్రక పోరాటంలో ప్రాణాలర్పించిన అమరవీరులకు, స్వాతంత్ర్య సమరయోధులకు ఈ సందర్భంగా ఘనంగా నివాళులర్పించారు. సెప్టెంబర్ 17 తెలంగాణ చరిత్రలో స్వేచ్ఛా ఆకాంక్షలకు ప్రతీకగా నిలుస్తుందని, త్యాగధనుల స్ఫూర్తితో జవాబుదారీతనం, పారదర్శకతతో కూడిన పాలన అందించడమే నిజమైన నివాళి అన్నారు. సైబరాబాద్ సమగ్ర అభివృద్ధికి, మెరుగైన పౌర సేవలందిచేందుకు అన్ని విభాగాలు సమన్వయంతో కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ గీతా రాధిక, చీఫ్ ఇంజనీర్ శ్రీలక్ష్మి , చీఫ్ సిటీప్లానర్ బి. వెంకన్న పాల్గొన్నారు.

**హెచ్‌ఎండిఏ...**అమీర్‌పేట్‌లోని స్వర్ణజయంతి కాంప్లెక్స్‌లో గల హెచ్‌ఎండిఏ కార్యాలయంలో తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం వేడుకలను నిర్వహించారు. హెచ్‌ఎండిఏ మెట్రోపాలిటన్ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. రాష్ట్ర పురోగతి, మౌలిక వసతుల కల్పనలో హెచ్‌ఎండిఏది అత్యంత కీలక పాత్ర అని, ప్రభుత్వ అభివృద్ధి దార్శనికతకు అనుగుణంగా ప్రతి ఉద్యోగి నిబద్ధతతో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జాయింట్ మెట్రోపాలిటన్ కమిషనర్ శ్రీనివత్స కోట, అర్బన్ ఫారెస్ట్రీ డైరెక్టర్ శ్రీ రోహిత్ గోపిడి, ప్లానింగ్ డైరెక్టర్లు ఎం.రాజేంద్ర ప్రసాద్ నాయక్, విద్యాధర్, యశ్వత్, చీఫ్ ఇంజనీర్ పరమ్ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.







## ప్రజా దృష్టి మళ్లించేందుకు
# మోదీ సర్కార్ హేయమైన యత్నం

**• యుపిఐ పన్ను నిర్ణయం తర్వాత తలెత్తిన తీవ్ర వ్యతిరేకతపై కాంగ్రెస్**



**న్యూఢిల్లీ :** అధిక విలువ కలిగిన యుపిఐ లావాదేవీలపై రుసుము విధించే నిర్ణయానికి పార్లమెంటరీ ఆర్థిక స్థాయీ సంఘంలోని తమ ఎంపిలు మద్దతు ఇచ్చారన్న వాదనలను కాంగ్రెస్ గురువారం తోసిపుచ్చింది. యుపిఐ పన్ను నిర్ణయం తర్వాత తలెత్తిన తీవ్ర వ్యతిరేకత నుండి ప్రజల దృష్టిని మళ్లించడానికి మోదీ ప్రభుత్వం హేయమైన ప్రయత్నాలు చేస్తోందని ఆ పార్టీ మండిపడింది. రూ. 2,000 కంటే ఎక్కువ విలువైన వ్యాపారి యుపిఐ చెల్లింపులపై రుసుము విధించే నిర్ణయాన్ని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ విమర్శించడంపై ప్రభుత్వం ప్రశ్నించిన నేపథ్యంలో ప్రతిపక్ష పార్టీ ఈ ప్రకటన చేసింది. పార్లమెంటరీ స్థాయీ సంఘం అటువంటి చర్యకు మద్దతు ఇచ్చిందని, ఆ కమిటీలోని కాంగ్రెస్ సభ్యులు కూడా దానికి అనుకూలంగా ఉన్నారని ప్రభుత్వం పేర్కొంది. యుపిఐ కోసం శ్రేణుల వారీగా ఉండే 'మర్చంట్ డిస్కౌంట్ రేట్' (ఎండిఆర్) లేదా ఆదాయ విధానాన్ని అమలు చేయాలని పార్లమెంటరీ ఆర్థిక స్థాయీ సంఘం కోరిందని, దీనిని ఎటువంటి జాప్యం లేకుండా నోటిఫై చేసి అమలు చేయాలని సూచించిందని ప్రభుత్వంలోని ఒక సీనియర్ అధికారి తెలిపారు. ఆగస్టు 12న ఆ నివేదికను ఆమోదించినప్పుడు పి. చిదంబరం, మనీష్ తివారీ, గౌరవ్ గొగోయ్, కిషోరి లాల్, కె. గోపీనాథ్ సహా ఐదుగురు కాంగ్రెస్ ఎంపిలు హాజరయ్యారని, ప్రచురించిన సమావేశ వివరాల్లో ఎటువంటి భిన్నాభిప్రాయాలు నమోదు కాలేదని బిజెపి నేత పేర్కొన్నారు. ఈ వాదనలను తోసిపుచ్చుతూ, మోదీ ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన యుపిఐ పన్ను ప్రతిపాదనపై పార్లమెంటరీ ఆర్థిక స్థాయీ సంఘం చర్చించలేదని గొగోయ్ చెప్పారు. ఆర్థిక కమిటీ సభ్యులతో సమావేశమైనప్పుడు యుపిఐ పన్నుపై ఆర్థిక శాఖ వద్ద ఎటువంటి నిర్దిష్ట ప్రతిపాదన లేదని గొగోయ్ తెలిపారు. ఎండిఆర్ ఆవశ్యకతపై ప్రశ్నలు లేవనెత్తినప్పటికీ, ఆ సమయంలో ప్రభుత్వ ప్రతినిధుల వద్ద ఎటువంటి నిర్దిష్టమైన లేదా సంతృప్తికరమైన సమాధానాలు లేవని గొగోయ్ పేర్కొన్నారు. గొగోయ్ పోస్ట్‌ను కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్ ప్రస్తావిస్తూ, మోదీ హయాంలో తలెత్తిన వార్తల సృష్టి వ్యవస్థ బట్టబయలైందని, మీరు దీన్ని తిప్పికొట్టడం సంతోషకరమన్నారు. మరొక పోస్ట్‌లో, అమెరికన్ కంపెనీలను, డొనాల్డ్ భాయ్‌ను ప్రసన్నం చేసుకోవడానికి తీసుకున్న యుపిఐ పన్ను నిర్ణయం తర్వాత తలెత్తిన తీవ్ర వ్యతిరేకత నుండి దృష్టిని మళ్లించడానికి మోదీ ప్రభుత్వం హేయమైన ప్రయత్నాలు చేస్తోందని రమేష్ పేర్కొన్నారు. కాంగ్రెస్ ఎంపీ మనీష్ తివారీ కూడా ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. దురదృష్టవశాత్తు, పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీల సమావేశాలు గోప్యంగా, ప్రత్యేక అధికారాలతో జరగాల్సి ఉండగా, ఇప్పుడు ప్రభుత్వం వాటిని రాజకీయ లబ్ధి కోసం వాడుకోవాలని చూస్తోందని తివారీ ఎక్స్ వేదికగా పేర్కొన్నారు.

## 140 కోట్ల జనాభా ఇంధన భద్రతకు
# అన్ని చర్యలూ తీసుకుంటాం: భారత్ స్పష్టీకరణ



**న్యూఢిల్లీ:** అమెరికా దిగువసభలో రష్యాపై ఆంక్షల బిల్లును ఆమోదించడంతో ఈ విషయంలో భారత్ తన మౌనాన్ని విడనాడింది. బిల్లుపై స్పందిస్తూ, ఇంధన రక్షణకు, ఆర్థిక ప్రయోజనాలను రక్షించుకునేందుకు అవసరమైన అన్ని చర్యలూ తీసుకుంటామని గురువారం ప్రకటించింది. గతనెలలో అమెరికా సెనేట్ "లిండ్సే ఓ గ్రాహం శాంక్షనింగ్ రష్యా అండ్ ఇరాన్ యాక్ట్ ఆఫ్ 2026" బిల్లును ఆమోదించిన తర్వాత దిగువసభ కూడా గురువారంనాడు బిల్లుకు పచ్చజెండా ఊపడంతో భారీ సుంకాలు విధించడానికి వీలుగా ట్రంప్‌కు విశేష అధికారాలు రానున్నాయి. 140 కోట్లమంది జనాభాగల దేశంలో ఆర్థిక,ఇంధన రక్షణ చర్యలకు అవసరమైన అన్ని చర్యలూ తీసుకుంటామని భారత విదేశీమంత్రిత్వశాఖ ఒక ప్రకటనలో స్పష్టం చేసింది.ఈ విషయంపై గడచిన కొద్ది నెలలుగా వివిధ స్థాయిల్లో అమెరికా అధికారులతో చర్చలు జరిగాయని, కేవలం ద్వైపాక్షిక సంబంధాలపైనే కాకుండా, అంతర్జాతీయ ఇంధన మార్కెట్‌పై కూడా ఇది ప్రభావం చూపిస్తుందని పేర్కొంది.ఈ పరిణామాలు,పర్యవసానాలు,ప్రభావాలను ఎదుర్కోవడానికి భారత ప్రభుత్వం వాణిజ్య,పారిశ్రామిక సంస్థలతో కలిసి పనిచేస్తుందని ప్రకటించింది. రష్యాను అదుపు చేసేందుకు,యూరప్‌కు మేలు చేసేందుకు వీలుగా ఈ బిల్లుకోసం రిపబ్లికన్లు—డెమోక్రాట్లు అరుదైన ఐక్యత ప్రదర్శించారు.భారత్—చైనా దేశాలు రష్యా నుండి దిగుమతులు పొందే విషయంలో తమ తప్పులను సరిదిద్దుకోవాలని రిపబ్లికన్ సెనేటర్ రిచర్డ్ బ్లూమెంతల్ పిలుపు ఇచ్చారు.
గతంలో కూడా ట్రంప్ రష్యా నుండి చమురు కొనుగోలు చేయకుండా భారత్‌ను అడ్డుకున్నారు. గత ఏడాది ఆగస్టు నుండి ఈ ఏడాది ఫిబ్రవరి వరకూ భారతదేశంపై అమెరికా 50 శాతం అదనపు సుంకాలు వసూలు చేసింది.అమెరికా—భారత్ మధ్య ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాన్ని ప్రకటించిన తర్వాత రష్యా నుండి చమురు దిగుమతి చేసుకున్నందుకుగాను అమెరికా వసూలు చేస్తున్న 25 శాతం జరిమానా సుంకాలను ట్రంప్ రద్దు చేశారు.ఐతే ప్రపంచదేశాలతో వాణిజ్యం విషయంలో ట్రంప్ అనుసరిస్తున్న సుంకాల విన్యాసాన్ని వ్యతిరేకించిన అమెరికా అత్యున్నత న్యాయస్థానం ఈ ఏడాది ఫిబ్రవరిలో పూర్తిగా కొట్టివేసింది. ఈ భారీ అదనపు సుంకాలు చెల్లుబాటు కాబోవని, దీనికి అమెరికా కాంగ్రెస్ ఆమోదం లేదని స్పష్టం చేసింది.

## పరీక్షల షెడ్యూల్ విడుదల చేసిన ఎన్‌టిఎ

**న్యూఢిల్లీ :** ఈ విద్యా సంవత్సరానికి గానూ (2026—27) డిసెంబర్ నుంచి మార్చి వరకు జరిగే పరీక్షల షెడ్యూల్‌ను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ) గురువారం విడుదల చేసింది. ఈ తేదీలు తాత్కాలికమైనవని, పరిపాలనాపరమైన, విద్యాపరమైన, చట్టపరమైన, నిర్వహణపరమైన లేదా ఇతర ఊహించని పరిస్థితుల కారణంగా వీటిలో మార్పులు ఉండవచ్చు అని ఒక సీనియర్ అధికారి పేర్కొన్నారు. ఈ కాలంలో మొత్తం 14 పోటీ పరీక్షలను నిర్వహించాలని నిర్ణయించారు. ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్ష జెఇఇ మెయిన్ మొదటి విడతను 2027 జనవరి 2224, జనవరి 2830 తేదీలలో నిర్వహించాలని ప్రతిపాదించారు. జనవరి 31ని బఫర్ తేదీగా (అదనపు తేదీగా) కేటాయించారు. యుజిసినెట్ పరీక్షను డిసెంబర్ 14—19 మధ్య నిర్వహించాలని ప్రతిపాదించారు. డిసెంబర్ 2021 తేదీలను బఫర్ తేదీలుగా నిర్ణయించారు. సిఎస్ఐఆర్ యుజిసినెట్ జాయింట్ పరీక్ష డిసెంబర్ 2021 తేదీలలో జరుగుతుంది. సిఎంఎటి 2027 ఫిబ్రవరి 7న, క్యూట్ పిజి 2027లో మార్చి 15, మార్చి 8, మార్చి 12—20ష మార్చి 24—25 తేదీలలో జరుగుతుంది. మార్చి 30—31 తేదీలను బఫర్ తేదీలుగా ఉంచారు. ఈ కాలంలో నిర్వహించబోయే ఇతర పరీక్షలలో ఎన్ఐటిటిటి, ఎన్ఐఎఫ్‌టి, స్వయం, ఆల్ ఇండియా సైనిక్ స్కూల్స్ పరీక్షలు ఉన్నాయి.

## ఇద్దరు ఎంపిలపై అవినీతి ఫిర్యాదులు కొట్టివేత :లోక్‌పాల్ తీర్పు

**న్యూఢిల్లీ :** మమతా బెనర్జీకి వ్యతిరేకంగా తిరుగుబాటు ప్రకటించిన తృణమూల్ కాంగ్రెస్ లోక్‌సభ సభ్యుడిపై, డిఎంకె ఎంపిపై వేర్వేరు కేసులలో ఉన్న అవినీతి ఫిర్యాదులను అవినీతి నిరోధక అంబుడ్స్‌మన్ లోక్‌పాల్ కొట్టివేసింది. వారిపై ఉన్న ఆరోపణలు నిరాధారమైనవి అని లోక్‌పాల్ తీర్పు ఇచ్చింది. లోక్‌పాల్ నిర్ణయంపై తిరుగుబాటుదారుడైన తృణమూల్ నాయకుడు అరూప్ చక్రవర్తి స్పందిస్తూ తనపై ఉన్న ఆరోపణలను బాధాకరమైనవి, నిరాధారమైనవి అని పేర్కొన్నారు. కాగా, ఈ తీర్పు అన్నీ స్పష్టంగా చెబుతోంది అని డిఎంకె ఎంపి కలానిధి వీరస్వామి అన్నారు. ఈ విషయం ఇంకా కోర్టు పరిధిలో ఉన్నందున, దీనిపై మరింత వ్యాఖ్యానించడానికి ఆయన నిరాకరించారు. మే నెలలో బెంగాల్‌లో బిజెపి ఘనవిజయం సాధించిన కొద్ది రోజులకే, బంకురా లోక్‌సభ ఎంపి అయిన చక్రవర్తి, తమ పార్టీకి వ్యతిరేకంగా తిరుగుబాటు ప్రకటించి, రిజిస్టర్ అయిన, గుర్తింపు లేని రాజకీయ పార్టీ అయిన నేషనలిస్ట్ సిటిజన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఎన్‌సిపిఐ)లో చేరిన 20 మంది తృణమూల్ ఎంపిలలో ఒకరిగా ఉన్నారు. చక్రవర్తిపై వచ్చిన ఫిర్యాదుపై విచారణ జరిపిన లోక్‌పాల్, సిబిఐ నిర్వహించిన ప్రాథమిక విచారణలో ఆయనపై ఉన్న ఆరోపణలకు ఎలాంటి ఆధారాలు లభించలేదని పేర్కొంది. అవినీతి నిరోధక సంస్థ గత ఏడాది నవంబర్‌లో, తన ఉత్తర్వులో ప్రతివాది ప్రభుత్వ ఉద్యోగి (ఆర్‌పిఎస్)గా పేర్కొన్న చక్రవర్తిపై ఉన్న ఆరోపణలపై ప్రాథమిక విచారణ జరపాలని సిబిఐని ఆదేశించింది. ఆగస్టు 28 నాటి తన నివేదికలో, విచారణ అధికారి 45కు పైగా పత్రాలను పరిశీలించి, ఆరుగురు సాక్షుల వాంగ్మూలాలను, ఆర్‌పిఎస్ వ్యాఖ్యలతో పాటు నమోదు చేసిన తర్వాత, అవినీతికి సంబంధించిన ఆరు ఆరోపణలను వివరించారు. చక్రవర్తి తన సోదరుడు ఆశిస్ చక్రవర్తి ద్వారా చట్టవిరుద్ధ కార్యకలాపాలను నిర్వహించారని, అవినీతి పథకాలను అమలు చేయడానికి, అక్రమ వసూళ్లను రాబట్టడానికి, స్థానిక అధికారుల మద్దతుతో స్థానిక నివాసితులను బెదిరించడానికి ఆశిస్ చక్రవర్తి మధ్యవర్తిగా వ్యవహరించారని ప్రధాన ఆరోపణ అని ఆ ఉత్తర్వులో పేర్కొన్నారు. కాగా, ఫిర్యాదులో ఎలాంటి యోగ్యత లేనందున దీనిని కొట్టివేస్తున్నట్లు లోక్‌పాల్ ఛైర్‌పర్సన్ జస్టిస్ ఎఎం ఖాన్విల్కర్ నేతృత్వంలోని ఆరుగురు సభ్యుల ధర్మాసనం జారీ చేసిన ఉత్తర్వులో పేర్కొంది. వేరొక ఉత్తర్వులో, చెన్నై నార్త్ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న డిఎంకె ఎంపి వీరస్వామిపై దాఖలైన ఫిర్యాదును లోక్‌పాల్ కొట్టివేసింది. సెప్టెంబర్ 10, 2025 నాటి ఆ ఫిర్యాదులో, ఎంపి మోసం, బెదిరింపులు, పలుకుబడిని దుర్వినియోగం చేశారని ఆరోపించారు. చెన్నైలోని ఒక షాపింగ్ మాల్‌లో రూ. 1.70 కోట్ల పెట్టుబడి కోసం ఫిర్యాదుదారురాలిని రూ. 38 లక్షలు తీసుకోవాలని అతను బలవంతం చేశాడని కూడా ఆరోపణలు ఉన్నాయి. నవంబర్ 10, 2025న ఆదేశించిన సిబిఐ విచారణలో తొమ్మిది మంది సాక్షులను, 32 పత్రాలను పరిశీలించిన అనంతరం, విచారణ అధికారి ఆగస్టు 19న తుది నివేదికను సమర్పించారు. ఫిర్యాదుదారురాలు స్థానిక పోలీసులకు ఈ విషయాన్ని నివేదించిన తర్వాత జరిగిన సంఘటనల దృష్ట్యా, డిఎంకె ఎంపి ప్రమేయాన్ని చూపించేందుకు ఎలాంటి ఆధారాలు లభించలేదని ఆయన ఆ నివేదికలో పేర్కొన్నారు. 'ఫిర్యాదులో ఆర్‌పిఎస్‌పై చేసిన ఆరోపణలకు ఆధారాలు లేవని విచారణ అధికారి తేల్చిన నిర్ధారణలో జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదని మా అభిప్రాయం. మేము దానితో ఏకీభవిస్తున్నాము. పై విషయాలను దృష్టిలో ఉంచుకుని, ఈ ఫిర్యాదులో ఎలాంటి అర్హత లేనందున దీనిని కొట్టివేస్తున్నాము' అని లోక్‌పాల్ పేర్కొంది.

## మణిపూర్‌లోని సహాయక శిబిరాలలో మరణాలపై...
# సుప్రీంకోర్టు 'దిగ్భ్రాంతి'

**• అఫిడవిట్ దాఖలు చేయాలని సిఎస్‌కు ఆదేశం**



**న్యూఢిల్లీ :** అంతర్గతంగా స్థానభ్రంశం చెందిన వ్యక్తుల (ఐడిపిలు) కోసం ఉద్దేశించిన మణిపూర్‌లోని సహాయక శిబిరాలలో పదుల సంఖ్యలో మరణాలు సంభవించడంపై గురువారం సుప్రీంకోర్ట్ దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. ఈ ఘటనపై దర్యాప్తు ప్రారంభించడానికి, క్రిమినల్ విచారణ ప్రారంభించడానికి, అక్కడ నివసిస్తున్న వారి భద్రతను నిర్ధారించడానికి తీసుకున్న చర్యల గురించి తమకు తెలియజేయాలని మణిపూర్ ప్రభుత్వ ప్రధానకార్యదర్శి(సిఎస్)ని అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది. సహాయకత శిబిరాలల్నో నిర్వాసితుల అసహజ మరణాలతో సహా, వాటికి సంబంధించిన జస్టిస్ గీతా మిట్టల్ కమిటీ అందించిన సమాచారంపై ఎందుకు గణనీయమైన చర్యలు తీసుకోలేదని భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) సూర్యకాంత్, న్యాయమూర్తులు జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చి, జస్టిస్ వి.మోహనలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం రాష్ట్ర ఉన్నతాధికారిని హెచ్చరించింది. మణిపూర్‌లోని సహాయక శిబిరాలలో జరిగిన మరణాలు, ముఖ్యంగా అసహజ మరణాలపై అఫిడవిట్ దాఖలు చేయాలని మణిపూర్ చీఫ్ సెక్రటరీని మేం ఆదేశిస్తున్నాం' అని ధర్మాసనం తన ఉత్తర్వులో పేర్కొంది. 34 మరణ కేసులలో కేవలం 20 కేసులకు సంబంధించిన మృతదేహాలకు మాత్రమే పోస్ట్‌మార్టమ్ ఎందుకు నిర్వహించారని సిజెఐ సూర్యకాంత్ ధర్మాసనం ప్రశ్నించింది.'సహాయక శిబిరాలలో ఆశ్రయం పొందుతూ అసహజ మరణాలకు గురైన అంతర్గత నిర్వాసితులకు కేవలం రూ.20,000 నుంచి రూ.30,000వరకు మాత్రమే ఎందుకు చెల్లించారో రాష్ట్ర ప్రభుత్వం వివరించాల్సి ఉంది' అని ధర్మాసనం పేర్కొంది. ఈ విషయంపై స్పెషల్ స్టేటస్ రిపోర్ట్‌ను దాఖలు చేయాలని మణిపూర్ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీని (ఎంఎస్ఎల్ఎస్ఎ) కూడా బెంచ్ ఆదేశించింది. అన్ని అసహజ మరణాల కేసులలో ఎఫ్ఐఆర్‌లు నమోదు అయ్యేలా చూడాలని ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ ధర్మాసనం ఎంఎస్ఎల్ఎస్ఎని కోరింది. ఎఫ్ఐఆర్‌లపై త్వరితగతిన దర్యాప్తు జరిగేలా చూడాలని, సహాయక శిబిరాలలో ఉంటున్న అంతర్గత నిర్వాసితుల భద్రతతోపాటు వారి గౌరవాన్ని కూడా నిర్ధారించాలని ధర్మాసనం మణిపూర్ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీని ఆదేశించింది. మణిపూర్‌లోని సహాయక శిబిరాలలో 30కి పైగా మరణాలు సంభవించాయని, వాటిలో ఒక మరణం లైంగిక దాడి ఆరోపణల నేపథ్యంలో జరిగిందని జస్టిస్ మిట్టల్ కమిటీ, ఒక ఐఎఎస్ అధికారి ఇచ్చిన నివేదికలను పరిశీలించిన అనంతరం ధర్మాసనం ఈ ఉత్తర్వును జారీచేసింది. అంతేకాకుండా, రెండు స్పెషల్ ట్రయల్ కోర్టుల విచారణలు మణిపూర్‌లో 2023లో జరిగిన జాతి హింసాకాండకు సంబంధించి సిబిఐ, ఎన్ఐఎ కేసులను ప్రత్యేకంగా విచారించడానికి ఏర్పాటు చేసిన న్యాయస్థానాలు వాటి విచారణలను వేగంగా ముగిస్తాయి. నివేదికలను ప్రస్తావిస్తూ, కేసుల వివరాలను న్యాయసేవల న్యాయవాదికి అందించామని, బాధితులైన పిటిషనర్లు తమ కేసులను ముందుకు తీసుకెళ్లేందుకు వాటిని ఉపయోగించుకోవచ్చని సిజెఐ ధర్మాసనం తెలియజేసింది.మణిపూర్ హింసా కేసులలో సిబిఐ దర్యాప్తును పర్యవేక్షిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం, మాజీ ఐపిఎస్ అధికారి దత్తాత్రేయ పడ్సల్గికర్ ఈ వివరాలను అందించారని కూడా పేర్కొంది. సిబిఐ, రాష్ట్ర ప్రభుత్వం తరపున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్యా భాటి, కేంద్ర దర్యాప్తు సంస్థ 31కేసులను విచారించగా, వాటిలో 28కేసులకు ఫైనల్ రిపోర్టు దాఖలు చేయనున్నట్లు తెలిపారు. మూడు సిబిఐ కేసులు ఇంకా దర్యాప్తులో ఉన్నాయని ఐశ్వర్యా భాటి అన్నారు. సిబిఐ కేసులను మినహాయించి, రాష్ట్ర ప్రభుత్వం 8 జిల్లాలలో స్థానిక పోలీస్ అధికారులతో కూడిన 42 సిట్ బృందాలను ఏర్పాటు చేసిందని న్యాయాధికారి తెలిపారు. సిట్‌లు 3,020 కేసులను నమోదు చేయగా, 302 కేసుల్లో ఛార్జిషీట్లు దాఖలు చేశారని ఐశ్వర్యా భాటి వివరించారు. 1,583 కేసులలో సిట్‌లు ముగింపు నివేదికలను దాఖలు చేశాయని, 1,135కేసులలో దర్యాప్తు సాగుతుందని ఆమె చెప్పారు. సిట్‌లు దర్యాప్తు చేస్తున్న 33కేసులలో విచారణలు ప్రారంభం అయ్యాయని అదనపు సొలిసిటర్ జనరల్ భాటి జోడించారు.గతంలో మణిపూర్‌లో 2023లో జరిగిన జాతి హింసాకాండకు సంబంధించి తలెత్తిన సిబిఐ, ఎన్ఐఎ కేసులను ప్రత్యేకంగా విచారించేందుకు రెండు స్పెషల్ ట్రయల్ కోర్టులను ఏర్పాటు చేసే విషయాన్ని పరిశీలించాలని మణిపూర్, అసోం ప్రభుత్వాలు, ఇతరులను సుప్రీంకోర్టు కోరింది. మెజారిటీ మైతేయి వర్గం షెడ్యూల్ ట్రైబ్ హోదా కోసం చేస్తున్న డిమాండ్‌కు నిరసనగా హిల్ జిల్లాల్లో నిర్వహించిన గిరిజన సంఘీభావ యాత్ర అనంతరం, 2023 మే 3న మణిపూర్‌లో జాతి హింస చెలరేగిన విషయం తెలిసిందే. కాగా అప్పటి నుంచి 200మందికి పైగా మరణించగా, వందలాడి మంది గాయపడ్డారు. వేలాది మంది నిరాశ్రయులయ్యారు.

## మారాఠా కోటా కార్యకర్త
# జారంగే దీక్ష విరమణ

**• మూడు నెలల్లోగా డిమాండ్లు నెరవేర్చకుంటే నిరసనను ముంబయికి తీసుకెళ్తానని హెచ్చరిక**



**బీడ్ :** మరాఠా కోటా కార్యకర్త మనోజ్ జారంగే గురువారం నిరాహార దీక్షను విరమించారు. మరాఠా సామాజిక వర్గానికి కున్బీ సర్టిఫికెట్లు జారీ చేయాలని జారంగే గత 20 రోజులుగా నిరాహారదీక్ష చేస్తున్నారు. కాగా, మరాఠా రిజర్వేషన్ల కోసం తాను చేపట్టిన డిమాండ్లను మూడు నెలల్లోగా పరిగణనలోకి తీసుకోకపోతే, తన నిరసనను ముంబయికి తీసుకెళ్తానని మహారాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరిస్తూ దీక్షను విరమించారు. బీడ్ జిల్లాలోని పటోడాలో మంత్రులు రాధాకృష్ణ విఖే పాటిల్, దాదా భూసే, ఎమ్మెల్సీ ప్రసాద్ లాడ్, ఎమ్మెల్యే సురేష్ ధాస్, ఇతర సీనియర్ అధికారులతో కూడిన ప్రభుత్వ ప్రతినిధి బృందంతో చర్చల అనంతరం జారంగే ఈ ప్రకటన చేశారు. ప్రభుత్వం ఎలాంటి బెదిరింపు చర్యలను సహించదని, జరుగుతున్న గణేష్ ఉత్సవాల సమయంలో ఈ ఆందోళన చేపట్టడంపై ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ ప్రశ్నించిన కొద్ది రోజులకే ఈ పరిణామం చోటుచేసుకుంది. జారంగే నిరాహార దీక్షను విరమించాలన్న నిర్ణయాన్ని ఫడ్నవిస్ స్వాగతించారు. ఆయన కోరిన 13 డిమాండ్లలో 12ను ప్రభుత్వం ఇప్పటికే అంగీకరించిందని, వాటన్నింటినీ నెరవేరుస్తుందని తెలిపారు. ముంబయి వెళ్లే మార్గమధ్యంలో బీడ్ జిల్లాలోని పటోడాలో ఆగిన కార్యకర్త జారంగేతో జరిగిన సమావేశంలో, మరాఠా కోటా కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన చర్యల గురించి ప్రతినిధి బృంద సభ్యులు ఆయనకు తెలియజేశారు. తన డిమాండ్లను పరిగణనలోకి తీసుకునేందుకు జరుగుతున్న అధికారిక పనుల పురోగతిని పర్యవేక్షించడానికి జారంగే ముగ్గురు ప్రతినిధులను నియమించాలని విఖే పాటిల్ సూచించారు. 'అడ్వకేట్ జనరల్ నుండి లిఖితపూర్వక వ్యాఖ్య అందిన తర్వాత కొల్హాపూర్, సతారా గెజిట్లపై చర్య తీసుకోవడానికి సుమారు మూడునాలుగు నెలల సమయం పడుతుంది' అని మంత్రి అన్నారు. తన నిరాహార దీక్షను విరమించుకోవాలని జారంగేను కోరారు. మరాఠాలు తమ కున్బీ వంశాన్ని నిరూపించుకుని, ఒబిసి రిజర్వేషన్ ప్రయోజనాలను పొందగలిగేలా, హైదరాబాద్ గెజిట్, సతారా గెజిట్, ఔంధ్ గెజిట్ వంటి చారిత్రక పరిపాలనా రికార్డులకు అధికారిక గుర్తింపు ఇవ్వాలన్న తన డిమాండ్‌పై తాను కట్టుబడి ఉన్నానని జారంగే అన్నారు. ప్రభుత్వం తనకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోకపోతే, తన నిరసనను ముంబయికి తీసుకువెళ్తానని జారంగే అన్నారు. 'రాబోయే మూడు నెలల్లో మమ్మల్ని మోసం చేస్తే, మేమందరం మా పిల్లలు, మహిళలతో సహా నేరుగా ముంబయి వెళ్తాము' అని ఆయన అన్నారు. ఇప్పటికే ముంబయికి వెళ్లిన లక్షకు పైగా మరాఠాలను తమ ఇళ్లకు తిరిగి రావాలని ఆయన కోరారు. ఇదిలా ఉండగా, జాల్నా జిల్లాలోని తన సొంత గ్రామం అంతర్వాలి సరతి నుండి బయలుదేరిన జారంగే, అహిల్యానగర్, పుణె, రాయ్‌గఢ్ జిల్లాలోని ఖోపోలి మీదుగా సెప్టెంబర్ 19 నాటికి ముంబయి చేరుకోవాల్సి ఉంది. అయితే, కడుపు, పాదాలలో తీవ్రమైన మంటగా అనిపిస్తోందని పేర్కొంటూ, ముంబయి యాత్రను రద్దు చేసుకునే అవకాశం ఉందని ఆయన బుధవారమే సూచించారు. గత ఏడాది ఆజాద్ మైదాన్‌లో జారంగే చేపట్టిన నిరాహార దీక్ష సమయంలో వేలాది మంది మద్దతుదారులు నగరానికి తరలిరావడంతో దక్షిణ ముంబయి స్తంభించిపోయింది.

# విశ్వసనీయ తయారీ హబ్.. భారతదేశం

**ప్రధాని మోదీ**
**చిప్ పరిశ్రమ కోసం పూర్తి సహకారం అందిస్తామని హామీ**

**న్యూఢిల్లీ :** ప్రపంచ తయారీ రంగానికి భారతదేశం ఒక నమ్మకమైన ప్రత్యామ్నాయమని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు. సెమీ కండక్టర్ల రంగంలో దేశాన్ని ఒక ప్రాధాన్య గమ్యస్థానంగా తీర్చిదిద్దేందుకు తమ ప్రభుత్వం అవసరమైన అన్ని చర్యలూ తీసుకుంటోందని ప్రధాని చిప్ పరిశ్రమ నాయకులను ఉద్దేశించి అన్నారు. ప్రపంచం కొత్త, విశ్వసనీయమైన తయారీ రంగం కోసం ఎదురుచూస్తోంది. సెమీకండక్టర్ వ్యవస్థకు ప్రాధాన్య గమ్యస్థానంగా మారడానికి భారతదేశం అవసరమైన ప్రతీ అడుగు వేస్తోందని అని గురువారం ఇక్కడ జరిగిన 5వ సెమికాన్ ఇండియా సదస్సును ప్రారంభిస్తూ ప్రధానమంత్రి మోదీ తెలియజేశారు. ఈ అవసరాన్ని తీర్చడానికి ఇండియా క్రమంగా సిద్ధం అవుతోందని చెప్పారు. ఇండియన్ మ్యాక్స్ చిప్స్ తొలిసారిగా వినియోగదారులకు చేరడం ప్రారంభించాయనే వార్తను కూడా మోదీ తన ప్రసంగంలో జతచేశారు. ఇప్పుడు భారతదేశంలోని ప్లాంట్ల నుంచి వస్తున్న మన చిప్స్ దేశం సహా ప్రపంచంలోని వినియోగదారులకు చేరడం ప్రారంభించాయని ఆయన చెప్పారు. మోదీ ఈ ఒత్తిడిని ఆర్థిక పురోగతి అనే విస్తృత కథనంలో భాగంగా పేర్కొన్నారు. 7.8శాతం త్రైమాసిక జిడిపి వృద్ధి, జపాన్ క్రెడిట్ రేటింగ్ ఏజెన్సీ ఇటీవల ఇచ్చిన సార్వభౌమ రేటింగ్ ఉన్నతీకరణ, న్యూఢిల్లీ వంటి అంశాలను ఉదహరించారు. ఈ నెలలో భారతదేశం ఆతిథ్యం ఇచ్చిన బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశంలో ఆమోదించిన డిక్లరేషన్. 'భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధి చెందుతోంది. మరొకవైపు భారతదేశంపై ప్రపంచ విశ్వాసం కూడా పెరుగుతోంది' అని ఆయన అన్నారు. 2022లో ఈ మిషన్ ప్రారంభమైనప్పటి నుంచి ఈ వ్యవస్థ వేగంగా విస్తరించడంలో కీలకపాత్ర పోషించినందుకు, సమావేశానికి హాజరైన పారిశ్రామిక నాయకులను ఆయన ప్రశంసించారు. 'భారతదేశం సాధించిన ఈ విజయానికి మీరే మూల స్తంభాలు, మీరే భాగస్వాములు' అని ప్రధానమంత్రి మోదీ చెప్పారు. 2022లో ప్రారంభమైనప్పటి నుంచి భారతదేశ సెమీ కండక్టర్ కార్యక్రమంలో సాధించిన పురోగతిని కూడా ప్రధాని ముఖ్యంగా ప్రస్తావించారు. ఈ రంగం విధాన రూపకల్పన, ప్రాజెక్ట్ ప్రణాళికల నుంచి పైలట్ ఉత్పత్తి వాణిజ్య తయారీ దశలకు చేరుకుందని ఆయన చెప్పారు.

## మోదీకి పుట్టినరోజు శుభాకాంక్షల వెల్లువ



**న్యూఢిల్లీ :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 76వ పుట్టినరోజు సందర్భంగా, రాజకీయ వర్గాలకు చెందిన నాయకులు గురువారం ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రజా సేవలో ఆయన గడిపిన 25 ఏళ్లను ఈ సందర్భంగా ప్రముఖంగా ప్రస్తావించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పరిపాలనలో ఆయన రికార్డును ప్రశంసించగా, హోం మంత్రి అమిత్ షా ఒక సాధారణ బిజెపి కార్యకర్త నుండి దేశంలో అత్యున్నత రాజకీయ పదవి వరకు మోదీ సాగించిన ప్రయాణాన్ని గుర్తుచేసుకున్నారు. ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థలలో ఒకటిగా భారతదేశం ఆవిర్భవించడంలో మోదీ కీలక పాత్ర పోషించారని ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ ప్రశంసించారు. గుజరాత్ ముఖ్యమంత్రి నుండి ప్రధానమంత్రి వరకు ఆయన సాగించిన ప్రయాణం 'భారత వృద్ధి గాథకు కొత్త ఊపునిచ్చింది' అని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడు అన్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ కూడా మోదీ దీర్ఘాయుష్షుతో జీవించాలని ఆకాంక్షించారు. గుజరాత్‌లోని వద్నగర్‌లో 1950 సెప్టెంబర్ 17న జన్మించిన మోదీ, గురువారం 76వ ఏట అడుగుపెట్టారు. 2001లో గుజరాత్ ముఖ్యమంత్రిగా తొలిసారి ప్రమాణ స్వీకారం చేసి, 2014లో ప్రధానమంత్రి అయిన ఆయన, అక్టోబర్ 7న ప్రజా పదవిలో అప్రతిహతంగా 25 సంవత్సరాలు పూర్తి చేసుకుంటారు.

## మధ్యప్రదేశ్‌లో
# అవినీతి,అసమర్థ ప్రభుత్వం

**• 30 మందికి పైగా గిరిజన పిల్లలు మృతిపై రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు**

**న్యూఢిల్లీ :** బాలాఘాట్ జిల్లాలో వివిధ వ్యాధుల కారణంగా 30 మందికి పైగా గిరిజన పిల్లలు మరణించడంపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ గురువారం మధ్యప్రదేశ్‌లోని బిజెపి ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం దేశంలోనే అత్యంత అవినీతిమయమైన, అసమర్థమైన ప్రభుత్వమని ఆయన ఆరోపించారు. ముఖ్యమంత్రి మోహన్ యాదవ్‌ను కూడా తప్పుబట్టిన రాహుల్‌గాంధీ, దీపాలు వెలిగించడం, వేడుకలు జరుపుకోవడం వంటి కార్యక్రమాల తర్వాత సమయం దొరికితే, రాష్ట్రంలోని వాస్తవ పరిస్థితులను ఆయన పరిశీలించాలనిన్నారు. 'బాలాఘాట్‌లో అనారోగ్యం, పోషకాహార లోపం, కనీస ఆరోగ్య సదుపాయాల కొరత కారణంగా 30 మందికి పైగా గిరిజన పిల్లలు మరణించారు. నిర్లక్ష్యం ఏ స్థాయిలో ఉందంటే, అమాయక ప్రాణాలు పోతున్నా ప్రభుత్వం స్పందించడంలో జాప్యం చేస్తూ నిద్రపోతూనే ఉంది' అని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు 'ఎక్స్' వేదికగా హిందీలో చేసిన పోస్ట్‌లో పేర్కొన్నారు. వ్యాధుల నియంత్రణ లేకపోవడం, పోషకాహారం, స్వచ్ఛమైన నీటి కొరత, కుప్పకూలుతున్న ఆరోగ్య వ్యవస్థ పిల్లల ప్రాణాలను బలిగొంటున్నాయని ఆయన ఆరోపించారు.

## పంజాబ్, ఎంపిలో రైతులు ఆందోళనబాట

**పెరోజ్‌పూర్/హింగోలి :** పంజాబ్, మధ్యప్రదేశ్‌లో పలు సమస్యలపై రైతులు ఆందోళనబాటన పట్టారు. రుణమాఫీ సహా 12 డిమాండ్లు అమలు చేయాలని పంజాబ్‌లో, భూసేకరణకు వ్యతిరేకంగా మధ్యప్రదేశ్‌లో రైతులు నిరసనలు వ్యక్తం చేశారు. రుణమాఫీ, బాస్మతి, మొక్కజొన్న, పెసర, ఆవాలు, బంగాళదుంపలను కనీస మద్దతు ధరలకు కొనుగోలు చేయడం వంటి తమ 12 డిమాండ్లను పరిష్కరించి, తమతో చర్చలు జరపాలని పంజాబ్ ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు రైతులు గురువారం నాలుగు చోట్ల రైలు పట్టాలపై బైఠాయించారు. మల్లన్‌వాలా, అమృతసర్, గురుదాస్‌పూర్, మోగా ప్రాంతాల్లో రైతులు రైలుపట్టాలపై బైఠాయించినట్లు ఈ నిరసనకు నాయకత్వం వహిస్తున్న కిసాన్ మజ్దూర్ మోర్చా (కెఎంఎం) తెలిపింది. గురువారం మధ్యాహ్నం 12 గంటలలోపు తమ డిమాండ్లను నెరవేర్చాలని బుధవారం రాష్ట్ర ప్రభుత్వానికి అల్టిమేటం జారీ చేసిన తర్వాత తాము ఈ నిరసనను ప్రారంభించినట్లు కెఎంఎం తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వం తమ డిమాండ్లను అంగీకరించకపోతే, రైలు పట్టాలపై బైఠాయించేందుకు ప్రణాళిక వేసినట్లు ఆ సంస్థ పేర్కొంది. గత ఆందోళనలలో పాల్గొన్న రైతులు, కార్మికులపై నమోదు చేసిన కేసులను ఉపసంహరించుకోవాలని రైతులు తమ డిమాండ్లలో భాగంగా కోరుతున్నారు. ఆగస్టు 31న, రైతులు పంజాబ్ వ్యాప్తంగా డిప్యూటీ కమిషనర్ల కార్యాలయాల వెలుపల నిరసన తెలిపి, తమ డిమాండ్లను వెల్లడిస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి వినతిపత్రాన్ని సమర్పించారు. రాష్ట్రంలోని పలువురు క్యాబినెట్ మంత్రుల నివాసాలు, కార్యాలయాల బయట ధర్నాలు నిర్వహించారు. ఫిరోజ్‌పూర్‌లో, శాంతియుత ప్రదర్శనలు జరిగినప్పటికీ, రైతులు, కార్మికులకు సంబంధించిన సమస్యలపై ప్రభుత్వం సమర్థవంతమైన చర్యలు తీసుకోవడంలో విఫలమైందని కెఎంఎం నాయకుడు ఇందర్‌జిత్ సింగ్ బాత్ అన్నారు. రైతుల 12 సూత్రాల చార్టర్‌లో, రైతులు, వ్యవసాయ కార్మికులకు పూర్తి రుణమాఫీతో పాటు, ఆత్మహత్య చేసుకున్న రైతులు, కార్మికుల కుటుంబాలకు తగిన పరిహారం మరియు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించాలని కోరారు.

SHRIRAM Finance **వాహనముల బహిరంగ వేలం ప్రకటన**

సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా ఈ క్రింది వాహనములు వాయిదాల సకాలంలో చెల్లించని కారణంగా స్వాధీనపరుచుకున్న వాహనములు ఉన్నవి ఉన్నట్లుగా వేలం ద్వారా విక్రయించుటకు నిర్ణయించబడినది.

| S.No | VEHICLE NO | Customer Name | MAKE & MODEL | YEAR |
|---|---|---|---|---|
| 1 | AP31BR 3177 | Sindhura kukkamudi | ACE 12XW | 2011 |
| 2 | TS08KA 3845 | Rajender Thota | SWIFT DIZERE VDI DIESEL 5 SEATER | 2013 |
| 3 | TS02EZ 5498 | Salendra Pavan Kalyan | JOHN DEERE 5210 | 2019 |
| 4 | TS07UE 7775 | Sadanandam Medipelly | TATA BOLT-P | 2017 |

AUCTION DATE : 19-09-2026
VENUE : SHRIRAM AUTOMALL INDIA LTD, PUNNEL CROSS ROAD, BOLLIKUNTA, WARANGAL
గమనిక : వేలం తేది ప్రకటన నుండి బండి అమ్ముడు అయ్యే వరకు వర్తించును
SHRIRAM FINANCE LIMITED
H No : 55-1-191, 1st Floor , Above HDFC Bank, Karimnagar Road, Ramaram Complex, Hanamkonda 506015 Cell : 9666576664, 9959103322 & 9676049567.

# ఎక్కడో దూరంగా కూర్చుని పెత్తనమా?

● అమెరికా ఆంక్షల బిల్లుకు చైనా తీవ్ర వ్యతిరేకత ● భద్రతామండలి జోక్యంలేని మూడోపక్షం జోక్యాన్ని పట్టించుకోం ● సమానత్వం,పరస్పర ప్రయోజనాలతోనే వాణిజ్య సహకారం ● చైనా విదేశాంగ ప్రతినిధి జాయాకున్ స్పష్టీకరణ ● సుంకాలపై సంప్రదింపులు



**బీజింగ్:**అమెరికా కాంగ్రెస్ దిగువసభలో రష్యాపై ఆర్థిక ఆంక్షల ఒత్తిడిని మరింత పెంచుతూ చేసిన తీర్మానాన్ని చైనా ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకించింది. ఎక్కడో దూరంగా కూర్చుని మాపై పెత్తనం చేస్తే సహించబోమని ఘాటుగా హెచ్చరిక చేసింది. రష్యాతో చైనాకు ఉన్న ఆర్థిక సహకారం,వాణిజ్యంపై మూడోపక్షం జోక్యం ఉండకూడదని స్పష్టం చేసింది. ''భద్రతామండలి ప్రమేయం లేని సుదూర అధికార పరిధి విస్తరణను వ్యతిరేకిస్తున్నాం'' అని ఎంతో మర్యాదగా స్పందించింది. ఒకవైపు ఈ చర్యను తీవ్రంగా వ్యతిరేకిస్తూనే,అమెరికా–చైనా వాణిజ్య బృందాలు పరస్పర సుంకాలను తగ్గించుకోవడంకోసం సన్నిహిత చర్చలు జరుపుతున్నాయని చైనా వాణిజ్యమంత్రిత్వశాఖ ప్రతినిధి గురువారం ప్రకటించారు.''లిండ్సే ఓ గ్రాహం శాంక్షనింగ్ రష్యా అండ్ ఇరాన్ యాక్ట్ ఆఫ్ 2026'' అనే పేరుతో గురువారంనాడు అమెరికా బిల్లును ఆమోదించింది.అంతర్జాతీయ చట్టాలకు అనుగుణంగా భద్రతామండలి జోక్యం లేని ఎలాంటి చర్యలనైనా చైనా తీవ్రంగా ప్రతిఘటిస్తుందని ఆ దేశ విదేశీమంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి గ్వో జియాకున్ వారాంతపు మీడియా సమావేశంలో స్పష్టం చేశారు. ''అమెరికా దిగువసభ,ఎగువసభ చేసిన తీర్మానం అంతర్జాతీయ చట్టాల పరిధిలోకి రాదు, ఈ విషయంలో భద్రతామండలి ప్రమేయం లేదు, దాని అధికారపరిధిలోకి ఈ బిల్లు లేదా తదుపరి చట్టం వర్తించదు,దీనిని ప్రతిఘటిస్తాం''అన్నారు.ప్రపంచ దేశాలతో చైనా సమానత్వం,పరస్పర ప్రయోజనాలు అనే సాధారణ సూత్రాల ఆధారంగా సాధారణ వాణిజ్య సంబంధాలను,ఆర్థిక సంబంధాలను కొనసాగిస్తుందని చెప్పారు.ఈ విధమైన వాణిజ్య సహకారంలో మూడోపక్షం జోక్యాన్ని చైనా పట్టించుకోదని,మూడోపక్షం బలప్రయోగానికి కట్టుబడి ఉండబోదని అన్నారు.ఇరాన్ నుండి చమురు కొనుగోలు చేయకూడదంటూ ఇంతకుముందు ఇదేవిధంగా ఎకనామిక్ డీ డే పేరుతో విధించిన ఆర్థిక ఆంక్షలను కూడా చైనా తిరస్కరించింది.రష్యా నుండి చైనాకు భూ సరిహద్దుల నుండి పైప్‌లైన్ ద్వారా చమురు,సహజవాయువులను రష్యా సరఫరా చేస్తుంది. అధికారిక గణాంకాల ప్రకారం గత ఏడాదిలో రష్యా నుండి చైనాకు చమురు సహజవాయువు దిగుమతుల విలువ 64 బిలియన్ డాలర్లకు చేరింది. 2026 జనవరి నుండి ఆగస్టు నెల వరకూ రష్యా నుండి చైనాకు దిగుమతులు 70 బిలియన్ డాలర్లు దాటాయి.

# ఇయు అసోసియేట్‌గా కెనడా: మార్క్ కార్నీ సమ్మతి

● ఈ పొత్తు ఇతర ప్రజాస్వామ్య దేశాలకు ఆదర్శం ● అగ్రరాజ్యాలకు పోటీగా కొత్త కూటమికి తిరస్కృతి



**బ్రస్సెల్స్:**యూరోపియన్ యూనియన్(ఇ.యు)లో మొట్టమొదటి అసోసియేట్ సభ్యదేశంగా ఉండాలని ఇ.యు కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వోండర్‌లేయన్ చేసిన ప్రతిపాదనను కెనడా ప్రధాన మంత్రి మార్క్ కార్నీ స్వాగతించారు. సభ్యదేశంగా చేరడాన్ని ఒక సానుకూల చర్యగా అభివర్ణించారు. ఐతే ఇ.యులో పూర్తిస్థాయిలో 28వ సభ్యదేశంగా ఉండాలనుకోవడంలేదని నొక్కి చెప్పారు. కెనడా –ఇ.యు మధ్య పొత్తు ఇతర ప్రజాస్వామ్య దేశాలకు ఒక మార్గదర్శకంగా నిలుస్తుందని అన్నారు. అనేక రంగాలలో ఇయుతో కెనడా సన్నిహితం కాగలదన్నారు.కెనడా–ఇయు దేశాల ప్రజలమధ్య సంబంధాల గురించి ప్రస్తావించారు. యురప్ అట్లాంటిక్ మహాసముద్రానికి ఇరువైపుల రాకపోకలు, నివాసాలు, విద్యాభ్యాసానికి అవకాశాలు కల్పించాలని కార్నీ కోరారు. ఐతే అగ్రరాజ్యాలకు ప్రతిరేకంగా మరింత సన్నిహితమైన పోటీ ఇచ్చేందుకు ''యూరోపియన్ యూనియన్ భద్రతా మండలి'' ఏర్పాటు చేయాలన్న వోండర్‌లేయన్ ప్రతిపాదనను మాత్రం ఆయన తిరస్కరించారు. స్ట్రాస్‌బర్గ్‌లో బుధవారం జరిగిన ఇయు స్టేట్ ఆఫ్ ద యూనియన్ సమావేశంలో వోండర్‌లేయన్ కీలక ఉపన్యాసం తర్వాత గురువారం ఆమెతో కలిసి ఇయు పార్లమెంటులో మార్క్‌కార్నీ ప్రసంగించారు. యూరోపియన్ యూనియన్ భద్రతామండలి ఏర్పాటు చేయడం అనే ప్రతిపాదనను తోసిపుచ్చుతూ ఇది బహుశా శత్రువర్గాలు మారుతుందని, ఆమోదయోగ్యం కాదని కార్నీ అన్నారు.ఈ విధమైన ప్రతిపాదనలో ఎంతమాత్రం స్నేహభావం లేకపోతే భారీఎత్తున సుంకాలు విధిస్తాను డొనాల్డ్ ట్రంప్ హెచ్చరిక చేసిన నేపథ్యంలో కార్నీ ఇ.యు పార్లమెంటును ఉద్దేశించి పైవిధంగా స్పందించారు.అమెరికా–కెనడా మధ్య గతనెలలో వాణిజ్య సుంకాలపై జరిగిన చర్చలు విఫలమైన తర్వాత కార్నీ ఇ.యుకు సన్నిహితంగా వచ్చారు.కానీ ట్రంప్ మాత్రం యూరోపియన్ యూనియన్‌లో కెనడా మొదటి అసోసియేట్ సభ్యదేశం అనే మాటను నవ్వులాటగా అభివర్ణించారు.రష్యా నుండి యూరప్ ఖండానికి ఎదురవుతున్న ముప్పు నేపథ్యంలో రాబోయే సంవత్సరాలలో యునైటెడ్ కింగ్‌డమ్‌ను కూడా యూరోపియన్ యూనియన్‌లో చేర్చుకుంటామని,కెనడాను కూడా ఆహ్వానిస్తున్నామని ఉర్సులా వోండర్‌లేయన్ స్టేట్ ఆఫ్ ద యూనియన్ ప్రసంగంలో చెప్పారు. ప్రస్తుతం ఎదురవుతున్న అభద్రతా వాతావరణంలో ఒక యూరోపియన్ భద్రతామండలిని ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. అమెరికాలో 51వ రాష్ట్రంగా ఎందుకు? యూరోపియన్ యూనియన్‌లో 28వ సభ్యదేశంగా ఉండకూడదా? అని మార్క్ కార్నీని ఆమె కోరారు. ఆమె ప్రశ్నకు కార్నీ గురువారం ఇయు పార్లమెంటు ప్రసంగంలో సమాధానంగా ఆ ఆహ్వానాన్ని స్వాగతించారు.పాత్రికేయులతో మాట్లాడుతూ, ఇయుతో సన్నిహిత సంబంధాన్ని ఒక సానుకూల ప్రక్రియగా పేర్కొన్నారు. దీనివల్ల అమెరికా కాకుండా కెనడా మరింత సమర్థవంతమైన భాగస్వామిగా మారుతుందన్నారు. వివిధ కీలక రంగాలలో మరింత సన్నిహిత సంబంధాలుఏర్పాటు చేసుకోవడం ద్వారా కెనడాకు తలుపులు తెరిచేందుకు కృషి చేయాలని కోరుకుంటున్నట్లు ఆమె సభ్యదేశాల ప్రతినిధులకు తెలియజేశారు.ఈ సభ్యత్వ ప్రతిపాదన చేస్తున్నట్లు చెప్పారు.

## వామపక్షాల గెలుపు

(మొదటి పేజీ తరువాయి)

కూటమిల మధ్య 26,169 ఓట్లు తేడా మాత్రమే ఉంది. వామపక్ష కూటమిలో సోషల్ డెమొక్రాట్స్‌పార్టీకి చెందిన నాయకురాలు, ప్రతిపక్ష నేత మాగ్దలెనా ఆండర్సన్ నాటికినూరుశాతం ప్రధానమంత్రి పదవి బాధ్యతలు చేపట్టే అవకాశాలు ఉన్నాయి. 2021 నుండి స్వీడన్ సోషల్ డెమొక్రటిక్‌పార్టీ నాయకత్వ బాధ్యతల్లో ఉన్నారు.2014నుండి 2021 వరకు స్వీడన్ ఆర్థికమంత్రిగా, తర్వాత 2021–2022 వరకు ప్రధానమంత్రిగా ఆమె బాధ్యతలు నిర్వహించారు. సెప్టెంబరు 13న స్వీడన్‌లో ఎన్నికల ప్రక్రియ పూర్తికాగా, గురువారం 99.9 శాతం మేరకు కౌంటింగ్ పూర్తయ్యేసరికి మద్యేవాద వామపక్ష కూటమి ఆధిక్యంలో కొనసాగుతూ ఉండటంతో ఆ కూటమి విజయం ఖరారైంది. దీంతో ప్రస్తుత ప్రధానమంత్రి ఉల్ఫ్ క్రిస్టెర్‌సన్ తన పదవికి రాజీనామా చేశారు. స్వీడన్ పార్లమెంటు రిక్స్‌డగ్‌లో 349 స్థానాలు ఉన్నాయి.అండర్‌సన్ కూటమి 175 స్థానాలు గెలుచుకుని దిశగా దూసుకుపోతోంది. పార్లమెంటుతోపాటే రాష్ట్రాలలోనూ,స్థానిక సంస్థలకూ కూడా పోలింగ్ జరిగడంతో దేశంలో ఈ ఎన్నికలు ప్రతిష్ఠాత్మకంగా మారాయి. ప్రస్తుత ప్రధానమంత్రి, పచ్చిమితవాద కూటమి నాయకుడు క్రిస్టెర్‌సన్ ఫలితాలు రాక ముందునుండీ తానే మళ్ళీ ప్రధానమంత్రి పదవి చేపడతానని ప్రచారం చేసుకున్నారు. ఆయన ఆశలు అడియాశలయ్యాయి.

## దారుణహత్య

(మొదటి పేజీ తరువాయి)

నిజామాబాద్ ఐదో టాణా పరిధిలోని ఇంద్రాపూర్‌లో నివాసం ఉంటున్నాడు. రాజరాజేంద్ర చౌరస్తాలో మక్కబుట్టలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నారు. రోజులాగే గురువారం మక్కబుట్టలు అమ్ముకుంటున్న క్రమంలో.. దామా వేసి సిక్ష కోసం పక్కనే ఉన్న చాటీంటి వద్దకు వెళ్లాడు. అదే సమయంలో ఓ కారులో గుర్తుతెలియని వ్యక్తులు వచ్చి ఆయన తలపై పదునైన ఆయుధంతో విచక్షణారహితంగా దాడి చేశారు. తీవ్రగాయాలపాలైన హరిబాబు అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. కారులో ముగ్గురు వ్యక్తులు ఉండగా... ఓ వ్యక్తి వచ్చి పదునైన ఆయుధంతో తలపై నరికిన దృశ్యాలు సీసీ కెమెరాల్లో నమోదయ్యాయి. నిందితుడు 10 సెకన్లలో 9 సార్లు కత్తితో నరికిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి.

**వైష్ణవి హత్య కేసులో హరిబాబు నిందితుడు..**

జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం మాదాపూర్ గ్రామానికి చెందిన వైష్ణవి (19), కోరుట్ల పట్టణం ఏసుకొనిగుట్టకు చెందిన చిత్తరి హరిబాబు(26)కి వివాహం జరిగింది. నాలుగు నెలల గర్భిణిగా ఉన్న వైష్ణవి గొంతు నులిమి, చేతులు, నుదిటిపై కత్తితో పొడిచి హత్య చేసినట్లు హరిబాబుపై ఆరోపణలున్నాయి. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు హరిబాబును అరెస్టు చేశారు. ప్రస్తుతం బెయిల్‌పై జైలు నుంచి బయటికొచ్చిన నిందితుడు గురువారం దారుణహత్యకు గురయ్యాడు.

## షెడ్యూల్ విడుదల

(మొదటి పేజీ తరువాయి)

విద్యార్హత (డిగ్రీ) కలిగిన పట్టభద్రులందరూ ఓటరు నమోదుకు అర్హులుగా ఉంటారని అధికారులు స్పష్టం చేశారు. నిబంధనల మేరకు సెప్టెంబర్ 28న ఈ ఓటర్ల నమోదు ప్రక్రియకు అధికారిక పబ్లిక్ నోటీసు జారీ చేయనున్నారు. అభ్యర్థులు సవరించిన ఫారం18 దరఖాస్తులను సమర్పించడానికి నవంబర్ 6 వరకు తుది గడువు కేటాయించారు. అనంతరం అందిన దరఖాస్తులను పరిశీలించి నవంబర్ 25న ముసాయిదా (డ్రాఫ్ట్) ఓటర్ల జాబితాను ప్రకటిస్తారు. ముసాయిదా ఓటర్ల జాబితాపై నవంబర్ 25 నుండి డిసెంబర్ 10 వరకు అభ్యంతరాలు లేదా సవరణలకు అవకాశం ఇస్తారు. వీటిపై సమగ్ర విచారణ చేపట్టి డిసెంబర్ 25 నాటికి పరిష్కారాన్ని పూర్తి చేసి, డిసెంబర్ 30న ఆయా నియోజకవర్గాల తుది ఓటర్ల జాబితాను అధికారికంగా విడుదల చేయనున్నట్లు వివరించారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ నిబంధనల ప్రకారం పాత ఓటర్ల జాబితాను నూతనంగా మళ్లీ సేకరిస్తారు కాబట్టి, గతంలో ఓటర్లుగా నమోదైన వారు కూడా తప్పనిసరిగా కొత్తగా ఫారం 18 ద్వారానో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. అర్హత గల అభ్యర్థులు సిఈఓ తెలంగాణ అధికారిక వెబ్‌సైట్ (https://ceotelangana.nic.in) ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. లేదా తగిన సర్టిఫికేట్ల నకళ్లను జతచేసి సంబంధిత, ఈఆర్ఓ, ఎఈఆర్ఓ డిసిగ్నేటెడ్ అధికారులకు నేరుగా కానీ, పోస్ట్ ద్వారా కానీ అందజేయవచ్చు అన్నారు.

# నాలుగుశాతానికి పెరిగిన అమెరికా వడ్డీరేట్లు

● ట్రంప్‌ను ఉల్లంఘించి ఫెడ్ ఛైర్ ఏకగ్రీవ తీర్మానం ● ద్రవ్యోల్బణం సమస్యగా ఉండిపోయింది:వార్ష్



**వాషింగ్టన్:**గడచిన మూడేళ్ళలో మొదటిసారి అమెరికాలో వడ్డీరేట్లు పెరిగాయి. అమెరికాలో శరవేగంగా పెరుగుతున్న ధరలకు కళ్ళెంవేసి వాటిని వేగాన్ని తగ్గించడం కోస ం ఈ వడ్డీరేట్లు పెంచారు. 3.5 –3.75 శాతంగా ఉన్న వడ్డీరేట్లను 3.75 నుండి 4. 00 శాతం మేరకు పెంచుతూ ఫెడరల్ రిజ ర్వు గురువారం ఏకగ్రీవ తీర్మానం చేసింది. అ ధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌కు ఈ పెరుగుదల శరాఘాతంగా మారింది. ఎందుకంటే ఆయన ఏరికోరి ఎంపిక చేసి పదవిలో కూర్చోబెట్టిన ఫెడరల్ రిజర్వు ఛైర్మన్ కెవిన్ వార్ష్ ఆయన మాట ధిక్కరించి వడ్డీరేట్లు పెంచారు. వడ్డీరే ట్లు తగ్గించాలని పిలుపు ఇచ్చిన డోనాల్డ్ ట్రంప్ తీవ్ర వ్య తిరేకత వ్యక్తం చేసినప్పటికీ, ఫెడరల్ రిజర్వు ఏకగ్రీవం గా నాలుగూశాతానికి వడ్డీరేట్లు పెంచింది. ''ద్రవ్యోల్బ ణం చాలా ఎక్కువగా ఉంది, అంతేకాదు, చాలాకాలంగా అదేస్థాయిలో కొనసాగుతోంది కూడా, ఇప్పుడు మేం తీసుకున్న నిర్ణయం ఎంతో వివేకవంతమైనది, చాలా ఆలోచించి జాగ్రత్తగా ఈ నిర్ణయం తీసుకున్నాం,ఈ విషయంలో బాధ్యతాయుతంగా ప్రవర్తించాం'' అని కెవిన్ వార్ష్ చెప్పారు.ఈ వడ్డీరేట్ల పెరుగుదల వద్ద పొదుపుచేసే వారికి మేలు జరిగినప్పటికీ, అప్పుడు తీసుకోవాలనుకునేవారికి, కొత్తగా క్రెడిట్ కార్డులు తీసుకోవాలనుకునేవారికి,ఇంటి తనఖాలు పెట్టాలనుకునేవారికి పెనుభారంగా మారిపోతాయి.తాము ఆశావాదంతో ఉన్నప్పటికీ దేశంలో ద్రవ్యోల్బణం ఒక సమస్యగా మిగిలిపోయిందని అన్నారు. ద్రవ్యోల్బణాన్ని రెండూశాతం,అంతకంటే తక్కువ స్థాయికి తీసుకురావాలని ఫెడరల్ రిజర్వు ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ, ఐదేళ్ళుపైగా దేశంలో ద్రవ్యోల్బణం హెచ్చుస్థాయిలోనే కొనసాగుతోంది.ఏడు నెలలుగా ట్రంప్ చేస్తున్న యుద్ధం పుణ్యమాఅని ఈ పరిస్థితి తీవ్రరూపం దాల్చింది. చమురు ధరలు గడచిన రెండు రోజులుగా చరిత్రాత్మకమైన పెరుగుదల సాధించాయి. నవంబరులో ద్వైవార్షిక ఎన్నికల నేపథ్యంలో ట్రంప్ ఈ వడ్డీరేట్ల విషయంలో వ్యతిరేకంగా ఉన్నారు. గతంలో వడ్డీరేట్లు తగ్గించలేదని ఫెడరల్ రిజర్వు ఛైర్మన్ జెరోమ్ పావెల్‌ను డోనాల్డ్ ట్రంప్ తీవ్రంగా విమర్శించారు. ఆ తర్వాత వచ్చిన వార్ష్ బాధ్యతలు తీసుకున్న తర్వాత ఆయన ట్రంప్ చేతిలో కీలుబొమ్మగా మారిపోతారని అంచనావేశారు. కానీ వార్ష్ వడ్డీరేట్లు పెంచారు. అమెరికన్లకు చమురు ధరలు, జీవన వ్యయాలు రోజు రోజుకూ సమస్యగా మారుతున్నాయి. యని వార్ష్ చెప్పారు.

## ట్రంప్ సుంకాలు

(మొదటి పేజీ తరువాయి)

వేశారు. మొత్తం 16 మంది వ్యతిరేకంగా స్పందించారు.57 మంది ప్రతిపక్ష డెమోక్రాట్లు మద్దతు ఇవ్వడంవల్లనే ఈ బిల్లు చాలా సులభంగా దిగువసభలో ఆమోదం పొందింది. ప్రపంచ ప్రామాణిక బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర 100 డాలర్లు దాటిపోయిన దశలో ఈ పరిణామం సంభవించింది.

రష్యా ఇంధన పరిశ్రమలను,షాడో ఫ్లీట్ ట్యాంకర్స్(రహస్యంగా వేరే ముసుగులో చమురు వాణిజ్య రవాణా)ను లక్ష్యంగా చేసుకుని ప్రధానంగా ఈ ఆంక్షల బిల్లును ఆమోదించారు. ''లిండ్సే ఓ గ్రాహం శాంక్షనింగ్ రష్యా అండ్ ఇరాన్ యాక్ట్ ఆఫ్ 2026'' అనే పేరుతో ఈ బిల్లును కాంగ్రెస్‌లో ప్రవేశపెట్టారు. భారత్,చైనా దేశాలతోపాటు అజర్‌బైజాన్,స్లోవేకియా,హంగేరీ దేశాలను కూడా ట్రంప్ లక్ష్యంగా చేసుకుని భారీగా సుంకాలు విధించేందుకు సిద్ధపడతారు.ఇప్పటికే ఈ బిల్లు అమెరికా సెనేట్‌లో ఆగస్టు ఏడో తేదీన 86–11 ఓట్లతో ఆమోదం పొందింది. దిగువసభ ప్రతినిధులసభలో గడచిన సోమవారం నాడే ఈ బిల్లు ఆమోదం పొందాల్సి ఉండగా, ట్రంప్‌కు నూరుశాతం సుంకాలు విధించడంపై అధికారాలు కట్టేబెట్టే విషయంలో అధికార–ప్రతిపక్షాల మధ్య విభేదాలు నెలకున్నాయి. ఈ ప్రధానమైన చిక్కును పరిష్కరించి బిల్లును ఆలస్యంగా ఆమోదించారు.యూరప్ దేశాలు కూడా రష్యా నుండి చమురు కొనుగోళ్ళు చేస్తున్నాయి. కానీ క్రమంగా ఈ దిగుమతులను యూరప్ దేశాలు తగ్గించుకుంటున్నాయి. ఈ విషయంలో మరో ఏడాది గడువుగా నిర్ణయించుకున్నాయి. ఈ దృష్ట్యా అమెరికా నుండి యూరప్ దేశాలకు దిగుమతులపై మినహాయింపులు లభించే అవకాశాలున్నాయి.

కానీ ఇది ఆచరణలో ఎంతమేరకు ఆమోదయోగ్యంగా ఉంటుందీ?ఎంతమేరకు ట్రంప్ ఆశయాలను నెరవేరుస్తుందీ? అనే విషయాలు రాబోయేకాలంలోనే క్రియాత్మక ఫలితాలే తేల్చిచెబుతాయి. ఉక్రేన్‌పై నాలుగు సంవత్సరాలుగా యుద్ధం చేస్తున్న రష్యాను లొంగదీసి ఆ దేశాన్ని స్వయంగా చర్చల బల్లవద్దకు లాక్కొచ్చేందుకు మరింత ఒత్తిడి తీసుకువచ్చేందుకు తృతీయపక్షాలను దెబ్బకొట్టాలని,భారత్–చైనా నుండి రష్యాకు వచ్చే ప్రధాన చమురు ఆదాయాన్ని అడ్డుకోవాలని ట్రంప్ ప్రణాళిక వేశారు.

**రష్యా, భారత్, చైనాలకు ట్రంప్ షాక్**

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఆంక్షల బిల్లును దిగువసభలో ఆమోదింపజేసుకోవడం ద్వారా బ్రిక్స్ 18వ సదస్సులో అట్టహాసంగా పాల్గొని గొప్ప విజయాన్ని సాధించిన జోష్‌లో ఉన్న రష్యా,భారత్,చైనా దేశాలకు పెద్ద షాక్ ఇచ్చారు.జి–7 కూటమి బ్రిక్స్ కంటే గొప్పదేమీ కాదని, ప్రపంచ వాణిజ్యంలో,జిడిపిలో బ్రిక్స్ దేశాల వాటా చాలా అత్యధికమని, దేశాల సభ్యత్వసంఖ్యాపరంగా చూసినా బ్రిక్స్ ప్రపంచంలోనే అతిపెద్ద అగ్రశ్రేణి కూటమి అనీ రష్యా అధ్యక్షుడు వ్లాదిమీర్ పుతిన్ న్యూఢిల్లీలో బ్రిక్స్ దేశాల సదస్సు ప్రారంభానికి ముందుగా వ్యాఖ్యానించారు. ఈ మూడు దేశాల నాయకులూ ఈ సమావేశాలలో పాల్గొనడం, ఎలాంటి విభేదాలు లేకుండా పశ్చిమాసియాలో యుద్ధంపై అమెరికా పేరు ప్రస్తావించకుండానే ఘాటు తీర్మానం ఇరాన్ సమక్షంలోనే చేయడం వంటి పరిణామాలు ట్రంప్‌కు ఆగ్రహం రప్పించేవే. ఆనాడు సదస్సు సమయంలో ట్రంప్ ఐర్లాండ్ పర్యటనకు వెళ్ళి తనను తాను బిజీగా ఉంచుకున్నారు. ఉక్రేన్‌లో యుద్ధం ముగించేందుకు సరికొత్త చర్చలకు తాము సిద్ధంగా ఉన్నామని మూడు రోజులక్రితం రష్యా నాయకులు లోవరోవ్ ప్రకటించారు. ఉక్రేన్–రష్యాల మధ్య ఇంధన వనరులపై ఎలాంటి దాడులు జరగకుండా ఒక అంగీకారం కుదిరిందని ట్రంప్ కూడా ప్రకటించారు. కానీ తర్వాత జెలెన్‌స్కీ దానిని తోసిపుచ్చారు. ఈ పరిస్థితుల్లో రష్యాను ఆర్థికంగా దెబ్బతీసేందుకు దానిపై చమురు,సహజవాయువుపై ఆధారపడిన భారత్,చైనాలను ఈ బిల్లు ద్వారా దెబ్బతీసేందుకు ట్రంప్ వ్యూహం పన్నారు.

## 22న మహాధర్నా

(మొదటి పేజీ తరువాయి)

మధ్యాహ్నం 2.30 గంటలకు హైదరాబాద్ బస్ భవన్ నుంచి లేబర్ కమిషనర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి, అక్కడ పెద్ద ఎత్తున మహాధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా డిపో, గ్యారేజీ, రీజినల్, జోనల్, రాష్ట్ర కమిటీల ప్రతినిధులతో పాటు ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఎన్నికలు త్వరగా నిర్వహించి, అనంతరం విలీన ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు.

## హైదరాబాద్ విలీనం

(మొదటి పేజీ తరువాయి)

జాతీయ సమైక్యత మరింత బలోపేతం అవుతుందన్నారు. అనంతరం కేంద్రమంత్రి జి. కిషన్ రెడ్డి మాట్లాడుతూ అసెంబ్లీ సాక్షిగా నిజాం పాలనను కీర్తిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు చేశారని మండిపడ్డారు. నిజాం అంత మంచొడైతే వందేమాతరం రాంచందర్ రావు, భాగ్యరెడ్డి వర్మ, బండి యాదగిరి, కోదాటి నారాయణ రావు, రాంజీగోండు, సువరం ప్రతాప్ రెడ్డి, మాడపాటి హనుమంతరావు, బూర్గుల రామకృష్ణారావు, రావి నారాయణ రెడ్డి, చాకలి ఐలమ్మ, దొడ్డి కొమురయ్య, మల్లు స్వరాజ్యం, ఆరుట్ల రాంచంద్రారెడ్డి, కుమురం భీం, బోమ్మగాని ధర్మభిక్షం, సుద్దాల హనుమంతు, నారాయణరావు పవార్ వంటి యోధులు ఎందుకు పోరాటం చేశారో రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలన్నారు. రజాకార్ల కిరాతకాల నుంచి రక్షణ పొందేందుకు గ్రామాల్లో ప్రజలు బురుజులు ఎందుకు నిర్మించుకున్నారని ప్రశ్నించారు. స్వతంత్ర భారత సైన్యం నిజాంపై ఎందుకు యుద్ధం చేయాల్సి వచ్చిందన్నారు. కాంగ్రెస్, బిఆర్‌ఎస్ పార్టీలు ఓటు బ్యాంకు రాజకీయం కోసం మజ్లిస్ పార్టీకి భయపడి నిజాం అరాచకాలను కప్పిపుచ్చే ప్రయత్నం చేస్తున్నాయని విమర్శించారు. కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ రజాకార్ల సంస్థ 1940లో ఏర్పడి హిందువులపై, దేవాలయాలపై దాడులు చేసిందని, తెలుగు భాషను నిషేధించి ఉర్దూను రుద్దారని తెలిపారు. ముఖ్యమంత్రి నిజాంను పొగడటం సిగ్గుచేటని వ్యాఖ్యానించారు. మజ్లిస్ పార్టీ నేటికీ నిజాం వారసత్వ రాజకీయాలనే కొనసాగిస్తోందని విమర్శించారు. మజ్లిస్ ఒత్తిళ్లకు తలొగ్గి పాలకులు 80 ఏళ్లుగా తెలంగాణ విమోచన చరిత్రను తొక్కిపెట్టారని ఆరోపించారు. భావితరాలకు నిజమైన చరిత్రను తెలియజెప్పేందుకే ప్రధాని నరేంద్ర మోదీ ఐదేళ్లుగా అధికారికంగా ఈ వేడుకలను నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించే పాటలు, సాంస్కృతిక నృత్య రూపకాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

## ఎలా ఎదిగారు?

(మొదటి పేజీ తరువాయి)

సమర్పించిన ఎన్నికల అఫిడవిట్‌ల ఆధారంగానే కల్వకుంట్ల కుటుంబం బండారం బయటపడిందని, వారు అడ్డంగా దొరికిపోయారని మంత్రి విమర్శించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి.రామారావును ట్యాగ్ చేస్తూ ఆయన సంచలన ఆరోపణలు చేశారు. 2004 కరీంనగర్ లోక్‌సభ ఎన్నికల సమయంలో కెసిఆర్ సమర్పించిన అఫిడవిట్‌లో తనకు ఒక్క ఎకరం భూమి కూడా లేదని స్పష్టంగా పేర్కొన్నారని మంత్రి తెలిపారు. అప్పట్లో సున్నా ఎకరాలు ఉన్న కెసిఆర్‌కు, తెలంగాణ ఉద్యమ కాలంలో, ఆ తర్వాత పదేళ్ల బిఆర్‌ఎస్ పాలనలో వేల కోట్ల రూపాయల విలువైన భూములు ఎలా వచ్చాయని ఆయన ప్రశ్నించారు. స్వయంగా కెసిఆర్ ఎన్నికల సంఘానికి సమర్పించిన అఫిడవిట్‌లను పరిశీలిస్తే ఆయన ఆస్తులు ఏ స్థాయిలో భారీగా పెరిగాయో ఇట్టే అర్థమవుతుందని, సున్నా నుంచి వేల కోట్లకు ఎదిగిన భూ బకాసురుడు కెసిఆర్ అని పొంగులేటి తీవ్ర విమర్శలు చేశారు. బిఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో నిజమైన తెలంగాణ ఉద్యమకారులకు అప్పులు మాత్రమే మిగిలాయని, కానీ కెసిఆర్ కుటుంబానికి మాత్రం లక్షల కోట్ల ఆస్తులు వచ్చి చేరాయని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ భూములతో పాటు నిరుపేదలు, దళితులకు చెందిన అసైన్డ్ భూములను దోచుకోవడం ద్వారానే ఈ అక్రమ ఆస్తులు కూడబెట్టారని ఆయన ఆరోపించారు. ఉద్యమకారుల త్యాగాల పునాదుల మీదే కల్వకుంట్ల కుటుంబం అక్రమంగా లక్షల కోట్లు సంపాదించుకుందని మండిపడ్డారు. పుట్టుకతోనే కెసిఆర్‌కు వందల ఎకరాల భూములు ఉన్నాయంటూ కెటిఆర్ ఇటీవల చేసిన వ్యాఖ్యలకు మంత్రి పొంగులేటి తన ఎక్స్ ఖాతాలో కౌంటర్ ఇచ్చారు. 'పుట్టుకతోనే వందల ఎకరాలు ఉన్నాయని బొంకుతున్న డ్రామారావు.. ఈ విషయమై అప్పట్లో ఎన్నికల అఫిడవిట్‌లో తప్పులు రాసి మోసం చేశారా? లేక ఇప్పుడు ప్రజలకు అబద్ధాలు చెబుతున్నారా?' అని కెటిఆర్‌ను నిలదీశారు.

## విచారణకు సిద్ధమా?

(మొదటి పేజీ తరువాయి)

విసిరారు. 'సెప్టెంబర్ 17' జాతీయ సమైక్యతా దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్ లోని తెలంగాణ భవన్‌లో కెటిఆర్ గురువారం జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ కెసిఆర్ తన ఎన్నికల అఫిడవిట్‌లోనే భూముల వివరాలను వెల్లడించారన్నారు. కెసిఆర్ 1954లో పుట్టినప్పుడే చింతమడకలో రెండెకరాల విస్తీర్ణంలో ఇల్లు ఉందని, ఆ కుటుంబానికి వందల ఎకరాల భూమి ఉండేదని, అంతకు ముందు నిజాం కాలంలో అప్పర్ మానేరు ప్రాజెక్టు ముంపు కింద భూములు పోతే వచ్చిన పరిహారంతోనే ఆ భూమి కొనుగోలు చేశారని వివరించారు. పుట్టుకతోనే వందల ఎకరాల ఆస్తి ఉన్న కుటుంబంలో జన్మించిన కెసిఆర్ తన 72 ఏళ్ల వయస్సులో 67 ఎకరాల్లో వ్యవసాయం చేసుకుంటుంటే, ఆస్తులు పెరిగినట్టా, తరిగినట్టా ? అని ప్రశ్నించారు. కూకట్‌పల్లికి చెందిన కొండల్ రావుకు చెందిన ఆస్తులన్నింటినీ కేసీఆర్ ఖాతాలో వేస్తూ, అబద్ధాలను ప్రచారం చేస్తున్నారన్నారు. తాను అమెరికాలో ఎంబిఏ చదివి, అక్కడే ఆరున్నరేళ్లు పాటు ఉద్యోగం చేశానని, కష్టపడి సంపాదించానని కెటిఆర్ వివరించారు. కానీ రేవంత్ రెడ్డి మాత్రం వనపర్తిలో గోడలపైన రాతలు రాసే స్థాయి నుంచి జూబ్లీహిల్స్‌లో ప్యాలెస్‌ను నిర్మించుకునే స్థాయికి, వేల కోట్ల రూపాయలు ఎలా సంపాదించారని, ఆ ట్రిక్కును నిరుద్యోగ యువతకు చెప్పాలని డిమాండ్ చేశారు. శాసనసభ సమావేశాలను నెల రోజుల పాటు పొడిగించి, బిఆర్ఎస్ ఎమ్మెల్యేలపైన విధించిన అక్రమ సస్పెన్షన్లను ఎత్తివేస్తే, సిఎం కళ్లల్లో కళ్లు పెట్టి చూడటం కాదని, 420 హామీల మోసంపై నిలదీస్తామన్నారు.కెసిఆర్‌కు వెయ్యి ఎకరాల ఫామ్ హౌస్ ఉన్నదని గతంలో ఆరోపించిన రేవంత్ రెడ్డి, ఇటీవల అసెంబ్లీలో జరిగిన చర్చలో మాత్రం 67 ఎకరాలని స్వయంగా అంగీకరించారని, ఇందుకు కెసిఆర్‌కు సిఎం క్షమాపణచెప్పాలన్నారు. సిరిసిల్లలో కమ్యూనిస్టుల కాలంలో సిహెచ్ రాజేశ్వర రావు తదితర నాయకులు ఆ చెరువు ఎండిపోతే అందులోనే పేదలకు, కార్మికులకు 60,70 గజాల చొప్పున ప్లాట్లు చేసి, పట్టాలు పంపిణీ చేశారని కెటిఆర్ గుర్తుచేశారు. బిఆర్ఎస్ ప్రభుత్వంలో ఆ స్థలాలకు జీవో 58, 59 ప్రకారం క్రమబద్ధీకరించామని, దీనిని కూడా సిఎం కబ్జా అని మాట్లాడుతున్నారన్నారు.

**ఒక్క గజం కొన్నట్టు నిరూపించినా ఏ శిక్షకైనా సిద్ధమే..**

ధరణి వచ్చిన తర్వాత టెస్కాబ్ మాజీ అధ్యక్షుడు కొండూరు రవీందర్ రావు ఒక్క గజం కొన్నట్టుగా నిరూపించినా తాను ఏ శిక్షకైనా సిద్ధమని కెటిఆర్ వెల్లడించారు. సిరిసిల్లాకు వస్తానని చెబుతున్న సిఎం రేవంత్ రెడ్డి సిరిసిల్లలో 8వేల ఎకరాలు ఎక్కడ ఉన్నాయో, ఏ సర్వే నంబర్‌లో ఎవరు కబ్జా చేశారో సమగ్ర వివరాలతో ఒక అధికారిక శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మాజీ మంత్రులు హరీష్ రావు, జగదీష్ రెడ్డి, గంగుల కమలాకర్, ఎర్రబెల్లి దయాకర్ రావు, ఎమ్మెల్సీ నవీన్ రావు, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్ రెడ్డి, సుధీర్ రెడ్డి తమ ఎన్నికల అఫిడవిట్లలో చట్టబద్ధంగా చూపించిన ఆస్తులపైన సిఎం అసత్య ఆరోపణలు చేశారన్నారు.

## తెలంగాణ పుట్టినిల్లు

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్‌లోని పబ్లిక్ గార్డెన్‌లో గురువారం ప్రజాపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన త్రివర్ణ పతాకాన్ని సిఎం ఎగురవేశారు. అనంతరం ఆయన ప్రసంగిస్తూ, రజాకార్ల ఆగడాలకు వ్యతిరేకంగా, భూమి, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం కమ్యూనిస్టుల ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ పోరాటం ఉద్ధృతమైందని, ఆ ఉద్యమ, హైదరాబాద్ ప్రజల ఆకాంక్షల నేపథ్యంలోనే ఆనాటి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ, ఉప ప్రధానమంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ నాయకత్వంలో ఆపరేషన్ పోలో సైనిక చర్యను చేపట్టారని, ఈ ఆపరేషన్ అనంతరం ఏడో నిజాం భారత ప్రభుత్వానికి లొంగిపోయారని గుర్తు చేశారు. రావి నారాయణరెడ్డి, భీంరెడ్డి నరసింహారెడ్డి, అనభేరి ప్రభాకర్‌రావు, చాకలి ఐలమ్మ, ఆరుట్ల కమలాదేవి, మల్లు స్వరాజ్యం వంటి ఎందరో యోధులు ఈ పోరాటాలకు నాయకత్వం వహించారన్నారు. సుదీర్ఘ పోరాట చరిత్రలో 'సెప్టెంబర్ 17'కు ప్రత్యేకమైన స్థానం ఉందన్నారు. 'సెప్టెంబర్ 17' గతాన్ని మాత్రమే గుర్తు చేసే రోజు కాదని, బాధ్యతలను కూడా గుర్తు చేసే రోజుగా సిఎం అభివర్ణించారు.

**నిజాం పాలనలో అణచివేత..**

నిజాం పాలనలో హైదరాబాద్ పారిశ్రామిక, వ్యవసాయ, విద్యా, వైద్య రంగాల్లో పురోగతి సాధించిందని, నిజాం పాలనలో హైదరాబాద్ ప్రపంచ స్థాయి గుర్తింపును అందుకుందని, అదే సమయంలో గ్రామీణ తెలంగాణలో భూస్వామ్య దోపిడీ,వెట్టిచాకిరి,అణచివేత తీవ్రంగా ఉండేదని



సిఎం రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. చివరి దశలో రజాకార్ల దౌర్జన్యాలు ప్రజలను కల్లోలపరిచాయని,తద్వారా హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో అంతర్భాగం కావాలన్న ఆకాంక్ష ప్రజల్లో బలపడిందన్నారు. పాలనలో ప్రజలే కేంద్రంగా ఉండాలని, ప్రజల ఆశలు, ఆకాంక్షలే ప్రభుత్వ నిర్ణయాలకు ప్రామాణికం కావాలనే విషయాన్ని హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనమయ్యే వరకు జరిగిన ఉద్యమాలు, త్యాగాలు, బలిదానాల చరిత్ర ఒక స్పష్టమైన సందేశమిస్తోందన్నారు. ఆ స్ఫూర్తితో ప్రజల ఆత్మగౌరవానికి పట్టం కడుతూ ప్రజా పాలన కొనసాగిస్తున్నామన్నారు. తెలంగాణ రాష్ట్రం ప్రస్తుతం పొరుగు రాష్ట్రాలతో మాత్రమే కాదని, ప్రపంచంతో పోటీ పడుతోందన్నారు. రాష్ట్ర తలసరి ఆదాయం రూ.4,18,931కు చేరిందని, ఇది దేశ తలసరి ఆదాయం కంటే దాదాపు 91 శాతం అధికమని, అభివృద్ధి అంకెల్లో మాత్రమే కాకుండా ప్రజల జీవితాల్లో కనిపించాలన్నదే తమ లక్ష్యమన్నారు.

**కృష్ణా జలాల్లో వాటా కోసం న్యాయపోరాటం ..**

కృష్ణా జలాల్లో తెలంగాణకు దక్కాల్సిన వాటా కోసం న్యాయపోరాటం చేస్తున్నామని, పాలమూరు రంగారెడ్డి, సీతారామ ఎత్తిపోతలు, ఎస్ఎల్‌బిసితో పాటు ఇతర పెండింగ్ ప్రాజెక్టుల పనులను యుద్ధ ప్రాతిపదికన చేపడుతున్నామని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణలో ప్రతి ఆడబిడ్డ సగర్వంగా జీవించాలని, ఆర్థికంగా స్వతంత్రంగా ఎదగాలని ఆకాంక్షించారు.

**ఆహార కల్తీని సహించబోం:**

ప్రజల ఆరోగ్యంతో ఆడుకునే ఆహార కల్తీని ఎట్టి పరిస్థితుల్లో సహించబోమని సిఎం రేవంత్ రెడ్డి హెచ్చరించారు. అందుకే టిజి సేఫ్ ఏర్పాటు చేసి కఠినంగా వ్యవహరిస్తున్నామన్నారు. రాష్ట్రాన్ని మాదకద్రవ్యాల రహితంగా తీర్చిదిద్దేందుకు ఈగల్ వ్యవస్థను పటిష్ఠం చేశామని, యువత పెడదోవ పట్టకుండా ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. రూ.38,595 కోట్లతో 122.9 కిలోమీటర్ల మెట్రో రెండో దశ విస్తరణకు ప్రతిపాదనలు పంపించామన్నారు. ఆదిలాబాద్, మామునూరు విమానాశ్రయాలకు అనుమతులను సాధించామని, ఇందుకు సంబంధించి భూసేకరణ చేపట్టామన్నారు. రీజినల్ రింగ్ రోడ్డు, గ్రీన్‌ఫీల్డ్ హైవేలు, డ్రైపోర్టులు, హైదరాబాద్–నాగపూర్, హైదరాబాద్–బెంగళూరు, హైదరాబాద్–విజయవాడ పారిశ్రామిక కారిడార్లు తెలంగాణ ముఖచిత్రాన్ని మార్చనున్నాయన్నారు. గ్రామం నుంచి మండలానికి,మండలం నుంచి జిల్లాకు, జిల్లా నుంచి రాష్ట్ర రాజధానికి మెరుగైన రహదారి అనుసంధానం కల్పించేందుకు పనులు చేపట్టామన్నారు.

**డిసెంబర్‌లో ఫ్యూచర్ సిటీ మాస్టర్ ప్లాన్ ఆవిష్కరణ**

డిసెంబర్‌లో నిర్వహించే 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్–2026' సందర్భంగా ఫ్యూచర్ సిటీ మాస్టర్ ప్లాన్‌ను ఆవిష్కరించబోతున్నామని సిఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. తెలంగాణ రైజింగ్ విజన్ –2047 లక్ష్యాలను సాధించేందుకు ప్రజా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించిందని, 2047 నాటికి తెలంగాణను మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలన్నదే తమ సంకల్పమని, దేశ జీడీపీలో తెలంగాణ వాటాను 10 శాతానికి పెంచే దిశగా అడుగులు వేస్తున్నామన్నారు.

**'ఎల్‌నినో'ఎదుర్కొనేందుకు ప్రజల సహకారం అవసరం..**

ప్రస్తుత ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని సిఎం రేవంత్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. తాగునీరు, విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు రాకుండా ముందస్తు ప్రణాళికలతో పనిచేస్తున్నామని, ఈ పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రజలవైపు నుంచి కూడా సహకారం ఆశిస్తున్నామని, ప్రజల్లో అవగాహన కల్పించేందుకు మీడియా సహకారం కూడా ఉండాలని కోరారు. వీబీ జీ రామ్ జీలో ఎక్కువ పని దినాలు కల్పించేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు.

### అభిషేక్ వీర విహారం..

# అఫ్గాన్‌తో మూడో టీ20లో భారత్ ఘన విజయం

అఫ్గానిస్థాన్‌తో జరిగిన మూడో టీ20లో భారత్ 127 తేడాతో ఘన విజయం సాధించింది. దీంతో మూడు టీ20ల సిరీస్‌ను టీమ్‌ఇండియా క్లీన్‌స్వీప్ చేసింది. అభిషేక్ శర్మ 108 (34 బంతుల్లో), సంజు శాంసన్ 50 (35 బంతుల్లో) అదరగొట్టడంతో తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ 20 ఓవర్లలో 221/7 పరుగులు చేసింది. లక్ష్యఛేదనలో అఫ్గాన్ 14.1 ఓవర్లలో 94 పరుగులకే కుప్పకూలింది. ఇబ్రహీం జద్రాన్ (25) టాప్ స్కోరర్. అజ్మతుల్లా ఒమర్జాయ్ 17, రహ్మనుల్లా 15, నూర్ ఉల్ రెహ్మాన్ 11 పరుగులు చేశారు. భారత బౌలర్లలో నితీశ్ రెడ్డి ఒకే ఓవర్‌లో మూడు వికెట్లు పడగొట్టాడు. రవి బిష్ణోయ్ 3, అక్షర్ పటేల్ 2, బుమ్రా, యశ్ ఠాకూర్ ఒక్కో వికెట్ తీశారు.



అఫ్గాన్‌తో మూడో టీ20లో భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 221/7 పరుగులు చేసింది. అభిషేక్ శర్మ 108 (34 బంతుల్లో), సంజు శాంసన్ 50 (35 బంతుల్లో) అదరగొట్టారు. అయ్యర్ (29), శివమ్ దూబె (14), ఇషాన్ కిషన్ (10), అక్షర్ పటేల్ (5*), తిలక్ వర్మ (2), నితీశ్ రెడ్డి (1) పరుగులు చేశారు. అఫ్గాన్ బౌలర్లలో అజ్మతుల్లా ఒమర్జాయ్ 2 వికెట్లు, అబ్దుల్లా అహ్మద్జాయ్, రషీద్ ఖాన్ చెరో వికెట్ తీశారు.

అఫ్గానిసాన్‌తో జరుగుతున్న మూడో టీ20లో భారత ఓపెనర్ అభిషేక్ శర్మ ఆకాశమే హద్దుగా చెలరేగి ఆడాడు. 30 బంతుల్లోనే సెంచరీ చేశాడు. ఇందులో 96 పరుగులు .. 10 సిక్సులు, 9 ఫోర్ల రూపంలోనే రావడం గమనార్హం. మొత్తంగా అంతర్జాతీయ టీ20ల్లో ఇది మూడో ఫాస్టెస్ట్ సెంచరీ. తొలి రెండు స్థానాల్లో వరుసగా ఎస్టోనియాకు చెందిన సాహిల్ చౌహాన్ (27 బంతులు), టర్కీకి చెందిన ముహమ్మద్ ఫహాద్ (29 బంతులు) ఉన్నారు. భారత జట్టు పరంగా చూస్తే ఇది ఫాస్టెస్ట్ సెంచరీ. అంతకు ముందు 2017లో రోహిత్ శర్మ శ్రీలంకతో 35 బంతుల్లో సెంచరీ చేశాడు.

**పవర్ ప్లే రికార్డు కూడా...**

అదే విధంగా టీ20 పవర్ ప్లేలో అత్యధిక పరుగుల రికార్డును అభిషేక్ శర్మ సంజు శాంసన్ జోడీ బద్దలుకొట్టింది. తొలి ఆరు ఓవర్లలో 100 పరుగులు చేసింది. భారత టీ20 క్రికెట్‌లో ఇదే అత్యధికం. 2025లో ఇంగ్లాం చేసిన 95/1 ఇప్పటివరకు మన టాప్ పవర్ ప్లే స్కోర్.

### అజిత్ అగార్కర్ గుడ్‌బై

# టీమిండియా చీఫ్ సెలెక్టర్‌గా హైదరాబాద్ మాజీ క్రికెటర్!



టీమిండియా చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ పదవి కాలం సెప్టెంబర్‌తో ముగియనుంది. అతని కాంట్రాక్ట్ను 2027 వన్డే ప్రపంచకప్ వరకు పొడిగించే అవకాశం ఉన్నట్లు ప్రచారం జరిగింది. కానీ అగార్కర్ అందుకు నిరాకరించినట్లు తెలుస్తోంది. సొంతగడ్డపై వెస్టిండీస్‌తో జరిగే వన్డే, టీ20 సిరీస్‌లో బరిలోకి దిగే భారత జట్లను బిసిసిఐ బుధవారం ప్రకటించింది. చీఫ్ సెలెక్టర్‌గా అజిత్ అగార్కర్ ఇదే చివరి సమావేశమని జాతీయ మీడియాలో వార్తలు వస్తున్నాయి. టీమిండియా తదుపరి చీఫ్ సెలెక్టర్ రేసులో భారత మాజీ వికెట్ కీపర్ పార్థివ్ పటేల్‌తో పాటు హైదరాబాద్ ప్లేయర్, టీమిండియా మాజీ స్పిన్నర్ ప్రజ్ఞాన్ ఓజా ఉన్నట్లు ఎన్డీటీవీ తమ కథనంలో పేర్కొంది. ప్రజ్ఞాన్ ఓజా ఇప్పటికే సెలెక్షన్ కమిటీలో సభ్యుడిగా ఉన్నాడు.

**అగార్కర్ హయాంలో..**

అజిత్ అగార్కర్ 2023 జూలైలో టీమిండియా చీఫ్ సెలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టాడు. అతని హయాంలో భారత్ జట్టు పరిమిత ఓవర్ల క్రికెట్‌లో అద్భుతమైన విజయాలను అందుకుంది. కానీ టెస్ట్లో ఘోర పరాజయాలను మూటగట్టుకుంది. 2023 వన్డే ప్రపంచకప్ ఫైనల్ చేరిన భారత్.. 2024, 2026 టీ20 ప్రపంచకప్లో విజేతగా నిలిచింది. 2025లో ఐసిసి ఛాంపియన్స్ ట్రోఫీ గెలిచింది. ఆసియా కప్ టైటిల్‌ను కూడా అందుకుంది. కానీ టెస్ట్‌లో ఎన్నడూ లేని విధంగా సొంతగడ్డపై టెస్ట్ సిరీస్‌ల్లో క్లీన్ స్వీప్ అయ్యింది. సౌతాఫ్రికా, న్యూజిలాండ్ చేతుల్లో సిరీస్ కోల్పోవడంతో పాటు ఆస్ట్రేలియా గడ్డపై బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో ఓటమిపాలైంది. కానీ పరిమిత ఓవర్ల క్రికెట్‌లో టీమిండియా మెరుగైన విజయాలు సాధించడంతో ఈ ఏడాది జూన్‌లో ముగిసిన అగార్కర్ పదవి కాలాన్ని నాలుగు నెలల పాటు పొడిగించారు.

**కోహ్లి, రోహిత్ విషయంలో..**

అయితే భారత స్టార్ ఆటగాళ్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీలను వన్డే ప్రపంచ కప్ 2027 దాకా కొనసాగించే విషయంలో అగార్కర్, బిసిసిఐ పెద్దల మధ్య విభేదాలు తలెత్తినట్లు తెలుస్తోంది. రోహిత్ శర్మ, కోహ్లి ప్రపంచకప్ ఆడే విషయంపై స్పష్టత ఇవ్వలేమంటూ అగార్కర్ ఇప్పటికే ప్రకటించిన సంగతి తెలిసిందే. అదే సమయంలో రోహిత్, కోహ్లి మాత్రం తాము కచ్చితంగా వన్డే ప్రపంచకప్ ఆడుతామనే ధీమాతో ఉన్నారు. రోహిత్, కోహ్లీలు టెస్ట్ క్రికెట్కు వీడ్కోలు పలకడానికి కూడా అగార్కర్ వైఖరే కారణమని గతంలో వార్తలు వచ్చాయి. రోహిత్, కోహ్లి విషయంలో అగార్కర్, బిసిసిఐ మధ్య దూరం పెరిగిందని, అందుకే అగార్కర్ తన పదవి నుంచి తప్పుకున్నాడని ప్రచారం జరుగుతోంది.

## పోటీ కోసం జికె

(గ్రూప్స్‌కు సిద్ధమవుతున్న వారికోసం)

# ఆరావళి పర్వత శ్రేణి ప్రధానంగా ఏ ప్రాంతంలో విస్తరించి ఉంది?

- 2026లో 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశాన్ని ఏ దేశం నిర్వహించింది?
  భారత్. న్యూఢిల్లీలో సెప్టెంబర్ 12, 13 తేదీల్లో 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశం జరిగింది.
- 2026 బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశానికి భారత్ ప్రతిపాదించిన ప్రధాన ఇతివృత్తం ఏమిటి?
  'బిల్డింగ్ ఫర్ రెసిలియెన్స్, ఇన్నొవేషన్, కోఆపరేషన్ అండ్ సస్టెయినబిలిటీ'.
- 2026లో బ్రిక్స్‌లో పూర్తి సభ్యదేశాల సంఖ్య ఎంతకు చేరింది?
  11 దేశాలు.
- 2026 బ్రిక్స్ సమావేశం తర్వాత తదుపరి అధ్యక్ష బాధ్యతలను ఏ దేశం స్వీకరించింది?
  చైనా.
- 2026 బ్రిక్స్ న్యూఢిల్లీ ప్రకటనలో ఐక్యరాజ్య సమితికి సంబంధించి ప్రధానంగా ఏ అంశాన్ని ప్రస్తావించారు ?
  ఐక్యరాజ్యసమితి భద్రతామండలి సహా అంతర్జాతీయ సంస్థల్లో గ్లోబల్ సౌత్‌కు ప్రాతినిధ్యం కల్పించాల్సిన అవసరాన్ని ప్రస్తావించారు.
- 2026లో భూఆధార్ అనే పేరుతో ప్రారంభించిన వ్యవస్థకు అధికారిక సంక్షిప్త రూపం ఏమిటి?
  యుఎల్‌పిఐఎన్.
- యుఎల్‌పిఐఎన్ ప్రధాన ఉద్దేశం ఏమిటి?
  భూకమతాలకు ప్రత్యేక గుర్తింపును కల్పించి భూ రికార్డుల నిర్వహణను మెరుగుపరచడం.
- 2026లో భారత ప్రభుత్వం ప్రవేశపెట్టిన చట్టబద్ధ మెట్రాలజీకి సంబంధించిన కొత్త నియమాల పేరు ఏమిటి?
  లీగల్ మెట్రాలజీ ఇండియన్ స్టాండర్డ్ టైమ్ రూల్స్, 2026.
- భారత ప్రామాణిక కాలాన్ని సూచించడానికి ఉపయోగించే సమయ ప్రమాణానికి సంక్షిప్త రూపం ఏమిటి?
  ఐఎస్‌టి.
- 2026లో సుప్రీంకోర్టు న్యాయమూర్తుల మంజూరైన సంఖ్యను ఎంతకు పెంచే బిల్లును పార్లమెంట్ ఆమోదించింది?
  34 నుంచి 38కు.
- సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్య పెంపు ఏ అంశానికి సంబంధించినది?
  సుప్రీంకోర్టు న్యాయమూర్తుల మంజూరైన న్యాయమూర్తుల బలానికి సంబంధించినది.
- భారత రాజ్యాంగంలోని 142వ అధికరణం సుప్రీంకోర్టుకు ఏ అధికారం ఇస్తుంది?
  పూర్తి న్యాయం చేయడానికి అవసరమైన ఆదేశాలు, ఉత్తర్వులు జారీ చేసే ప్రత్యేక అధికారాన్ని ఇస్తుంది.
- 2026లో సోన్ నది జలాల భాగస్వామ్యానికి సంబంధించి ఏ రాష్ట్రాల మధ్య అవగాహన కుదిరింది?
  బిహార్, జార్ఖండ్ రాష్ట్రాల మధ్య.
- 2026లో ఆరావళి ప్రాంతానికి సంబంధించిన కమిటీ నివేదిక సమర్పణ గడువును సుప్రీంకోర్టు ఎప్పటివరకు పొడిగించింది?
  నవంబర్ 30, 2026 వరకు.



- ఆరావళి పర్వత శ్రేణి ప్రధానంగా ఏ ప్రాంతంలో విస్తరించి ఉంది?
  ఢిల్లీ, హర్యానా, రాజస్థాన్, గుజరాత్ ప్రాంతాల్లో.
- 2026లో వృద్ధులకు అనుకూలమైన కార్యాలయాల కోసం ఏ రాష్ట్రం ప్రత్యేక ధ్రువీకరణ కార్యక్రమాన్ని ప్రారంభించింది?
  కేరళం.
- 2026లో పార్లమెంట్ ఆమోదించిన జనన మరణాల నమోదు సవరణ బిల్లు దేనికి సంబంధించినది?
  జననాలు, మరణాల నమోదుకు సంబంధించిన చట్టపరమైన వ్యవస్థను సవరించడానికి.
- భారతదేశంలో జననమరణాల నమోదుకు ప్రాథమిక చట్టం ఏది?
  రిజిస్ట్రేషన్ ఆఫ్ బర్త్స్ అండ్ డెత్స్ యాక్ట్, 1969.
- 2026లో భారత్–బెల్జియం సంబంధాల్లో ప్రధానంగా ఏ రంగాలకు ప్రాధాన్యం పెరిగింది?
  వాణిజ్యం, సాంకేతికత, రక్షణ, పరిశ్రమ, వ్యూహాత్మక సహకారం.
- 2026లో భారత్–చైనా సంబంధాల్లో చర్చకు వచ్చిన ప్రధాన అంశాల్లో ఒకటి ఏమిటి?
  సరిహద్దు నిర్వహణ, సైనిక ఉద్రిక్తత తగ్గింపు.
- 2026–27 కేంద్ర బడ్జెట్‌ను ఎవరు ప్రవేశపెట్టారు?
  నిర్మలా సీతారామన్.
- 2026–27 కేంద్ర బడ్జెట్‌ను ఏ తేదీన ప్రవేశపెట్టారు?
  ఫిబ్రవరి 1, 2026.
- 2026–27 బడ్జెట్‌లో మూలధన వ్యయం సుమారుగా ఎంతగా నిర్ణయించారు?
  రూ.12.2 లక్షల కోట్లు.
- 2026–27 బడ్జెట్‌లో ఆర్థిక లోటు జిడిపిలో ఎంతగా అంచనా వేశారు?
  4.3 శాతం.
- 2026లో ఆర్‌బిఐ పాలసీ రెపో రేటు ఎంతగా నమోదైంది?
  5.25 శాతం.
- 2026 సెప్టెంబర్ నాటికి ఆర్‌బిఐ నగదు నిల్వల నిష్పత్తి ఎంతగా ఉంది?
  3 శాతం.
- 2026లో ఆర్‌బిఐ ప్రధానంగా ఏ అంశంపై దృష్టి పెట్టింది?
  ద్రవ్యోల్బణం, ద్రవ్యస్థిరత్వం, ఆర్థిక వృద్ధి, బ్యాంకింగ్ వ్యవస్థలో ద్రవ్య లభ్యత నిర్వహణపై.
- 2026లో భారత ఆర్థిక వ్యవస్థకు సంబంధించి ప్రధాన చర్చాంశాల్లో ఒకటి ఏమిటి?
  అధిక వృద్ధి కొనసాగింపుతో పాటు యువత ఉపాధి సృష్టి.
- 2026లో సెమికాన్ 2.0 ఫ్రేమ్‌వర్క్ ఏ రంగానికి సంబంధించినది?
  సెమీకండక్టర్ తయారీ, డిజైన్, సరఫరా గొలుసు అభివృద్ధికి సంబంధించినది.
- సెమీకండక్టర్ పరిశ్రమకు వ్యూహాత్మక ప్రాధాన్యం ఎందుకు ఉంది?
  ఎలక్ట్రానిక్స్, రక్షణ, టెలికమ్యూనికేషన్స్, కృత్రిమ మేధస్సు, ఆటోమొబైల్ రంగాలకు చిప్‌లు కీలకం.



## జనవరి 13న చిరంజీవి 'కాకా' విడుదల

మెగాస్టార్ చిరంజీవి, దర్శకుడు బాబీ కొల్లి 'వాల్తేరు వీరయ్య' సక్సెస్ తర్వాత ప్రతిష్టాత్మక చిత్రం 'కాకా'తో రాబోతున్నారు. కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై వెంకట్ కే నారాయణ నిర్మిస్తున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలను నెలకొల్పుతోంది. భారీ స్థాయిలో హైఇంటెన్సిటీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిస్తున్నారు. ఇప్పటికే విడుదల చేసిన టైటిల్ గ్లింప్స్‌లో మెగాస్టార్‌ను రెండు డిఫరెంట్ షేడ్స్‌లో చూపించడంతో సినిమాపై మాస్‌లో భారీ క్రేజ్ ఏర్పడింది. హీరోయిన్ అనశ్వర రాజన్ ఈ సినిమాలో మెడికల్ స్టూడెంట్‌గా నటిస్తోంది. చిరంజీవి 'సత్యం' పాత్రలో కనిపించబోతున్నారు. ప్రస్తుతం ఈ సినిమా శరవేగంగా షూటింగ్ జరుపుకుంటుండగా, పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా ఏకకాలంలో జరుగుతున్నాయి.ఈ సినిమాకు ఎస్. థమన్ సంగీతం అందిస్తుండగా, విజయ్ కార్తీక్ కన్నన్ సినిమాటోగ్రఫీ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అవినాష్ కొల్లా ప్రొడక్షన్ డిజైన్ చేస్తున్నారు. ఆంటోనీ ఎల్ రూబెన్ ఎడిటర్‌గా పనిచేస్తున్నారు. కోన వెంకట్, కే చక్రవర్తి రెడ్డి స్క్రీన్‌ప్లే అందించగా, హరి మోహన కృష్ణ, వినీత్ పొట్లూరి రైటర్స్ గా చేస్తున్నారు. భానునందు డైలాగ్స్ రాస్తున్నారు.'కాకా' 2027 జనవరి 13న సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల కానుంది.

# 'ది ప్యారడైజ్' సెన్సార్ పూర్తి



నాని పాన్ ఇండియా పీరియడ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'ది ప్యారడైజ్'. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో, ఎస్ఎల్‌వీ సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో నిర్మించారు. ఇప్పటికే విడుదలైన సాంగ్స్, గ్లింప్స్, టీజర్ అద్భుతమైన రెస్పాన్స్‌తో సినిమాపై భారీ అంచనాలను పెంచాయి.తాజాగా మేకర్స్ నాని, కయాదు లోహార్‌ను ఇంటెన్స్ రొమాంటిక్ అవతార్లో ప్రజెంట్ చేస్తూ సరికొత్త పోస్టర్‌ను విడుదల చేశారు.పోసర్‌లో నాని రఫ్ అండ్ రస్టిక్ లుక్‌లో కనిపిస్తుండగా, కయదు లోహార్ కూడా ఇంటెన్స్ అవతార్‌లో కనిపించారు. ఇద్దరూ ఎదురెదురుగా నిలబడి.. సిగరెట్స్ ను లైటర్‌తో వెలిగించుకుంటున్న విజువల్ ప్రత్యేకంగా ఆకట్టుకుంటోంది. చుట్టూ ఉన్న డార్క్, ఇంటెన్స్ వాతావరణం మధ్య ఈ సన్నివేశం వారి మధ్య ఉన్న బాండింగ్‌ను డిఫరెంట్‌గా ప్రజెంట్ చేస్తోంది. ఈ పోస్టర్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఇందులో హీరో, హీరోయిన్ మధ్య వచ్చే సన్నివేశాలు హైలైట్‌గా ఉండబోతున్నాయి. జడల్ సుబ్బు..ప్రేమ ఇంతకుముందెన్నడూ చూడనంత ప్రత్యేకంగా ఉండబోతుంది.'ది ప్యారడైజ్' సెన్సార్ ఫార్మాలిటీస్ అన్నీ పూర్తి చేసుకుంది. 'ది ప్యారడైజ్' సెప్టెంబర్ 24న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానుంది.

## రీల్

# 'భారతరత్న ఎంఎస్ సుబ్బులక్ష్మి 'షురూ

అమృత గాత్రంతో ప్రపంచవ్యాప్తంగా శ్రోతలను దశాబ్దాల పాటు ఉర్రూతలూగించిన సంగీత సామ్రాజ్ఞి, గాయని భారతరత్న ఎంఎస్ సుబ్బులక్ష్మి జీవిత చరిత్రను సినిమాగా రూపొందించే భారీ ప్రయత్నం చేయబోతున్నారు. ప్రొడ్యూసర్స్ అల్లు అరవింద్, రాక్ లైన్ వెంకటేష్, బన్నీ వాస్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఎంఎస్ సుబ్బులక్ష్మి గా రశ్మిక మందన్న నటిస్తున్నారు. టాలెంటెడ్ డైరెక్టర్ గౌతమ్ తిన్ననూరి ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. అనిరుధ్ రవిచంద్రన్ సంగీతాన్ని అందిస్తున్నారు. ఎంఎస్ సుబ్బులక్ష్మి 110వ జయంతి సందర్భంగా లెజెండరీ యాక్టర్ కమల్ హాసన్ చేతుల మీదుగా లాంఛ్ చేశారు. రశ్మిక మందన్నపై చిత్రీకరించిన తొలి సన్నివేశానికి కమల్ హాసన్ క్లాప్ ఇచ్చారు. చెన్నైలోని మ్యూజిక్ అకాడెమీ వేదికగా జరిగిన ఈ కార్యక్రమంలో ఈ సినిమా షూటింగ్ ప్రారంభించారు. అనంతరం నిర్మాతల్లో ఒకరైన అల్లు అరవింద్ మాట్లాడుతూ ఎంఎస్ అమ్మ గొప్ప సంగీతకారిణిగా మనందరికీ తెలుసు. కానీ ఆమె తన జీవితంలో ఎదుర్కొన్న ఘటనల గురించి తెలిశాక ఈ బయోపిక్ తీయాలని మరింతగా ఇన్స్ పైర్ అయ్యాం. ఆమె పాటించిన నిబంధనలు, చూపించిన ధైర్యం, క్రమశిక్షణ చాలా గొప్పవి. ఆమె పదేళ్ల ప్రాయం నుంచే సంగీతం పట్ల తన ఇష్టాన్ని చూపిస్తూ గొప్ప లక్ష్యం వైపు చెదరని ఏకాగ్రతతో పయణించారు. ఎంఎస్ అమ్మ ఎంత ఇబ్బందికరమైన జీవితాన్ని గడిపారో చాలామందికి తెలియదు. నాలుగు దక్షిణ భారత భాషల్లో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాం అన్నారు.హీరోయిన్ రశ్మిక మందన్న మాట్లాడుతూ నటిగా నాకు ఈ గొప్ప అవకాశం దక్కినందుకు కృతజ్ఞతతో



మనసు నిండిపోతోంది. ఎంఎస్ అమ్మ 110వ జయంతి సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేస్తున్నా. ఈ వేదిక మీద నిల్చున్నందుకు దేవుడి సమక్షంలో ఉన్న భావన కలుగుతోంది. అమ్మ జీవిత ప్రయాణంలో చిన్న భాగంగా మారుతున్నందుకు ఎంతో గర్వంగా, గౌరవంగా భావిస్తున్నా. ఎంఎస్ అమ్మ పాత్రను మీ అందరికీ నచ్చేలా పోషించేందుకు సంపూర్ణ ప్రయత్నం చేస్తాను. అన్నారు.లెజెండరీ యాక్టర్ కమల్ హాసన్ మాట్లాడుతూ తన సంగీతంతో భారతదేశాన్ని, ముఖ్యంగా దక్షిణ భారత దేశాన్ని ఏకం చేసిన సంగీత సామ్రాజ్ఞి ఎంఎస్ సుబ్బులక్ష్మి అమ్మ. ఆమె సంస్కృతం, హిందీ సహా అనేక భాషల్లో పాటలు పాడారు. తెలుగు, తమిళం, కన్నడ ఇలా ఏ భాషలో ఆమె పాట పాడినా భాషకే అందం తెచ్చేలా ఆ పాట ఉండేది. ఆమె సంగీతమే మనకు అందించిన సందేశం. ఎంఎస్ సుబ్బులక్ష్మి అమ్మ నాలో ఎంతో స్ఫూర్తి నింపారు. ఎంఎస్ సుబ్బులక్ష్మి అమ్మ. ఈ టీమ్ అందరికీ నా బెస్ట్ విసెస్ తెలియజేస్తున్నా. అన్నారు.ఈ కార్యక్రమంలో హీరోయిన్ సుహాసినీ, నటుడు శివకుమార్, దర్శకుడు మహేంద్రన్, నటుడు, దర్శకుడు సముద్రఖని, ప్రొడ్యూసర్స్ కలైపులి థాను, రాజేంద్రన్, కాట్రగడ్డ ప్రసాద్, ఎంఎస్ సుబ్బులక్ష్మి మనవడు చంద్రశేఖర్, ఆయన సతీమణి మాల, దర్శకుడు డైరెక్టర్ గౌతమ్ తిన్ననూరి,ప్రొడ్యూసర్ రాక్ లైన్ వెంకటేష్ , ప్రొడ్యూసర్ బన్నీవాస్ తదితరులు పాల్గొన్నారు.

## నవంబర్ 20న 'ఆకాశంలో ఒకతార'



దుల్కర్ సల్మాన్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'ఆకాశంలో ఒకతార' సినిమాకు సంబంధించిన విడుదల తేదీని మేకర్స్ అనౌన్స్ చేశారు. ఈ మూవీలో దుల్కర్ సల్మాన్, సాత్విక వీరవల్లి, శ్రుతి హాసన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. పవన్ సాధినేని దర్శకుడు. ఈ చిత్రాన్ని లైట్‌బాక్స్ మీడియా బ్యానర్‌పై సందీప్ గుణ్ణం, రమ్య గుణ్ణం నిర్మిస్తున్నారు. స్వప్న సినిమా, గీతా ఆరట్స్ సంస్థలు ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నాయి.'ఆకాశంలో ఒక తార' సినిమాను నవంబర్ 20న థియేటర్లలో విడుదల చేస్తున్నట్లు మేకర్స్ తాజాగా ప్రకటించారు. ఈ అందమైన సినిమాను ప్రతి ఒక్కరికీ చేరువ చేసేలా టీమ్ భారీ స్థాయిలో డిఫరెంట్ స్టైల్ ప్రమోషన్స్ నిర్వహించేందుకు ప్లాన్ చేస్తోంది. రీసెంట్‌గా విడుదలైన ఫస్ట్ సింగిల్ 'చిట్టి చిట్టి చీమ' పాటకు అమేజింగ్ రెస్పాన్స్ వచ్చింది. ఈ పాట మ్యూజిక్ లవర్స్‌కు అడిక్షన్‌గా మారుతోంది. నేషనల్ అవార్డు విన్నింగ్ మ్యూజిక్ డైరెక్టర్ జీవీ ప్రకాశ్ కుమార్ ఈ సినిమాకు సంగీతం అందిస్తున్నారు. సినిమాకు సంబంధించిన ప్రతి అప్డేట్ తో మూవీపై పాజిటివ్ వైబ్స్, ప్రేక్షకుల్లో ఆసక్తి మరింత పెరుగుతున్నాయి. రాబోయే రోజుల్లో ఈ సినిమా నుంచి వచ్చే అప్డేట్స్ కోసం ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. దర్శకుడు పవన్ సాధినేని క్రియేటివ్ విజన్తో తెరకెక్కుతున్న 'ఆకాశంలో ఒక తార' సినిమాపై అందరిలోనూ ఆసక్తి నెలకొంది. సినిమాటోగ్రాఫర్ సుజిత్ సారంగ్ ఈ సినిమాకు కెమెరామెన్‌గా పనిచేస్తున్నారు. శ్వేతా సాబు సిరిల్ ప్రొడక్షన్ డిజైన్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. 'ఆకాశంలో ఒక తార' సినిమా తెలుగు, తమిళం, హిందీ, మలయాళ భాషల్లో రిలీజ్ అవుతోంది. దుల్కర్ సల్మాన్ సరసన సాత్విక వీరవల్లి, శ్రుతిహాసన్ నటిస్తున్నారు.



## గూఢచారికి సీక్వెల్‌గా 'జీ2'

అడవి శేష్ హీరోగా నటించిన బ్లాక్ బస్టర్ స్పై థ్రిల్లర్ గూఢచారికి సిక్వెల్‌గా తెరకెక్కుతున్న మూవీ 'జీ2' రిలీజ్ డేట్‌ని అనౌన్స్ చేశారు. 2027 ఫిబ్రవరి 5న వరల్ వైడ్ థియేటర్లలో రిలీజ్ కానుంది. వినయ్ కుమార్ సిరిగినీడి దర్శకుడిగా పరిచయమవుతున్న ఈ చిత్రం, ఫస్ట్ పార్ట్ గూఢచారి సక్సెస్‌ను బేస్‌గా తీసుకుని అంతర్జాతీయ స్థాయిలో నిర్మిస్తున్నారు ఇండియన్ సినిమాలో స్పై థ్రిల్లర్ జానర్‌ని రీడిఫైన్ చేయనుంది.ఈసారి ఏజెంట్ 116గా వామికా గబ్బి ఎంట్రీ ఇస్తోంది. యాక్షన్‌తో పాటు ఎమోషన్ వున్న క్యారెక్టర్ ఇది. ఈ మూవీలో ఇమ్రాన్ హష్మీ పవర్ ఫుల్ పాత్ర పోషిస్తున్నారు. మురళీ శర్మ, సుప్రియా యార్లగడ్డ, మధు శాలిని కీలక పాత్రల్లో నటిస్తున్నారు.పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్, ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్లపై టి.జి. విశ్వ ప్రసాద్, అభిషేక్ అగర్వాల్ ఈ సినిమాని భారీగా నిర్మిస్తున్నారు. తెలుగుతో పాటు హిందీ, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో పాన్ ఇండియాగా రిలీజ్ కానుంది.



## 'మాయలేడి' టీజర్ రిలీజ్

హీరో రాకేష్ వర్రే చేస్తున్న కొత్త సినిమా 'మాయలేడి'. ఈ సినిమా క్రేజీ యాంట్స్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్నారు. రాకేష్ వర్రే గతంలో క్రేజీ యాంట్స్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై ఎవరికీ చెప్పొద్దు, పేకమేడలు వంటి కంటెంట్ ఓరియెంటెడ్ మూవీస్ నిర్మించి అందరి ప్రశంసలు పొందారు. ఇప్పుడు 'మాయలేడి'తో మరో ఇంట్రెస్టింగ్ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు. ఈ సినిమాను దర్శకుడు ప్రశంకర్ రూపొందిస్తున్నారు. మధుమిత సర్కార్ హీరోయిన్ గా నటిస్తోంది. అక్టోబర్ లో 'మాయలేడి' సినిమా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. 'మాయలేడి' సినిమా టీజర్ రిలీజ్ చేశారు. ఇటీవల రిలీజ్ చేసిన 'మాయలేడి' సినిమా గ్లింప్స్, టైటిల్ సాంగ్, 'సరిగమలే గుండె అంచుల్లో..' పాటలకు హ్యూజ్ రెస్పాన్స్ దక్కింది. ఒక ఇంట్రెస్టింగ్ బ్యాక్ డ్రాప్ తో సాగే లవ్ స్టోరీని థియేటర్స్ లో చూడబోతున్న ఫీల్‌ను ప్రేక్షకుల్లో తాజాగా రిలీజ్ చేసిన టీజర్ క్రియేట్ చేస్తోంది. రాకేష్ వర్రే, మధుమిత సర్కార్, ఇంద్రజ, సురేష్, సత్య, నటిస్తున్నారు.

## డిసెంబర్ నుంచి హైదరాబాద్‌లో హార్వర్డ్ యూనివర్సిటీ

# ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ కోర్సు

- యుకె బిజినెస్ స్కూల్స్ బృందంతో సిఎం రేవంత్ రెడ్డి
- ఫ్యూచర్ సిటీలో ఎడ్యుకేషన్ హబ్‌ను తీర్చిదిద్దుతున్నాం
- తెలంగాణకు అత్యుత్తమ బిజినెస్ స్కూల్స్ రాకతో అగ్రగామి కార్పొరేట్ సంస్థల చూపు రాష్ట్రం వైపు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రపంచ ప్రఖ్యాత 'హార్వర్డ్ యూనివర్సిటీ' హైదరాబాద్‌లో ఔత్సాహికులకు ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ కోర్సులను డిసెంబర్ నుంచి అందించనున్నట్లు తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి తెలిపారు. తెలంగాణను 'గ్లోబల్ నాలెడ్జ్ హబ్'గా తీర్చిదిద్దే దిశగా తెలంగాణ ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోందని యుకె బిజినెస్ స్కూల్స్ బృందం భేటీలో అన్నారు. ఎంసిఆర్ హెచ్‌ఆర్‌డిలో గురువారం నిర్వహించిన భేటీలో యుకె హౌస్ ఆఫ్ లార్డ్స్ సభ్యులు కరణ్ బిలిమోరియా, బ్రిటిష్ కౌన్సిల్ డైరెక్టర్ జనక పుష్పనాథన్, చార్టర్డ్ అసోసియేషన్ ఆఫ్ బిజినెస్ స్కూల్స్ సిఇఒ ఫ్లోరా హామిల్టన్, బ్రిటిష్ డిప్యూటీ హైకమిషనర్ ప్రతినిధులతో సహా 30 మంది వివిధ యుకె యూనివర్సిటీ ప్రతినిధులతో సిఎం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వివిధ యుకె బిజినెస్ స్కూల్స్‌కు సంబంధించిన డీన్లు, ఉన్నత స్థాయి అధికారులతో చర్చిస్తూ, విశ్వవిద్యాలయాలకు అవసరాలకు తగ్గట్టు అన్ని రకాలుగా రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. ఎంఐటి, పర్డ్యూ వంటి పలు ఐవీ లీగ్ యూనివర్సిటీలు హైదరాబాద్‌లో ఆఫ్ షోర్ క్యాంపస్ ఏర్పాటు ప్రక్రియ మొదలైందన్నారు. విదేశీ విద్యాసంస్థల రాకతో స్థానిక విశ్వవిద్యాలయాలు, పరిశ్రమలతో కలిసి పనిచేయడానికి, ఇక్కడే పరిశోధనలు చేపట్టడానికి దోహదపడుతుందన్నారు. యుకె బిజినెస్ స్కూల్స్ తెలంగాణలో ఏర్పాటైతే ప్రపంచ స్థాయి కార్పొరేట్ వ్యాపార సంస్థలు రాష్ట్రం వైపు చూస్తాయని సిఎం అన్నారు. అదే సమయంలో రాష్ట్ర విద్యార్థులు, అధ్యాపకులకు అంతర్జాతీయ సంస్థలు, అంతర్జాతీయ అనుభవం, ప్రపంచ స్థాయి అవకాశాలు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ దిశగా హార్వర్డ్, ఎంఐటి, లండన్ విశ్వవిద్యాలయం, వర్జీనియా టెక్, నార్త్ ఈస్టర్న్ విశ్వవిద్యాలయం వంటి అనేక ప్రముఖ అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలతో ఎగ్జిక్యూటివ్ ప్రోగ్రామ్‌లు, ద్యూయల్ డిగ్రీ కోర్సులు, అధ్యాపకుల శిక్షణ, పరిశోధన వంటి రంగాల్లో భాగస్వామ్యాలు ప్రారంభించవచ్చన్నారు.

విద్యార్థులకు ఇంగ్లీష్, జర్మన్, జపనీస్ వంటి విదేశీ భాషా నైపుణ్యాలను పెంపొందించేందుకు కూడా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. మారుతున్న మార్కెట్ అవసరాలకు అనుగుణంగా యువతకు అత్యాధునిక నైపుణ్య శిక్షణ అందించేందుకు భారత్ ఫ్యూచర్ సిటీలో యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తున్నట్టు వివరించారు. డిసెంబర్ లో అక్కడ నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2026కు బృందానికి ఆహ్వానం పలికారు. యూకే విద్యా వ్యవస్థలో ముఖ్యులందరికీ గ్లోబల్ సమ్మిట్ కు ప్రత్యేకంగా ఆహ్వానించనున్నట్లు వివరించారు. ప్రపంచంలోనే మేటి విశ్వవిద్యాలయాలు, ఫార్చ్యూన్ 500 కంపెనీలు తెలంగాణాలో ఉండే విధంగా అడుగులు వేస్తున్నామన్నారు. నర్సరీ నుంచి ఉన్నత విద్య వరకు, అలాగే ఐటీఐలు, పాలిటెక్నిక్ కాలేజీలు, స్కిల్స్ యూనివర్సిటీల ద్వారా యువతలో నైపుణ్యాలను పెంపొందించడం, తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ వంటి వాటి ద్వారా విద్యా వ్యవస్థను సమూలంగా మార్చడమే ప్రభుత్వ ఉద్దేశమని సిఎం వివరించారు. 2047 నాటికి తెలంగాణను మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలన్న లక్ష్యం గురించి ప్రస్తావించారు.

## ఇపిఎఫ్ పరిమితి పెంపు హర్షణీయం

కనీస పెన్షన్ పెంచకపోవడం గర్హనీయం: ఎం. నాగేశ్వరరావు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఇపిఎఫ్ పరిమితిని రూ.15 వేల నుంచి రూ.25 వేలకు పెంచుతూ కేంద్ర క్యాబినెట్ తీసుకున్న నిర్ణయం ఎంతగానో హర్షణీయమని ఆర్‌టిసి బోర్డు మాజీ డైరెక్టర్ ఎం. నాగేశ్వరరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అయితే, దాదాపు 82 లక్షల మంది ఉన్న ఇపిఎస్ 95 పెన్షనర్లకు చెల్లిస్తున్న కనీస పెన్షన్ రూ.ఒక వెయ్యిను 11 సంవత్సరాలు గడిచినా ఇంకా పెంచకపోవడం అత్యంత దారుణమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కనీస పెన్షన్‌కు డిఎ అనుసంధానం చేయకపోవడం అనుచితమని విమర్శించారు. పెన్షనర్లు గౌరవప్రదమైన జీవితాన్ని గడపడానికి వీలుగా కనీస పెన్షన్‌ను తగిన నిష్పత్తిలో పెంచాలని, ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి న్యాయం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# రాచరిక, నిరంకుశ వ్యవస్థకు వ్యతిరేకంగా సాగిన ప్రజా పోరాటం

జస్టిస్ సుదర్శన్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాచరిక, నిరంకుశ వ్యవస్థకు వ్యతిరేకంగా సాగిన తెలంగాణ రైతాంగ సాయుధ ప్రజా పోరాటాన్ని హిందూ–ముస్లింల మధ్య జరిగిన ఘర్షణగా చిత్రీకరించడం చరిత్రను తప్పుదోవ పట్టించడమేనని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డి అన్నారు. నిజాం ముస్లిం కావడం వల్ల ప్రజలు ఆయనపై పోరాటం చేయలేదని, రాచరిక, నిరంకుశ వ్యవస్థలో ప్రజలపై సాగిన అణచివేతకు వ్యతిరేకంగా సాయుధ పోరాటం జరిగిందని తెలిపారు. హైదరాబాద్‌లోని రావి నారాయణ రెడ్డి ఆడిటోరియంలో గురువారం తెలంగాణ అమరవీరుల సార్మక ట్రస్ట్ ఆధ్వర్యంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుల శాశ్వత ఛాయాచిత్ర ప్రదర్శనను జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డి ప్రారంభించారు. తెలంగాణ అమర వీరుల స్మారక ట్రస్ట్ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జస్టిస్ సుదర్శన్‌రెడ్డి, మాజీ ఎంపి బి.వినోద్ కుమార్, సామాజిక, రాజకీయ విశ్లేషకులు పరకాల ప్రభాకర్, సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె.నారాయణ, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సిపిఐ(ఎం) కార్యదర్శి జాన్‌వెస్లీ, అమరవీరుల స్మారక ట్రస్ట్ కార్యదర్శి కందిమల్ల ప్రతాపరెడ్డి, కోశాధికారి ఉజ్జిని రత్నాకర్ రావు, సభ్యులు కె. శ్రీనివాస్ రెడ్డి, బొమ్మగాని ప్రభాకర్ పాల్గొన్నారు.

### సాయుధ పోరాట చరిత్ర అపూర్వమైంది

తెలంగాణ సాయుధ పోరాట చరిత్ర అపూర్వమైనదని, ఆ చరిత్రను అర్థం చేసుకోవడం ద్వారా నాటి సామాజిక, రాజకీయ పరిస్థితులను విశ్లేషించుకోవచ్చని జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి అన్నారు. నాటి వ్యవస్థలో ప్రజలను అణచివేసిన శక్తులకు వ్యతిరేకంగా సాగిన పోరాటాన్ని కేవలం మతపరమైన కోణంలో చూడటం సరైంది కాదన్నారు. ఫొటో ప్రదర్శనలో కనిపించే ప్రతి చిత్రం వెనుక ఒక చరిత్ర, ఒక త్యాగం ఉందని, ఆ చరిత్రను భావితరాలకు అందించేందుకు ఇలాంటి ప్రదర్శనలు, చర్చలు కొనసాగాలని సుదర్శన్ రెడ్డి ఆకాంక్షించారు. రజాకార్లను ఒక మతానికి ప్రతినిధులుగా కాకుండా, నాటి రాష్ట్ర అధికార వ్యవస్థ అండతో పనిచేసిన సాయుధ శక్తిగా చూడాలన్నారు. రజాకార్లను ఎదుర్కోవడమే కాకుండా ప్రజలను పీడించిన భూస్వామ్య, సంస్థాన వ్యవస్థలపైనా పోరాటం జరిగిందని తెలిపారు. ప్రజాస్వామ్య వ్యవస్థ, రాజకీయ స్వేచ్ఛపై జస్టిస్ సుదర్శన్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేస్తూ భవిష్యత్తులో ఇలాంటి సమావేశాలు నిర్వహించుకునే అవకాశం ఉండకపోవచ్చన్న హెచ్చరికలను విస్మరించరాదన్నారు. ప్రస్తుతం ప్రజలు స్వేచ్ఛగా సమావేశమై తమ అభిప్రాయాలను వ్యక్తం చేసుకునే అవకాశాలను కాపాడుకోవాలన్నారు.

### చీకటి గతానికి, వెలుగుల భవిష్యత్తుకు మధ్య జరిగిన మహా సంఘర్షణ : పరకాల ప్రభాకర్

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం చీకటి గతానికి, వెలుగుల భవిష్యత్తుకు మధ్య జరిగిన మహా సంఘర్షణ అని పరకాల ప్రభాకర్ అన్నారు. ప్రపంచ చరిత్రలోని స్పానిష్ సివిల్ వార్‌తో పోల్చదగినంత గొప్ప ఉద్యమం తెలంగాణ రైతాంగ పోరాటమని పేర్కొన్నారు. ఆ పోరాటంలో ప్రాణత్యాగం చేసిన వారిని స్మరించుకోవడం, వారి త్యాగాల స్ఫూర్తిని భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంపై తనకు భావజాలపరంగా ఎనలేని గౌరవం ఉందన్నారు. ప్రజల కోసం కాగడాలు పట్టుకుని ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ముందుకు సాగిన వారిని స్మరించుకోవడం గొప్ప సందర్భమన్నారు. స్వాతంత్ర్య సంగ్రామంలో ఎలాంటి పాత్ర లేని వ్యక్తులు, సంస్థలు, వేదికలు నేడు దేశభక్తులుగా చలామణి అవుతున్న పరిస్థితి ఆందోళనకరమని పరకాల ప్రభాకర్ వ్యాఖ్యానించారు. పోరాట శక్తుల మధ్య ఐక్యత అవసరమని 'లాల్ నీల్ ఏక్తా'తో పాటు 'లాల్ లాల్ ఏక్తా' కూడా అవసరమని ఆయన అన్నారు. గత విభేదాలను పదే పదే తొవ్వుకోవడం వల్ల ఉద్యమ శక్తులు మరింతగా విభజితమై బలహీనపడతాయని పేర్కొన్నారు. సివిల్ సొసైటీ సంస్థలు, రాజకీయ శక్తులు, వివిధ ప్రజా సంఘాలను విస్తృతంగా సమీకరించి ఒకే వేదికపైకి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు.

### ఎల్‌బినగర్ ఆసుపత్రికి రావి నారాయణ రెడ్డి పేరు పెట్టాలి : బి.వినోద్ కుమార్

హైదరాబాద్ ఎల్‌బినగర్‌లో ప్రభుత్వం నిర్మించిన టిమ్స్ ఆస్పత్రికి తెలంగాణ సాయుధ పోరాట యోధుడు రావి నారాయణరెడ్డి పేరు పెట్టాలని బి.వినోద్ కుమార్ డిమాండ్ చేశారు. దేశ మొదటి సార్వత్రిక ఎన్నికల్లో జవహర్‌లాల్ నెహ్రూ కంటే భారీ మెజార్టీతో గెలుపొందిన నాయకుడు రావి నారాయణరెడ్డికి ప్రత్యేక స్థానం ఉందన్నారు. ఆస్పత్రి నిర్మాణం పూర్తయినందున పేరుపై అనవసర



వివాదాలకు తావులేకుండా రావి నారాయణరెడ్డి పేరు పెట్టేందుకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రజల కోసం జరిగిన పోరాటాల చరిత్రను భావితరాలకు అందించాలన్నారు. నల్గొండ జిల్లా తెలంగాణ సాయుధ పోరాటంలో కీలక పాత్ర పోషించిందని, ధర్మభిక్షం, మల్లు స్వరాజ్యం, బి.ఎన్.రెడ్డి తదితర నాయకుల పోరాటాలను యువత తెలుసుకోవాలని సూచించారు.

### ఐక్యత దిశగా నిర్ణయాత్మక అడుగులు వేయాలి : కూనంనేని సాంబశివరావు

కమ్యూనిస్టు ఉద్యమం ప్రజల కోసం, సామాజిక మార్పు కోసం పనిచేసే శక్తిగా మరింత బలోపేతం కావాలంటే ఐక్యత దిశగా నిర్ణయాత్మక అడుగులు వేయాలని, ఇందుకు సంబంధించిన నిర్ణయం పైస్థాయి నాయకత్వం నుంచే రావాలని కూనంనేని సాంబశివరావు అన్నారు. కింది స్థాయిలో ఇప్పటికే ఐక్య కార్యాచరణ కొనసాగుతున్నప్పటికీ, పూర్తిస్థాయి ఏకీకరణకు సిపిఐ, సిపిఐ(ఎం) అగ్రనేతలు ఒకే వేదికపై కూర్చుని చర్చలు జరిపితే కింది స్థాయిలో ఉన్న కార్యకర్తలు, ప్రజలకు స్పష్టమైన మార్గం ఏర్పడుతుందని పేర్కొన్నారు. భూమి కోసం పోరాటం, ప్రజా సమస్యలపై ఉద్యమాలు, ఎర్రజెండా వంటి అనేక అంశాల్లో రెండు పార్టీల మధ్య సారూప్యత ఉన్నప్పుడు విభేదాలపై కాకుండా ఐక్యతపై దృష్టి పెట్టాలని సూచించారు. బలహీనతగా భావించినా పర్వాలేదు... సమాజం కోసం, ఒక మంచి లక్ష్యం కోసం ఐక్యతకు ప్రయత్నించడంలో నష్టమేమీ లేదన్నారు. కమ్యూనిస్టు ఉద్యమంపై ప్రజల్లో ఇప్పటికీ గౌరవం ఉందని, అయితే కమ్యూనిస్టులు ఎందుకు ఒక్కటిగా ఉండలేకపోతున్నారనే ప్రశ్న ప్రజల నుంచి వస్తోందన్నారు. చారిత్రక ఉద్యమాల అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకుని విభజనలను అధిగమించాలన్నారు.

### కమ్యూనిస్టు పార్టీల మధ్య ఐక్యతను బలోపేతం చేయాలి : జాన్‌వెస్లీ

తెలంగాణ సాయుధ పోరాటంలో అమరులైన వారి త్యాగాలను స్మరించుకోవడంతో పాటు కమ్యూనిస్టు పార్టీల మధ్య ఐక్యతను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని జాన్‌వెస్లీ అన్నారు. ఐక్య ఉద్యమాల నిర్వహణతో పాటు భవిష్యత్తులో మరింత సమన్వయంతో ముందుకు సాగేందుకు సిపిఐ(ఎం) తరపున కూడా ప్రయత్నాలు కొనసాగుతాయని ఆయన చెప్పారు. భూస్వామ్య, జమీందారీ, నిరంకుశ వ్యవస్థలకు వ్యతిరేకంగా పేదలు, రైతులు సాగించిన మహత్తర పోరాటంగా తెలంగాణ సాయుధ పోరాటాన్ని భావితరాలకు వివరించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. ఇందు కోసం ఫొటోలు, చారిత్రక ఆధారాలను సేకరించి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నాడు కమ్యూనిస్టు ఉద్యమం అందించిన చైతన్యంతో గ్రామాల్లో ప్రజలు సంఘటితమై పోరాటం సాగించారని చెప్పారు. ఈ చరిత్రను పక్కనపెట్టి కేవలం మతపరమైన కోణంలో పోరాటాన్ని వివరించడం సరైందికాదని అన్నారు.



స్వాతంత్ర్య సమరయోధులు సీనియర్ న్యాయవాది ఎడవల్లి శివరామ శాస్త్రీ రచించిన నా జీవిత కథ పుస్తకాన్ని రావి నారాయణరెడ్డి ఆడిటోరింలో ఆవిష్కరించిన జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డి

## ఓటర్ల నోటీసుల పరిష్కారం మరింత సులభతరం

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్ 26) ప్రక్రియలో భాగంగా ఓటర్లకు జారీ చేసిన నోటీసుల పరిష్కార విధానాన్ని రాష్ట్ర ఎన్నికల సంఘం మరింత సరళీకృతం చేసింది. ఇప్పటివరకు నోటీసులు అందుకున్న ఓటర్లకు ఎదురవుతున్న ఇబ్బందులను తొలగించేందుకు కీలక నిర్ణయం తీసుకున్నట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సిఈఓ) సి. సుదర్శన్ రెడ్డి గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో వెల్లడించారు. ఇకపై నోటీసుల పరిష్కారం కోసం ప్రతి ఓటరు వ్యక్తిగతంగా రానవసరం లేదని, సంబంధిత ఓటరు కుటుంబంలోని ఎవరైనా ఒక సభ్యుడు ఈఆర్ఓ, లేదా ఏఈఆర్ఓల వద్ద వ్యక్తిగతంగా హాజరైతే సరిపోతుందని తెలిపారు. తమ కుటుంబ సభ్యులకు సంబంధించిన అవసరమైన ధ్రువీకరణ పత్రాలు, సమాచారాన్ని సమర్పించేందుకు ఎన్నికల సంఘం వెసులుబాటు కల్పించిందని ఆయన చెప్పారు. ఓటర్లకు సంబంధించిన పత్రాలను స్వీకరించి, ఆయా నోటీసులను త్వరితగతిన పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఇప్పటికే అన్ని జిల్లాల ఎన్నికల అధికారులకు స్పష్టమైన మార్గదర్శకాలు పంపినట్లు తెలిపారు. మరోవైపు ఫారం6 దరఖాస్తుల పరిశీలన, డిక్లరేషన్ ఫారాల స్వీకరణ, క్లెయిమ్‌ల పరిష్కార ప్రక్రియపై సిఈఓ కీలక ఆదేశాలు జారీ చేశారు. అర్హత తేదీగా 01.10.2026ని పరిగణనలోకి తీసుకుంటూ, ఇప్పటివరకు పెండింగ్‌లో ఉన్న ఫారం6 దరఖాస్తులతో పాటు భవిష్యత్తులో వచ్చే కొత్త దరఖాస్తులకు సం బంధించి కూడా నిర్దేశిత డిక్లరేషన్ ఫారాన్ని తప్పనిసరిగా స్వీకరించాలని స్పష్టం చేశారు.

## తెలంగాణ విలీన చరిత్రకు మతం రంగు పులమొద్దు : బి.వి.రాఘవులు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** భూమి, భుక్తి కోసం సాగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి మతం రంగు పులిమి రాజకీయ లబ్ధి పొందేందుకు బిజెపి ప్రయత్నిస్తోందని సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యుడు బి.వి. రాఘవులు ఆరోపించారు. హిందూ–ముస్లింల మధ్య వైషమ్యాలు రెచ్చగొట్టే ప్రయత్నాలను తిప్పికొట్టి, తెలంగాణ సాయుధ పోరాటం అసలు చరిత్రను నేటి తరానికి తెలియజేయాలని పిలుపునిచ్చారు. లౌకికవాదం, ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణలో కమ్యూనిస్టులు ముందుండాలని అన్నారు. 'తెలంగాణ విలీనం–వాస్తవాలు–వక్రీకరణ' అంశంపై గురువారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సిపిఐ(ఎం) గ్రేటర్ హైదరాబాద్ సిటీ సెంట్రల్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో రాఘవులు ప్రసంగించారు. తెలంగాణ సాయుధ పోరాటాన్ని వివిధ రాజకీయ పార్టీలు తమకు అనుకూలంగా ఉపయోగించుకునే ప్రయత్నం చేస్తున్నాయని విమర్శించారు. చారిత్రక ఘటనలను మతపరమైన విభజనలకు ఉపయోగించడం వల్ల సమాజంలో వైషమ్యాలు పెరిగే ప్రమాదం ఉందన్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో కులాలు, మతాలకు అతీతంగా వివిధ వర్గాల ప్రజలు పాల్గొన్నారని రాఘవులు అన్నారు.తెలంగాణ విలీన చరిత్రను నేటి రాజకీయ ప్రయోజనాల కోసం వక్రీకరించకుండా వాస్తవాలను ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. లౌకికవాదం, ప్రజాస్వామ్య హక్కులను కాపాడటంలో కమ్యూనిస్టులు మరింత చురుగ్గా వ్యవహరించాలని రాఘవులు పిలుపునిచ్చారు. దేశంలో, రాష్ట్రంలో కొత్త తరహా ప్రజా ఉద్యమాలకు నాయకత్వం వహించాలని సూచించారు. తెలంగాణలో వివిధ దశల్లో పోరాటాలు జరిగినప్పటికీ భూ సమస్య ఎందుకు పూర్తిగా పరిష్కారం కాలేదని రాఘవులు ప్రశ్నించారు. భూములపై ప్రస్తుత రాజకీయ నాయకులపై వస్తున్న ఆరోపణలపై విచారణ జరిపి వాస్తవాలను ప్రజల ముందుంచాలని డిమాండ్ చేశారు. కెసిఆర్‌కు సంబంధించిన 450 ఎకరాలు, రేవంత్‌రెడ్డికి సంబంధించిన 350 ఎకరాల భూ ఆరోపణలపై విచారణ జరపాలని ఆయన కోరారు. కార్యక్రమానికి సిపిఐ(ఎం) హైదరాబాద్ సిటీ సెంట్రల్ కమిటీ కార్యదర్శి ఎం. వెంకటేశ్ అధ్యక్షత వహించారు. సీనియర్ నేత ఎం. శ్రీనివాస్, నగర కార్యదర్శివర్గ సభ్యులు ఎం. శ్రీనివాసరావు, ఎం. దశరథ్, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.




## బిసి హక్కుల సాధన సమితి బలోపేతానికి కృషి

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేణి శంకర్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** బిసి హక్కుల సాధన సమితిని గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు బలోపేతం చేసేందుకు నాయకులు కృషి చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేణి శంకర్ పిలుపునిచ్చారు. గురువారం హైదరాబాద్‌లోని సంఘం రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బిసి విద్యార్థులు, యువజనులు, మహిళలు సహా అన్ని రంగాల వారికి సంఘం అండగా ఉంటుందని తెలిపారు. దేశ, రాష్ట్ర వ్యాప్తంగా అస్తిత్వ ఉద్యమాలు ఉధృతంగా సాగుతున్న నేటి తరుణంలో బిసిల చిరకాల స్వప్నాలైన బిసి జన గణన , కేంద్రంలో బిసికు ప్రత్యేక మంత్రిత్వ శాఖ తో పాటు రాష్ట్ర స్థాయిలో జాతీయస్థాయిలో బిసి సబ్ ప్లాన్ సాధన కోసం సాగే ఉద్యమాలకు నేతృత్వం వహించాలన్నారు. కొంత మంది వ్యక్తులు బిసి సంస్థలు ఏర్పాటు చేసుకొని ఏదో ఒక రాజకీయ పార్టీతో అంటకాగుతూ పార్టీలలో చేరుతూ.... తరచూ పార్టీలు మారుతూ వారు మాత్రమే అభివృద్ధి చెంది, సంఘాన్ని పట్టించుకోకుండా బిసిలకు ద్రోహం చేస్తున్నారని అలాంటి వారి పట్ల బిసిలు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. అంతకుముందు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు గత కార్యక్రమాల నివేదికను ప్రవేశపెట్టి భవిష్యత్తు కార్యక్రమాలను సంఘము భవిష్యత్ కార్యచరణను వివరించారు. సమావేశంలో బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి నేదునూరి రాజమౌళి, సిహెచ్ దశరథ, పల్నాటి యాదయ్య చింతకింది కుమారస్వామి, ఎల్ శ్రవణ్ కుమార్, ఏషాల అశోక్ , వనం సత్యనారాయణ, ప్రమీల, అంబటి బాపురాజు, కృష్ణ , చిలకరాజు, శ్రీను, జె.లక్ష్మి , మహాలక్ష్మి , నరసమ్మ, మనోజ్ చారి, రమేష్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## రైతుల, మహిళల సాధికారతకు మరిన్ని కార్యక్రమాలు చేపడతాం

కేంద్ర వ్యవసాయ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** రైతుల సంక్షేమం, మహిళల సాధికారత, పేదల గృహ నిర్మాణం వంటి అంశాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో మరిన్ని కార్యక్రమాలు చేపడతామని కేంద్ర వ్యవసాయ, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అన్నారు. గురువారం ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకొని రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం తిమ్మాపూర్ గ్రామంలో నిర్వహించిన రైతులు, మహిళా సంఘాల సభ్యులతో ముఖాముఖి ప్రత్యేక కార్యక్రమంలో కేంద్ర వ్యవసాయ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి,కేంద్ర వ్యవసాయ శాఖ సహాయ మంత్రి రామ్‌నాథ్ ఠాకూర్, భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్ర రావు,చేవెళ్ల ఎంపి కొండా విశ్వేశ్వర్ రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,ప్రధాని నరేంద్ర మోదీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. విశ్వకర్మ జయంతి, హైదరాబాద్ విమోచన దినోత్సవం సందర్భంగా ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. గ్రామంలో గతంలో రజాకార్ల దాడుల నుంచి ప్రజలను రక్షించుకునేందుకు గ్రామస్తులు నిర్మించిన బురుజును సందర్శించిన విషయాన్ని ప్రస్తావిస్తూ, అన్యాయానికి వ్యతిరేకంగా ధైర్యంగా నిలిచిన పూర్వీకులకునివాళులర్పించారు. మహిళల ఆర్థిక సాధికారత కోసం స్వయం సహాయక సంఘాల ద్వారా అమలు చేస్తున్న కార్యక్రమాలను కేంద్ర మంత్రి ప్రస్తావించారు. 'లఖపతి దీదీ' కార్యక్రమం ద్వా రా మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడంతో పాటు, బ్యాంకు రుణాలు, శిక్షణ , వివిధ ఉపాధి అవకాశాలను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.జిల్లాలో మహిళా సంఘాలు తయారు చేస్తున్న ఉత్పత్తులను పరిశీలించిన ఆయన, ఇంకా లఖ్‌పతి దీదీలుగా మారని మహిళలను కూడా శిక్షణ, బ్యాంకు రుణాల ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించాలని జిల్లా యంత్రాంగాన్ని సూచించారు. పేదలకు సొంత ఇళ్లు కల్పించేందుకు ప్రధాన మంత్రి ఆ వాస్ యోజనను సమర్థవంతంగా అమలు చేయనున్నట్లు కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ స్పష్టం చేశారు. అర్హులైన ప్రతి కుటుంబానికి పక్కా ఇల్లు అందించేందుకు చర్యలు కొనసాగుతాయని పేర్కొన్నారు. రైతుల ఆ దాయం పెంచేందుకు ఆధునిక, అభివృద్ధి చెందిన వ్యవసాయ విధానాలను ప్రోత్సహించడంతో పాటు, తెలంగాణలో వ్యవసాయ అభివృద్ధికి సమగ్ర రోడ్‌మ్యాప్ రూ పొందించనున్నట్లు తెలిపా రు. అనంతరం కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి, రహదారుల నిర్మాణానికి, రైతులకు ఆర్థిక సహాయానికి, స్వయం సహాయక సంఘాలకు రుణ సదుపాయాలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. కేంద్ర వ్యవసాయ శాఖ సహాయ మంత్రి రామ్‌నాథ్ ఠాకూర్ మాట్లాడుతూ, దేశంలోని పేదలు, రైతులు, మహిళల సంక్షేమం కోసం ప్రధాని నరేంద్ర మోదీ నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. పేదలు, రైతుల సంక్షేమాన్ని లక్ష్యంగా చేసుకుని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ కార్యక్రమాల ద్వారా అర్హులకు ప్రభుత్వ సహాయం చేరేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, గతంలో పేదరికాన్ని ఆహారం, దుస్తులు,కనీస వసతులు లేని పరిస్థితులతో నిర్వచించేవారని, ప్రస్తుతం గ్రామాల్లో ప్రజల జీవన ప్రమాణాలు గణనీయంగా మెరుగుపడ్డాయని పేర్కొన్నారు. జిల్లా అదనపు కలెక్టర్ డాకె. కిరణ్మయి మాట్లాడుతూ, రైతులు, మహిళా స్వయం సహాయక సంఘాలు గ్రామీణాభివృద్ధికి కీలకంగా నిలుస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పి సిఇఒ కృష్ణారెడ్డి డిపిఓ సురేష్ మోహన్ పిడి డిఆర్డిఏ శ్రీలత, గ్రామ సర్పంచ్ అంజమ్మ, రైతులు, మహిళా సంఘాల సభ్యులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ అభివృద్ధికి పునరంకితం కావాలి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర ఇంధన అవసరాలను సమర్థవంతంగా తీర్చడం ద్వారా రాష్ట్ర పారిశ్రామిక, ఆర్థిక అభివృద్ధిలో సింగరేణి తనవంతు కీలకపాత్ర పోషించాలని సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి అన్నారు. ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో విద్యుత్ వినియోగం పెరిగే అవకాశాలు ఉన్నందున, థర్మల్ విద్యుత్ కేంద్రాలకు అవసరమైన బొగ్గు ను తగినంతగా సరఫరా చేస్తూ రాష్ట్ర ఇంధన భద్రతకు సింగరేణి మరింతగా అండగా నిలవాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా గురువారం సింగరేణి భవన్‌లో నిర్వహించిన వేడుకలకు ఆయన ము ఖ్యఅతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్ట ర్ బుద్ధ ప్రకాష్ జ్యోతి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర అభివృద్ధితో పాటు దేశ పు రోభివృద్ధిలో ప్రతీ ఉద్యోగి తనవంతు బాధ్యతను మరింత సమర్థవంతంగా నిర్వర్తించాలని కోరారు. రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి ప్రతీ ఒక్కరూ పునరంకితం కావాలని పిలుపునిచ్చారు.

## త్యాగాలు, పోరాటాల ఫలితమే ప్రజాపాలన

సెప్టెంబర్ 17కు చారిత్రక ప్రాధాన్యం

తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్‌రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్ సంస్థానాన్ని భారత యూనియన్‌లో విలీనం చేయడం కోసం సాగిన ప్రజా ఉద్యమాలు, రైతాంగ పోరాటాలు, త్యాగాల ఫలితంగానే నేడు ప్రజాస్వామ్య పరిపాలన కొనసాగుతోందని తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సెప్టెంబర్ 17కు చారిత్రక ప్రాధాన్యం ఉందని, నిజాం నిరంకుశ పాలన నుంచి ప్రజలకు విముక్తి లభించడంతో పాటు హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనం జరిగిన రోజుగా ఈ తేదీని గుర్తుంచుకోవాలని పేర్కొన్నారు. భారత యూనియన్‌లో హైదరాబాద్ సంస్థానం విలీనం దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం హైదరాబాద్ నాంపల్లిలోని తెలంగాణ మీడియా అకాడమీ కార్యాలయంలో జాతీయ పతాకాన్ని కె.శ్రీనివాస్‌రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ హైదరాబాద్ సంస్థానాన్ని భారత యూనియన్‌లో విలీనం చేయాలని ప్రజా సంఘాలు ఉద్యమాలు, సభలు, సమావేశాలు నిర్వహించాయని తెలిపారు. నిజాం నిరంకుశ పాలనకు, రజాకార్లు, భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా రైతాంగం సాగించిన పోరాటాలు కూడా హైదరాబాద్ విలీన చరిత్రలో కీలకమైనవని చెప్పారు. తెలంగాణ విముక్తి పోరాటంలో అనేక మంది ముస్లింలు కూడా పాల్గొని ప్రాణత్యాగాలు చేశారని గుర్తు చేశారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం సెప్టెంబర్ 17ను ప్రజా పాలన దినోత్సవంగా నిర్వహించడం మంచి పరిణామమని శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ప్రజా ప్రభుత్వంలో భాగంగా మహాలక్ష్మి పథకం, కొత్త రేషన్ కార్డుల పంపిణీ, ఇందిరమ్మ ఇళ్ల వంటి సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా సెప్టెంబర్ 17ను ప్రజా పాలన దినోత్సవంగా నిర్వహిస్తూ అభివృద్ధి, సంక్షేమం, సామాజిక న్యాయంపై దృష్టి పెడుతున్నట్లు పేర్కొంది. హైదరాబాద్ భవిష్యత్ అభివృద్ధిలో భాగంగా ఫ్యూచర్ సిటీతో పాటు పట్టణాభివృద్ధి, పరిశ్రమలు, క్రీడలు, ఫార్మా, ఐటి తదితర రంగాల్లో అవకాశాలు విస్తరిస్తున్నాయని శ్రీనివాస్‌రెడ్డి వివరించారు. కార్యక్రమంలో మీడియా అకాడమీ కార్యదర్శి నాగులపల్లి వెంకటేశ్వరరావు, మేనేజర్ శైలేశ్వర్ రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## భూ రికార్డుల విధ్వంసంపై సమగ్ర విచారణ జరపాలి: రైతు సంక్షేమ కమిషన్

**ప్రజాపక్షం/ హైదరాబాద్ :** రెవెన్యూ వ్యవస్థ, ధరణి, 22ఎ, భూభారతి, భూ రికార్డుల పరిరక్షణపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శాసనసభలో చేసిన వ్యాఖ్యలు చారిత్రాత్మకమని తెలంగాణ వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం. కోదండరెడ్డి, సభ్యులు వెంకన్న యాదవ్, కేవీఎన్ రెడ్డి, భవానీ రెడ్డి, గోపాల్ రెడ్డి పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో భూ రికార్డుల ప్రక్షాళన, వీఆర్ఓ వ్యవస్థ రద్దు, ధరణి అమలుతో భూదాన్, అసైన్డ్ పట్టా భూముల రికార్డుల్లో సమస్యలు ఏర్పడ్డాయని వారు ఆరోపించారు. అర్హులైన భూ యజమానులకు 22ఏ భూముల విషయంలో న్యాయం చేయాలన్న సిఎం హామీని స్వాగతిస్తున్నామన్నారు. గతంలో భూదాన్, అసైన్డ్ ఇతర ప్రభుత్వ భూములు అక్రమ బదలాయింపులకు గురయ్యాయా అనే అంశంపై సమగ్ర విచారణ జరిపి, అక్రమాలకు పాల్పడిన వారితో పాటు సహకరించిన అధికారులపైనా చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. భూ రికార్డులను పారదర్శకంగా, భద్రంగా పరిరక్షించడం రైతుల భూ హక్కులకు అత్యంత కీలకమని వారు పేర్కొన్నారు.





## ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయం

**ప్రజాపక్షం/నవాబుపేట్:** తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని నవాబుపేట్ మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సామ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సామ వెంకట్‌రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించి గౌరవ వందనం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజల సంక్షేమం, అభివృద్ధి, ప్రజలకు పారదర్శకమైన పాలన అందించడమే ప్రజాపాలన ప్రధాన లక్ష్యమన్నారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటికి సత్వర పరిష్కారం చూపే విధంగా పాలన సాగాలని పేర్కొన్నారు. ప్రజల భాగస్వామ్యంతోనే ప్రజాస్వామ్య పాలన మరింత బలోపేతం అవుతుందని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల ప్రయోజనాలు చేరేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ప్రజాపాలనలో ప్రజలే కేంద్రబిందువుగా ఉండాలని, ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు చివరి వ్యక్తి వరకు చేరినప్పుడే ప్రజాపాలన లక్ష్యం నెరవేరుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మేడిపల్లి వెంకటయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు మల్లేశం, మహేందర్‌రెడ్డి, ఆనందం తదితరులు పాల్గొన్నారు. అనంతరం నాయకులు, కార్యకర్తలు పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.

నవాబుపేట్ మండలం నారేగూడ గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ప్రజా పాలన దినోత్సవ కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో గ్రామ సర్పంచ్ శ్రీమతి ఎల్వర్తి దీపికా దశరథ్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ప్రజా పాలన దినోత్సవం ప్రాముఖ్యతను వివరిస్తూ సర్పంచ్ దీపికా దశరథ్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ చాకలి శ్రీనివాస్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు హనుమయ్య, సంజీవులు, మహిపాల్ రెడ్డి, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం మంజుల, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన విద్యార్థులందరికీ టిడి టీకాలు

డిఎంహెచ్ఓ డా.ఆనంద్

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** జిల్లాలో అర్హులైన విద్యార్థులందరికి టిడి టీకాలు అందేలా వైద్యారోగ్య శాఖ అధికారులు,సిబ్బంది పని చేయాలని డిఎంహెచ్ఓ డా.ఆనంద్ ఆదేశించారు. మేడ్చల్ మండలం కిస్తాపూర్ గురుకుల బాలికల పాఠశాలలో నిర్వహిస్తున్న టిడి టీకా శిబిరాన్ని గురువారం ఆయన సందర్శించారు. టీకా కార్యక్రమ నిర్వహణ, విద్యార్థినుల హాజరు. అర్హులైన విద్యార్థినుల గుర్తింపు, టీకాల లబ్దిదారుల జాబితా, రిజిస్టర్, ఆన్‌లైన్ నమోదు, వ్యాక్సిన్ క్యారియర్, టీకా వ్యర్థాల నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు. టీకా అనంతరం ఏవైనా అసౌకర్య లక్షణాలు కనిపిస్తే వైద్య సిబ్బందికి తెలియపరచాలని సూచించారు. వ్యాక్సిన్‌లను నిర్దేశిత ఉష్ణోగ్రతలో భద్రపరచాలని, టీకా గడువు తేదీలు, బ్యాచ్ నంబర్లు పరిశీలించిన అనంతరమే వాటిని వినియోగించాలన్నారు. టీకా కార్యక్రమంలో అవసరమైన సిరంజ్‌లు, పత్తి, వ్యర్థాల సేకరణ బాక్స్‌లు, అత్యవసర వైద్య సామగ్రి అందుబాటులో ఉండేలా చూడాలన్నారు.



## 'సర్' పురోగతిపై ఆర్‌డిఓ సమీక్ష

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** 'సర్' వేగవంతంగా పూర్తి చేయాలని కీసర ఆర్‌డిఓ వెంకట్‌రెడ్డి బిఎల్ఓలకు సూచించారు. గురువారం శామీర్‌పేట తహసీల్దార్ కార్యాలయంలో సర్‌పై కీసర ఆర్డిఓ వెంకట్‌రెడ్డి బిఎల్ఓలతో సమావేశం నిర్వహించారు. రాజకీయ ప్రతినిధులు, పార్టీల ప్రతినిధు ల సహకారం తీసుకుని సంబంధిత సమాచారాన్ని త్వరితగతిన సేకరించి పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయాలని సూచించారు. సర్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు అధికారులు, బిఎల్ఓలు సమన్వయం తో పనిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, సర్ ట్రైనర్ తిరుమలేష్, బిఎల్ఓలు పాల్గొన్నారు.



## మున్సిపల్ కార్యాలయంలో ప్రజాపాలన దినోత్సవం

**ప్రజాపక్షం/పరిగి:** తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని పరిగి మున్సిపల్ కార్యాలయంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత జాతీయ జెండాను ఎగురవేసిన అనంతరం మాట్లాడుతూ సెప్టెంబర్ 17 తెలంగాణ చరిత్రలో మరువలేని రోజు అని,నియంత పాలన నుండి తెలంగాణ ప్రజలకు విముక్తి లభించిన రోజున్నారు. ప్రజాపాలన అంటే ప్రజల కోసమే పాలన అని రాష్ట్ర ప్రభుత్వం అదే దిశగా పనిచేస్తోందని తెలిపారు. అన్ని వర్గాల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ మల్లేషం, వైస్ చైర్మన్ హనుమంతు కమల్, పిఎసిఎస్ చైర్మన్ పార్థసారథి, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## ఆర్గానిక్ వ్యవసాయంపై శ్రద్ధ చూపాలి

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** ఆర్గానిక్ వ్యవసాయంపై రైతులు దృష్టి సారించాలని, భూసార పరీక్షల వలన కలిగే లాభాలను రైతులు తెలుసుకోవాలని వ్యవసాయ శాఖ యూనివర్శిటి శాస్త్రవేత్త శ్రీనివాస్ అన్నారు. గురువారం మూడుచింతలపల్లి మున్సిపల్‌లోని ఉద్దెమర్రిలో ఆత్మ ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ తరపున రైతులకు ఆర్గానిక్, నాచురల్ ఫామింగ్‌పై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా రైతులకు కూరగాయల సాగులో ఆర్గానిక్ వ్యవసాయం చేయడం వలన వచ్చే లాభాలను వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ప్రవీణ, హెచ్ఓ వెంకటరమణ, హెచ్ఇఓ సంధ్య, ఎఇఓ సురేష్‌రెడ్డి, కౌన్సిలర్ లత, శ్రీలత, స్పీక్ కంపెని మేనేజర్ అబ్దుల్ హుస్సేన్, రైతులు పాల్గొన్నారు.

# ప్రథమ స్థానం చేరుకునేందుకు సమన్వయ కృషి

రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు





**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** నేడు ప్రజలు అనుభవిస్తున్న స్వేచ్ఛ, స్వాతంత్రం వెనుక ఎంతోమంది అసమాన త్యాగాల పోరాట పటిమ స్ఫూర్తిగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాను రాష్ట్రంలోనే ప్రథమ స్థానం చేరుకొనేలా సమన్వయ కృషి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు పిలుపిచ్చారు. జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో గురువారం తెలంగాణా ప్రజాపాలన దినోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. తొలుత తెలంగాణా విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించి పోలీసుల నుండి గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా యంత్రాంగం ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేయటంలో కొనసాగిస్తున్న కృషిని అభినందించారు. మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేయటం, అంగన్‌వాడీల నిర్వహణ, రేషన్ కార్డుల పంపిణీ, అభయహస్తం పథకాలు, ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరా మహిళా శక్తి, ఆరోగ్య కేంద్రాలు, రైతు భరోసా, మహిళలు, చిన్నారుల భద్రత కోసం టి సేఫ్ యాప్ లాంటి అనేక పథకాలను ప్రజలకు అందుబాటులోకి తెచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మనుచౌదరి, అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, విజయేందర్‌రెడ్డి, ఉప్పల్ డిసిపి సురేష్ కుమార్, జిల్లా మార్కెటింగ్ కమిటీ చైర్మన్ నర్సింలు యాదవ్, గ్రంథాలయ కమిటీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, ఆర్టీఏ కమిటి సభ్యులు జైపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



**జిల్లా గ్రంథాలయ సంస్థలో..** జిల్లా గ్రంథాలయ సంస్థలో నిర్వహించిన తెలంగాణా ప్రజా పాలన దినోత్సవ వేడుకల్లో సంస్థ చైర్మన్ బొంగునూరి శ్రీనివాసరెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. దేశ సమైక్యత, సమగ్రత, ప్రజాస్వామ్య విలువలను కాపాడు తామంటూ ప్రతిజ్ఞ చేసారు.

# తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటయోధుల త్యాగం వెలకట్టలేనిది

స్పీకర్ ప్రసాద్‌కుమార్



**ప్రజాపక్షం/వికారాబాద్:** రాచరికవ్యవస్థ నుండి ప్రజాస్వామ్య వ్యవస్థ ఆవిర్భావానికి నాంది పలికిన అమరులైన తెలంగాణ సాయుధ, రైతాంగ పోరాట యోధుల త్యాగం వెలకట్టలేనిదని స్పీకర్ ప్రసాద్‌కుమార్ అన్నారు. కలెక్టర్ కార్యాలయం ఆవరణంలో తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ వేడుకలను జిల్లా యంత్రాంగం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా స్పీకర్ పాల్గొని ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య పోరాటంలో మహాత్మాగాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభాయి పటేల్, సుభాష్ చంద్రబోస్, అంబేద్కర్ వంటి జాతీయ నాయకులు పాల్గొని బ్రిటిష్ వారి బారినుండి భారతజాతిని విముక్తి చేశారన్నారు. ఆనాడు దేశవ్యాప్తంగా ఉన్న 562 సంస్థానాల్లో మెజారిటీ సంస్థానాలు భారతదేశం లో విలీనం అయినప్పటికీ భారత యూనియన్ లో విలీనం చేసేందుకు నిజాం అంగీకరించకపోవడంతో 1948న భారత సైన్యం రంగంలోకి దిగి భారత యూనియన్‌లో చేర్చడం జరిగిందన్నారు. నిజాం సంస్థానంలో భూ స్వాములు, జమీందారులు, జాగీర్దార్లు, దేశముఖ్‌లు, ప్రజలను నానా రకాలుగా వేధించేవారని, రైతులు పండించిన పంటలో అగ్రభాగం పెత్తందారులకు పన్నుల రూపంలో చెల్లించాల్సి వచ్చేదని , 85శాతం ప్రజలు మాట్లాడే స్థానిక భాషపై అణచివేత, వెట్టిచాకిరి, బానిసత్వం కొనసాగడం జరిగేదన్నారు. భారత దేశంలో కలవాలనే తెలంగాణ ప్రజల ఆకాంక్ష మేరకు అప్పటి ప్రధానమంత్రి పండిట్ జవహర్ నెహ్రూ, సర్దార్‌వల్లభాయ్‌పటేల్ హైదరాబాద్ సంస్థానాన్ని భారతదేశంలో విలీనం చేశారు. తెలంగాణ గడ్డమీద అసమాన త్యాగాలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అనేక అభివృద్ధి కార్యక్రమాలు,సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు మనోహర్‌రెడ్డి, కలెక్టర్ దీపక్‌తివారి, జిల్లా ఎస్పి స్నేహమెహ్రా, అదనపు కలెక్టర్లు రాజేష్‌మీనా, ఉమాశంకర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ కట్టడాలు, కబ్జాల కూల్చివేతలు షురూ

ఇక ఉపేక్షించేది లేదంటూ

డిసి శైలజ హెచ్చరిక







**ప్రజాపక్షం/బోడుప్పల్/ఉప్పల్ :** మల్కాజిగిరి నగర పాలక సంస్థ కమిషనర్ టి.వినయ్ కృష్ణా రెడ్డి ఆదేశాలతో బోడుప్పల్, ఉప్పల్ సర్కిల్ కార్యాలయాల అధికారులు అక్రమ కట్టడాలు, కబ్జాలపై ఉక్కుపాదం మోపుతున్నారు. డిప్యూటి కమిషనర్లు, టౌన్ ప్లానింగ్ విభాగ అధికారులు క్షేత్రస్థాయిలో తిరిగి పరిశీలిస్తుండటంతో పాటు అక్రమ కట్టడాలపై ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా గతానికి భిన్నంగా వెంటవెంటనే స్పందిస్తూ తనిఖీచేసి అవసరమైతే వెన్వంటనే కూల్చివేతలు చేస్తున్నారు. వాహనాల రాకపోకలు, ట్రాఫిక్ ఇబ్బందులు, పాదచారులకు అంతరాయం, భద్రత తదితర అంశాలపై అక్రమ కట్టడాలు, కబ్జాల వల్ల తలెత్తే ఇబ్బందులను తొలగించే విషయంలో వాటిని కూల్చివేయటంలో ఎలాంటి ఉపేక్షత ఉండదని బోడుప్పల్ డిప్యూటీ కమిషనర్ ఎ.శైలజ ఈ సందర్భంగా హెచ్చరించారు.

**గాయత్రిహిల్స్‌లో...** అనుమతిలేని షెడ్ నిర్మించటం వల్ల కాలనీవాసులకు తీవ్ర ఇబ్బంది కలుగుతోందంటూ అధికారులకు ఫిర్యాదు అందింది. దీంతో డిసి శైలజ ఆదేశాల మేరకు గురువారం సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులు జెసిబి వాహనంతో ఆ షెడ్‌ను కూల్చివేసారు. ఉప్పల్ సర్కిల్ పరిధిలోని ప్రశాంతనగర్ ప్రాంతంలో ఓ నూతన భవన యజమాని రహదారిని ఆక్రమించి స్టిల్ట్ ఫ్లోర్‌లో నిర్మించిన గదిని టౌన్ ప్లానింగ్ విభాగ ఎసిపి నాగిరెడ్డి ఆధ్వర్యంలో కూల్చివేసారు.

# విమానరంగంపై.. విజ్ఞానం పెంపొందించుకోవాలి

✻ బాలికలకు ప్రత్యేక శిక్షణ

✻ బోయింగ్ సుకన్య స్టెమ్ ల్యాబ్ ప్రారంభోత్సవంలో సిఆర్పీఎఫ్ డిజి జి.పి. సింగ్

**ప్రజాపక్షం/జవహర్ నగర్ :** విమాన రంగంలో అపారమైన అవకాశాలు ఉన్నాయని, బాలికలు విజ్ఞానాన్ని పెంపొందించుకోని ఉన్నత శిఖరాలవైపు అడుగులు వేయాలని సీఆర్పీఎఫ్ డీజీ జి.పి. సింగ్ పిలుపునిచ్చారు. చంద్రపురి కాలనీ డివిజన్ అరుంధతినగర్ సీఆర్పీఎఫ్ క్యాంపస్‌లో బోయింగ్ ఇండియా, సౌత్ ఏసియా అధ్యక్షుడు సలీల్ గుప్తే ఆధ్వర్యంలో బోయింగ సుకన్య స్టెమ్ ల్యాబ్ను గురువారం సీఆర్పీఎఫ్ డీజీ జి.పి. సింగ్ సమక్షంలో ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీఆర్పీఎఫ్ డీజీ జి.పి. సింగ్ హాజరై మాట్లాడుతూ విద్యార్థులకు ఆచరణాత్మక, ప్రత్యక్ష అభ్యాసంతో సైన్స్, టెక్నాలజీని అందిపుచ్చుకోవచ్చని, బాలికలు ఏవియేషన్లో దూసుకుపోవాలని, వారికోసం ప్రత్యేకంగా రూ. 1.25కోట్ల వరకు స్కాలర్షిప్ సహాయం బోయింగ్ సంస్థ అందించనుందని అన్నారు. మహిళలు నేల నుంచి నింగి వర కు అన్ని రంగాల్లో రాణించాలని తెలిపారు. ఆధునిక సాంకేతిక విద్యతోనే ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయని, నూతన ఆవిష్కరణలు సృష్టికర్తలుగా విద్యార్థులు సంసిద్ధులు కావాలని పేర్కొన్నా రు. బోయింగ్ సుకన్య స్టెమ్ సంస్థ సేవలు అభినందనీయమన్నారు. విద్యార్థులు రూపొందించిన వినూ్న ప్రాజెక్టులను జీపీ సింగ్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సిఆర్‌పిఎఫ్ సౌత్ సెక్టార్ ఐజిపి విక్రమ్, డిఐజిపి వీరరాజు, ప్రవీణ యగ్నాంబట్, డిసి సిఆర్పీఎఫ్, పాఠశాల ప్రిన్సిపల్ అపర్ణ, వైస్ ప్రిన్సిపల్ ఆశాజీ కుమార్, ఫిజికల్ డైరెక్టర్ రాజశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.





## ఘనంగా శిరీషా కృష్ణారెడ్డి జన్మదిన వేడుకలు

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** అలియాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ కమఠం శిరీషా కృష్ణారెడ్డి జన్మదిన వేడుకలు లాల్‌గడిమలక్‌పేటలోని ఎన్‌పిఆర్ గార్డెన్‌లో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు రాష్ట్ర సీనియర్ నాయకుడు నక్క ప్రభాకర్‌గౌడ్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి పీసరి మహిపాల్‌రెడ్డి, మాజీ డిసిసి హరివర్ధన్‌రెడ్డి, మేడ్చల్ గ్రంథాలయ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్‌రెడ్డి, మేడ్చల్ మార్కెట్ కమిటి చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహాయాదవ్‌లు విచ్చేసి కేక్ కట్ చేయించి పూలబొకే, శాలువాతో ఘనంగా సన్మానించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సంద ర్భంగా నాయకులు మాట్లాడుతూ అలియాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ కమఠం శిరీషా కృష్ణారెడ్డి ప్రజల సంక్షేమం, అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు పొందాలని ఆకాంక్షించారు. ఉమ్మడి శామీర్ పేట మండలంతో పాటు, మేడ్చల్ జిల్లా నలుమూలల నుంచి పెద్ద ఎత్తున కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, శ్రేయోభిలాషులు హాజరై కమఠం శిరీషా కృష్ణారెడ్డికి జన్మదిన శుభాకాంక్ష లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అలియాబాద్ కాంగ్రెస్ అధ్యక్షుడు తుంకి రమేష్, కమిషనర్ వెంకట్‌రెడ్డి, వైస్ చైర్మన్ కన్‌రెడ్డి మాలతి మాధవరెడ్డి, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ మంటపాల వద్ద జాతీయ పతాక ఆవిష్కరణలు



**ప్రజాపక్షం/దుండిగల్ :** దుండిగల్ సర్కిల్ పరిధిలోని బౌరంపేట శివసేన యూత్, భ్రమరాంబ యూత్, శివశక్తి యూత్, నవభారత్ యూత్, మరియమ్మ యూత్, అంబేద్కర్ యూత్, కీర్తి హోమ్స్, ల్యాండ్ మార్క్ 2, ప్రణీత్ బ్లూమ్స్, తదితర ప్రాంతాలలో జాతీయ పతాకం ఆవిష్కరించి వందేమాతరం గీతం పూర్తిగా ఆలపించి స్వతంత్ర సమరయోధులను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో దుండిగల్ సర్కిల్ గణేష్ ఉత్సవ సమితి కన్వీనర్ పీసరి కృష్ణారెడ్డి, కుత్బుల్లాపూర్ అసెంబ్లీ కో కన్వీనర్ గోనె మల్లారెడ్డి, వందేమాతరం ఇంచార్జి దమ్మగారి ప్రభాకర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ పీసరి బాలమణి కృష్ణారెడ్డి, మాజీ వార్డు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ నిర్మాణాలు కూల్చివేత

**ప్రజాపక్షం/చర్లపల్లి:** అనుమతులు లేకుండా నిర్మాణాల చేపడితే చర్యలు తప్పవని ఘట్‌కేసర్ డిప్యూటీ కమిషనర్ వాణి అన్నారు.గురువారం ఘట్‌కేసర్ సర్కిల్ పరిధిలోని నాగారం,రాంపల్లిలో అక్రమ షెడ్లు,అదనపు అంతస్తుల నిర్మాణాలను గుర్తించి టౌన్‌ప్లానింగ్ అధికారులు,సిబ్బందితో కలసి డిసి ఆదేశాల మేరకు కూల్చివేశారు.ప్రతి ఒక్కరూ అనుమతులు పొంది నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఏసిపి శ్రీధర్,టిపిబిఓ సందీప్,సిబ్బంది తదితరులు పాల్గొన్నారుపాల్గొన్నారు.



## భూస్వాముల ప్రయోజనాల కోసమే పటేల్ సైన్యం వచ్చింది

సిపిఐ జాతీయ సమితి సభ్యుడు యూసఫ్

**ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్:** తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల ముగింపు సభను సిపిఐ, సిపిఎం ఆధ్వర్యంలో గురువారం షాపూర్‌నగర్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిపిఐ జాతీయ సమితి సభ్యుడు యూసఫ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ సంస్థానంలో నిజాం, రజాకార్ల అరాచకాలకు, భూస్వాముల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా భూమి, విముక్తి కోసం కమ్యూనిస్టు పార్టీ ఇచ్చిన పిలుపుతో తెలంగాణలోని అనేక గ్రామాల ప్రజలు సాయుధ పోరాటంలో పాల్గొన్నారని తెలిపారు. భూస్వాముల ఆధీనంలోని భూములను పేద ప్రజలకు పంచడంతో పాటు నిజాం పాలనకు వ్యతిరేకంగా ప్రజలు పోరాడారని పేర్కొన్నారు. సాయుధ పోరాటం ఉద్ధృతమైన నిజాం ఓటమి ఖాయమవుతున్న సమయంలో కమ్యూనిస్టులు అధికారంలోకి వస్తే భూస్వాముల భూములు పేదలకు దక్కుతాయనే భయంతో అప్పటి నెహ్రూ ప్రభుత్వంతో నిజాం విలీనానికి సంబంధించి సంప్రదింపులు జరిపారని ఆరోపించారు. అనంతరం వచ్చిన పటేల్ సైన్యం రజాకార్లతో పోరాడటంతో పాటు నిజాం పాలనను పూర్తిగా తొలగించకుండా, నిజాంను గవర్నర్‌గా నియమించిందని, ఈ పరిణామాలు ప్రజా రాజ్యం కోసం కాకుండా భూస్వాముల ప్రయోజనాలను కాపాడేందుకేనని ఆయన విమర్శించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమామహేష్, సిపిఎం మండల కార్యదర్శి లక్ష్మ ణ్ మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటానికి నాయకత్వం వహించింది కమ్యూనిస్టు పార్టీయేనని అన్నారు. ఆ పోరాట వారసత్వాన్ని కొనసాగిస్తున్నది కమ్యూనిస్టు పార్టీలేనని పేర్కొన్నారు. తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను బిజెపి వక్రీకరిస్తోందని, దానిని కేవలం విమోచన దినంగా, హిందూ–ముస్లింల మధ్య జరిగిన ఘర్షణగా చిత్రీకరించే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. వాస్తవ చరిత్రను ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమానికి సిపిఐ మండల కార్యదర్శి స్వామి అధ్యక్షత వహించారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రీనివాస్, కౌన్సిల్ సభ్యుడు నర్సింహారెడ్డి, సిపిఐ నాయకులు బక్కరి మల్లేష్, శ్రీనివాస్, మహేందర్, రాజేష్, రమేష్, మహేష్, సిపిఎం నాయకుడు శ్రీనివాస్‌తోపాటు నాయకులు, కార్యకర్తలుపాల్గొన్నారు.



## బాలసదంలో సేవా కార్యక్రమాలు

**ప్రజాపక్షం/పరిగి:** భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకొని పరిగి పట్టణ మహిళామోర్చా అధ్యక్షురాలు జి.అనూష ఆధ్వర్యంలో పరిగి పట్టణంలోని బాలసదంలో సేవా కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. బాలసదంలోని బాలబాలికలకు స్కూల్ బ్యాగులను అందజేసి వారికి స్వీట్లు పంపిణీ చేశారు. సేవ సమాజం పట్ల బాధ్యత విద్యార్థుల భవిష్యత్తుకు తోడ్పాటు అనే స్ఫూర్తితో ఇలాంటి కార్యక్రమాలను నిరంతరం కొనసాగించేందుకు మహిళా మోర్చా కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బాలకృష్ణారెడ్డి, అనసూయ, నరసింహ, అంజయగుప్త, లక్ష్మి , తదితరులు పాల్గొన్నారు



## గడీలను గడగడ లాడించిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం

సిపిఐ వికారాబాద్ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి పండిత్

**ప్రజాపక్షం/తాండూరు:** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంతో గడిలను గడగడ లాడించిన ఘన చరిత్ర కమ్యూనిష్టులదని సిపిఐ వికారాబాద్ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి పండిత్ అన్నారు. గురువారం వికారాబాద్ జిల్లా తాండూరులోని అంబేద్కర్ చౌక్‌లో జాతీయ జెండాను జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి పండిత్, రవీందర్‌లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 11నుండి 17వరకు తెలంగాణ ప్రాంతంలో సిపిఐ తెలంగాణ రైతాంగ పోరాట వారోత్సవాలను జరుపుకుంటుందన్నారు. ఈ మహోత్తర పోరాట చరిత్రను భవిష్యత్ తరాలకు, ప్రజలకు తెలియజేసే బాధ్యత సిపిఐ ప్రతి కార్యకర్తపై ఉందన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వస్తే ఆనాటి హైదరాబాద్ మాత్రం మహారాష్ట్ర, కర్నాటక ప్రాంతాలకు చెందిన ఎనిమిది జిల్లాలను కలుపుకుని నిజాంరాజు సంస్థానంగా పాలన కొనసాగించారని గుర్తు చేశారు. నిజాం రాజు పాలనలో రజాకార్లు, జమీందార్లు, జాగీరుదార్లు, హింసించడం, మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించడంతో పాటు మహిళలను వివస్త్రలను చేసి బుతకమ్మ లాడించి దాడులకు, దౌర్జన్యాలకు పాల్పడే వారని అన్నారు. వారి దాష్టీకాలను సహించలేని కామ్రేడ్ రావి నారాయణరెడ్డి, కామ్రేడ్ మఖ్దూం మొయినుద్దీన్, కామ్రేడ్ బద్దం ఎల్లారెడ్డిల నాయకత్వంలో సాయుధ పోరాటానికి పిలుపునిచ్చారని గుర్తు చేశారు. సాయుధ పోరాటం 4వేల మంది కమ్యూనిస్టుల రక్తతర్పణంతో 10లక్షల ఎకరాలు భూమిని నిరుపేదలకు పంచి 3 వేల గ్రామాలను విముక్తి చేశారని అన్నారు. తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను ప్రజలకు తెలియ జేయాల్సిన అవసరం ఉందని నేటికి గడీలను గడగడ లాండించిన కమ్యూనిష్టుల 75యేండ్ల వీర గాథ అన్నారు. కావున కమ్యూనిష్టులకు పవిత్రమైన ఆ చరిత్రలను తమ వక్రబుద్ధితో తప్పుదోవ పట్టించవద్దని విజ్ఞప్తి చేశారు. తమ త్యాగాలు, బలిదానాలతో ప్రజల సంక్షేమమే జీవిత లక్ష్యంగా మరణాన్ని కూడా అమరత్వంగా భావించే కమ్యూనిష్టులకు ఎలాంటి పోటీ లేదన్నారు. ఈ కార్యక్రమంలో బుగ్గప్ప, రాజు, పెంటప్ప, తదితరులు పాల్గొన్నారు.

## డిజె, సౌండ్ సిస్టమ్ స్వాధీనం

**ప్రజాపక్షం/చర్లపల్లి:** గణేష్ నిమజ్జనం సందర్భంగా నిబంధనలకు విరుద్ధంగా అధిక శబ్దాలతో డిజే నిర్వహిస్తున్న సౌండ్ సిస్టమ్‌ను కుషాయిగూడ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కుషాయిగూడ పిఎస్ పరిధిలోని కుషాయిగూడ హుం డాయ్ షోరూమ్ వద్ద అధిక శబ్దం నిర్వహిస్తున్నారని డయల్ 100 ద్వారా సమాచారం అందిన వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు నేరేడ్‌మెట్ కు చెందిన జస్వంత్, కె వెంకట్‌రావులను గుర్తించి వారి ఆధీనంలో ఉన్న సౌండ్ సిస్టమ్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని తెలిపారు. డిజే, సౌండ్ సిస్టమ్‌ల వినియోగంపై విధించిన నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తప్పవని కుషాయిగూడ పోలీసులు తెలిపారు.



# తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల ముగింపు సభ దృశ్యాలు












రావి నారాయణరెడ్డి ఆడిటోరియంలో...




## పాలకులకు భయమెందుకు?

**(మొదటి పేజీ తరువాయి)**

చేశారు. ఆ వీరోచిత సాయుధ పోరాట చరిత్రను గుర్తించాల్సిందేనని, విలీన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాల్సిందేనని వారు డిమాండ్ చేశారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల ముగింపు సం దర్భంగా సిపిఐ రాష్ట్ర సమితి ఆధ్వ ర్యంలో గురువారం హైదరాబాద్‌లోని ఎగ్జిబిషన్ మైదానంలో 'పోరాట స్ఫూర్తి సభ' జరిగింగింది. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అధ్యక్షతన జరిగిన సభలో సిపిఐ జాతీయ కార్యదర్శులు పల్లా వెంకట్‌రెడ్డి, కె.రామకృష్ణ, సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె.నారాయణ, సిపిఐ మాజీ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శులు తక్కళ్ళపల్లి శ్రీనివాస్, ఈ.టి. నరసింహా ప్రసంగించారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పశ్య పద్మ, బాగం హేమంతరావు, కలవేన శంకర్, ఎం.బాలనర్సింహ, వి.ఎస్. బోస్, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, సిపిఐ సీనియర్ నాయకులు సయ్యద్ అజీజ్ పాషా, డాక్టర్ బి.వి.విజయలక్ష్మి, పి.ప్రేమ్ పావని, మౌలానా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, వివిధ జిల్లాల కార్యదర్శులు వేదికపై ఆశీనులయ్యారు.

**బిజెపి సర్టిఫికేట్లు ఇస్తుండడం సిగ్గుచేటు : కె.రామకృష్ణ**



తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం లోనే కాదు దేశ స్వాతంత్ర ఉద్యమంలో కూడా పాల్గొనని ఆర్‌ఎస్ ఎస్, బిజెపి నాయకులు నేడు దేశభక్తులు, దేశభక్తులు కాదని సర్టిఫికెట్లు ఇస్తుడడం సిగ్గుచేటని కె.రామకృష్ణ అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం రెండు మతాలు, కులాల మధ్య జరిగిన పోరాటం కాదని, భూమి, భుక్తి, నిజాం పాలన నుంచి విముక్తి కోసం సాగిన ప్రజా పోరాటమని ఈపోరాటంతో ఏ సంబంధం లేని బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ శక్తులు చరిత్రను వక్రీకరించే ప్రయత్నం చేస్తున్నాయని విమర్శించారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఆర్థిక, రైతు, నిరుద్యోగ సమస్యలను పరిష్కరించడంలో విఫలమైందని, కేవలం మతాల మధ్య చిచ్చు పెట్టి ప్రజలను విభజించే రాజకీయాలకు పాల్పడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, లౌకికవాద పరిరక్షణకు లౌకిక శక్తులన్నీ ఐక్యంగా ముందుకు రావాలని ఆయన కోరారు. వామపక్ష పార్టీలన్నీ ఐక్యమై కమ్యూనిస్టు ఉద్యమ పునరేకీకరణకు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

**ఉపరాష్ట్రపతితో అబద్ధాలు చెప్పిస్తున్నారు : నారాయణ**



తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంతో ఏ సంబంధంలేని బిజెపి విమోచనం దినం పేరుతో బహిరంగ సభ నిర్వహిస్తూ దేశ ద్వితీయ పౌరుడైన ఉపరాష్ట్రపతితో అబ్ధదాలను చెప్పించే స్థాయికి ఆ పార్టీ నాయకులు దిగజారడం విచారకరమని డాక్టర్ కె.నారాయణ అన్నారు. చరిత్రను వక్రీకరించే కుటిల ప్రయత్నాలను ప్రజలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. తెలంగాణలో ఏ భూమి కోసమైతే కమ్యూనిస్టులు నిలబడ్డారో వారు బలహీనపడటంతోనే భూమి కోసం ఇతర శక్తులు పోటీ పడుతున్నాయన్నారు. అదే కమ్యూనిస్టు ఉద్యమం బలంగా ఉండి ఉంటే పేదలకు ఆ భూమి దక్కేదని పేర్కొన్నారు. 'దున్నేవాడికే భూమి' నినాదంతో కమ్యూనిస్టులు సాగించిన పోరాట స్ఫూర్తితో పేదలకు భూములు దక్కేలా ఉద్యమాలను బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. కేవలం నిరసనలు, ఫొటోలకు పరిమితం కాకుండా స్థానికంగా ప్రజలను సమీకరించి ప్రత్యక్ష, సమరశీల పోరాటాలు నిర్వహించాలని కోరారు. జనాభా పరంగా ప్రపంచంలోనే అతిపెద్ద దేశమైన భారత ప్రధాని అమెరికా అధ్యక్షుడి ముందు మోకరిల్లడం సిగ్గుచేటని పేర్కొన్నారు. దేశం నుంచి చమురు కొనాలో వద్దో డొనాల్డ్ ట్రంప్ నిర్ణయిస్తే ప్రధాని మోదీ దానిని పాటించడం ఆక్షేపనీయమన్నారు. ట్రంప్‌కు ప్రధా ని మోదీ బానిసగా మారితే మోదీకి ఎపి ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, తెలంగాణలో బిఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షులు కెటిఆర్ బానిసలుగా మారి సమర్థిస్తున్నారని ఆయన విమర్శించారు.

**తెలంగాణ అమరవీరుల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి: చాడ వెంకట రెడ్డి**



తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్ర, అమరుల త్యాగాలు శాశ్వతంగా ఉండాలంటే 'తెలంగాణ అమర వీరుల కార్పొరేషన్' ఏర్పాటు చేయడంతో పాటు త్యాగధనుల చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలని చాడ వెంకట రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ సాయుధ పోరాటాన్ని మొదటి నుంచి కనుమరుగు చేసే కుట్ర సాగిందని, ఆనాడు కాంగ్రెస్ ప్రభుత్వం ఆ తర్వాత కెసిఆర్ ప్రభుత్వం ఇప్పుడు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కూడా అదే చేస్తోందన్నారు. నాటి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారసులుగా వారి స్ఫూర్తితో దున్నేవాడికే భూమి, పేదవాడికి నివేశన స్థలం నినాదంతో ఉదృతమైన భూపోరాటాలకు కంకణబద్దులు కావాలని చాడ వెంకటరెడ్డి పిలుపునిచ్చారు.

## చరిత్ర విచ్ఛిన్నకారులు

**(మొదటి పేజీ తరువాయి)**

వారు చరిత్ర విచ్ఛిన్నకారులని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'విమోచన దినం' పేరుతో బహిరంగ సభ నిర్వహిస్తున్న బిజెపి నాయకులు ఎక్కడి నుంచి ఏమి విమోచన చేశారు? ఎందుకు ఆ పేరు పెట్టుకున్నారో చెప్పాలని సాంబశివరావు ప్రశ్నించారు. తెలంగాణ సాయుధ పోరాటంలో ఆ పార్టీకి చెందిన ఒక్క నాయకుడైనా పాల్గొన్నాడా, వారి వారుసులు ఒక్కరైనా ఉన్నారా చెప్పాలని ఆయన నిలదీశారు. "హైదరాబాద్ సంస్థానాన్ని మా సర్దార్ వల్లభాయ్ పటేల్ విమోచన చేశారని బిజెపి నాయకులు అంటున్నారు. నిజాంను రాజ్ ప్రముఖ్‌గా (గవ్నరర్) నియమిస్తూ నియామక పత్రాన్ని ఇచ్చింది మీ సర్దార్ వల్లభాయ్ పటేలే. గాంధీజి గాడ్సే హత్య చేసిన అనంతరం ఆర్‌ఎస్‌ఎస్‌ను నిషేధించింది కూడా మీ సర్దార్ వల్లభాయ్ పటేలే. మీ అనుకుంటున్న సర్దార్ వల్లభాయ్ పటేల్ ఇప్పుడు బతికి ఉంటే మీలాంటి మూర్ఖులు, మీలాంటి మతమౌఢ్యులకు నేను నాయకుడిని ఎలా అయ్యాను" అని చింతించేవారని కూనంనేని సాంబశివరావు అన్నారు.

### ఎర్రజెండా వారసులమంతా ఒక్కటవుద్దాం

కమ్యూనిస్టులుగా తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట నిజమైన వారసులుగా ఈ నేల కోసం, పేదవాడి కోసం అమరులు చిందించిన రుధిర చుక్కలన్నీ కలబోసిన ఆ ఎర్రజెండాను భుజాన వేసుకున్న కమ్యూనిస్టులమంతా ఒక్కటవుదామని వామపక్ష పార్టీలకు కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. అలా ఒక్కటైన కమ్యూనిస్టులంతా ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఎటువంటి కష్టాలకైనా సిద్ధపడదామని, అవి జైళ్లు గాని, లాఠీలు గాని, తుటాలు గాని దేనికైనా సిద్ధపడదామన్నారు. తద్వారా పోరాటం, త్యాగం, వీరత్వం, జాలి, కరుణ అంటే కమ్యూనిస్టులని, దేనికైనా సరే మనుషుల కోసం పుట్టిన సిద్ధాంతమే కమ్యూనిజమని నిరూపిద్దామని కూనంనేని సాంబశివరావు అన్నారు.

## కాంగ్రెస్‌ది ప్రజాపాలనా?

**(మొదటి పేజీ తరువాయి)**

నేటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెబుతున్నారని విమర్శించారు. దేశాన్ని, రాష్ట్రాన్ని అంత్యంత ఎక్కువ కాలం పాలించింది కాంగ్రెసేనని, సిఎంగా రేవంత్‌రెడ్డి అధికారం చేపట్టిన తర్వాతే కాంగ్రెస్ ప్రజా పాలన కొనసాగిస్తున్నదా? అంతకు ముందు ఉన్న కాంగ్రెస్ ముఖ్యమంత్రులది ప్రజా పాలన కాదా అని వెంకట రెడ్డి ప్రశ్నించారు. కమ్యూనిస్టుల నిజమైన చరిత్రను చెప్పే దమ్ము, ధైర్యం లేకనే కాంగ్రెస్, బిజెపి, బిఆర్ఎస్ నాయకులు కేవలం రాజకీయ లబ్ధి కోసమే ఈ నాటకాలు ఆడుతున్నారని విమర్శించారు. బిజెపి ఏకంగా తమ మొదటి శత్రువులు కమ్యూనిస్టులుగా భావిస్తూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం చరిత్రను పూర్తిగా వక్రీకరిస్తూ దేశంలో మళ్లీ అర్ధ భూసామ్య వ్యవస్థను, మనువాద సిద్ధాంతాన్ని తీసుకువచ్చే ప్రయత్నం చేస్తోందన్నారు. అందులోభాగంగానే బిజెపి ప్రభుత్వం కమ్యూనిజాన్ని నామ రూపాలు లేకుండా చేయాలనే తలంపుతో మొదటగా మావోయిస్టులను ఏరివేసే కార్యక్రమం చేపట్టి ప్రస్తుతం కమ్యూనిస్టులను అర్బన్ నక్సలైట్లుగా ముద్ర వేస్తున్నదన్నారు. గత 12 ఏళ్లుగా దేశాన్ని పరిపాలిస్తూ ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న బిజెపిని గద్దె దించడమే లక్ష్యంగా 'బద్లావ్ జరూరీ హై' నినాదంతో సిపిఐ దేశ వ్యాప్తంగా పాద యాత్రలు, ప్రజా ప్రచార యాత్రలు నిర్వహించి సెప్టెంబర్ 1న ఢిల్లీలో బహిరంగ సభను నిర్వహించిందన్నారు. ఈ క్రమంలోనే బీహార్‌లో జరిగిన ఉప ఎన్నికల్లో గత 50 ఏళ్లుగా గెలుపొందుతూ వస్తున్న బిజెపి ఆ స్థానంలో ఓడిపోవడం ద్వారా మార్పునకు నాంది పలికిందన్నారు.

### కమ్యూనిస్టులే దేశ భవిష్యత్

"రాజకీయ ప్రత్యామ్నయం కోసం దేశ ప్రజలు ఎదురు చూస్తున్నారు. ప్రత్యామ్నయం ఉన్న చోట ప్రజా వ్యతిరేక పాలకులను ప్రజలు ఖచ్చితంగా ఓడిస్తారు. ఆ ప్రత్యామ్నాయం కమ్యూనిస్టులే కావాలని, అందుకు కమ్యూనిస్టు పార్టీలన్నీ ఏకం కావాలని ప్రజలు కోరుకుంటున్నారు" అని పల్లా వెంకట రెడ్డి అన్నారు. ఇందుకు వామపక్ష పార్టీలు ఇప్పటికిప్పుడు ఏకం కాకపోయినా ఎన్నికల్లో మాత్రం కమ్యూనిస్టు పార్టీలన్నీ ఒకే గుర్తుపై పోటీ చేస్తే ప్రజలు ఆలోచిస్తున్న ప్రత్యామ్నయం కమ్యూనిస్టులు కాగలుగుతారని, ఆ దిశగా వామపక్ష పార్టీల నాయకులు కలిసి రావాలని పల్లా వెంకట రెడ్డి కోరారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com